మాసబ్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
కరీంనగర్
fb.com/vaartha Digital

Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-3-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 58 పేజీలు: 8+16 వెల: 6.50

కేరళంలో ఇక కమల వికాసం: ప్రధాని మోడీ 5లో

అమెరికా వ్యాప్తంగా 'నోకింగ్స్' నిరసనలు



# తల్లిదండ్రులను కాపాడుదాం

వారి పోషణ, సంరక్షణ బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

నేటి యువతకు శ్రవణ కుమారుడే ఆదర్శం

రేమండ్ అధినేత ఇక్కట్లు ఎవరికీ రాకూడదు

బిడ్డల జీతం నుంచి పదిహేను శాతం కట్‌చేసి పేరెంట్స్ ఖాతాల్లో జమ

శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** ఉన్నతస్థాయిలో ఉన్న పిల్లలు వృద్ధాప్యంలో ఉన్న తమతమ తల్లిందండ్రుల సంరక్షణను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతతో వ్యవహరించాలన్న ఆలోచనతోనే 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం..పర్యవేక్షణ బిల్లు-2026 బిల్లును తీసుకువచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భక్తితో కాకపోయినా భయంతోనైనా తల్లిదండ్రులను చూసుకోవాలనేదే ప్రభుత్వ ప్రయత్నమన్నారు. బిల్లు ఆమోదం సందర్భంగా ఆదివారం శాసనసభలో సిఎం మాట్లాడుతూ పురాణాలలో మాతృ, పితృ భక్తికి శ్రవణ కుమారుడి కథ అద్దం పడుతోందన్నారు. అదే సమయంలో ముంబైలో మరణించిన ప్రఖ్యాత దుస్తుల బ్రాండ్ రేమండ్స్ మాజీ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత విజయ్ పథ్ సింఘానియా అంశాన్ని సీఎం ప్రస్తావించారు. వ్యాపారవేత్తగా విజయవంతమైన జీవితాన్ని గడిపిన సింఘానియా చివరికి కొడుకు చేసిన ద్రోహంతో అనామికుడిగా తనువు చాలించాల్సి వచ్చిందని చెప్పారు. విజయ్‌పథ్ సింఘానియా తన జీవితకాలపు కష్టార్జితాన్ని, సుమారు రూ.1,000కోట్ల విలువైన రేమండ్ సామ్రాజ్యపు వాటాలను కుమారుడికి గిఫ్ట్‌డీడ్ ద్వారా అప్పగించిన తర్వాత ఆయన జీవితం అత్యంత విషాదకరంగా మారిందని గుర్తు చేశారు. ఆస్తి చేతికి రాగానే ఆ కుమారుడు తనతండ్రిని నిరక్ష్యంల్ల చేయడమే కాకుండా, ముంబైలోని ప్రతిష్టాత్మక జేకే హౌస్‌లో ఆయనకు దక్కాల్సిన నివాసాన్ని కూడా నిరాకరించి బయటకు పంపించేశారన్నారు. తన ఆత్మకథ 'యాన్ ఇన్‌కంప్లీట్ లైఫ్‌లో ఈ చేదు అనుభవాలను సింఘానియా వివరిం చారని చెప్పారు. ఇలా ఒకవైపు ఆస్తిపాస్తులు లేక >>2



ఆదివారం అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు గురైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కెటిఆర్, హరీష్‌రావు సహా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై

# సస్పెన్షన్ వేటు

అసెంబ్లీని కుదిపేసిన కౌశిక్‌రెడ్డి వ్యవహారం

**హైదరాబాద్, మార్చి 29,ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆదివారం సభలో నిరసనలు చేపట్టి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు గందరగోళం సృష్టించడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సస్పెన్షన్ వేటు వేశారు. రాఘవకన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ >>2


# అసెంబ్లీలో బెదరింపులా?

గన్‌తో కాలుస్తానంటూ కౌశిక్ రెడ్డి చేసిన సైగలు రికార్డయ్యాయి..

మా వైపు కూడా కండలు తిరిగిన వారున్నారు: సిఎం రేవంత్

కౌశిక్ వ్యవహారం ఎథిక్స్ కమిటీకి సిఫారసు

**హైదరాబాద్,మార్చి29,ప్రభాతవార్త :** బిఆర్ఎస్ జాతి కక్ష, రాజకీయ వివక్ష ప్రదర్శిస్తోందనీ,దళితుడి సిఎం చేస్తాననీ మాటా మార్చడమే కాకుండా ప్రతిపక్షనేతగా భట్టిని లేకుండాచేశారని, ఇప్పుడు దళిత స్పీకర్ విఫలమైనట్లు బయట ప్రచారంచేయడానికి రాజకీయకుట్రకు తెరలేపారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బిజెపి నేతలు సూచనలు చేసి పారిపోయే రకమని ఎద్దేవా సిఎంచేశారు. ఆదివారం శాసనసభలో బిఆర్ఎస్ స్పీకర్ పోడియం చుట్టు చేపట్టిన నిరసనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియంశ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరును కెటిఆర్, హరీష్ రావు, ఇతర బిఆర్ఎస్ నేతలంతా సమర్థిస్తారా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి చేతితో సైగ చేస్తూ గన్‌తో కాలుస్తానని అన్నారని సిఎం ఆరోపించారు. అతని ప్రవర్తన అంతా వీడియో కెమెరాల్లో రికార్డయిందని పేర్కొన్నారు. కౌశిక్ వ్యవహార శైలిని సమర్థిస్తే అసెంబ్లీలో కత్తిపోట్లు జరుగుతాయన్నారు. మావైపుకూడా కండలు తిరిగిన మక్కాన్ సింగ్ లాంటి ఎమ్మెల్యేలు ఉన్నారనీ సిఎం >>2



ఆదివారంహైదరాబాద్‌లో ఎమ్మెల్యేల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి 2లో

క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగం: సిఎం 2లో

# సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నిస్తున్నందుకే కౌశిక్‌పై కక్ష కట్టారు: హరీష్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి29:** అక్రమ మైనింగ్‌పై మాకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వకుండా,వాళ్లకు వాళ్లే సిబిసిఐడి విచారణ అంటూ చెప్పుకొని వస్తున్నారు. అక్రమ మైనింగ్ హౌస్ కమిటీ వెయ్యాలని డిమాండ్ చేస్తే దళితులపై రాజకీయం చేశారని మాజీ మంత్రి,బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తన బావమరిది, తమ్ముడిపై సీఎం ఆరోపణలు చేశారన్న ఆయన సీఎం తమ్ముడు, బావమరిదిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని గుర్తు చేశారు. తన బావమరిది, తమ్ముడిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధమని ప్రకటించారు. సీఎం తమ్ముడు, బావమరిదిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధమా? అని అడిగారు. హౌస్ కమిటీ కాదు, సీబీసీఐడీ కాదు, నేరుగా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిద్దామని అన్నారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు తాను సిద్ధమని, సీఎం సిద్ధమా? అని ప్రశ్నించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటిని కాపాడేందుకు వంద అబద్ధాలు ఆడి సీఎం రేవంత్ దొరికిపోయారని పేర్కొన్నారు.ఏ పని >>2

# గొర్రెలకాపరులను మింగిన చెరువు

ఇద్దరు దుర్మరణం



మృతులు (ఫైల్)

**కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త;** గొర్రెలను కాపాడే సమయంలో ఇద్దరి గొర్ల కాపర్ల ప్రాణాలను చెరువు బలికొన్న సంఘటన కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆదివారం చెరువులో గొర్రెలను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఇద్దరు గొర్ల కాపరులు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మూడికే లక్ష్మీ ౣరాజం (73), కుమ్మం రవి అలియాస్ మొండయ్య(54) అనే గొర్రె కాపర్లు చెరువులో పడి మృతి చెందారు. రోజు మాదిరిగా గొర్రెలను మేపేందుకు గ్రామంలోని ఊరచెరువు వద్దకు తోలుకెళ్లారు. ఈ క్రమంలో గొర్రెలను శుభ్రం చేసేందుకు గొర్రెలతోపాటు చెరువులోకి దిగారు. ఈ క్రమంలో లక్ష్మీరాజం చెరువులోని లోపలికి వెల్లగా ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోతుండగా కాపాడేందుకు వెళ్లిన మొండయ్య సైతం మునిగిపోవడంతో గమనించిన మరో కాపరి గ్రామస్తులకు సమాచారం అందించాడు. వారు వచ్చేలోపే చెరువులో పడి మునిగిపోయారు. ఎస్సై ప్రశాంత్ రెడ్డి, గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకుని స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలించి మృతదేహాలను బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఒకేసారి చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాలపై ఇరువురి కుటుంబ సభ్యులు పడి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడు లక్ష్మీరాజం కు భార్య లక్ష్మీ, కుమారుడు పర్శరాములు,కూతురు జ్యోతి ఉన్నారు.మృతుడు రవి అలియాస్ మొండయ్య కు భార్య మంగవ్వ, ముగ్గురు కుమారులు ప్రశాంత్, వినయ్,వంశీ లు ఉన్నారు.మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ మిర్యాల్కర్ బాలాజీ, ఉప సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు కోరారు.

## శక్తివంతమైన క్షిపణి ఇంజిన్‌పరీక్షించిన కిమ్‌జాంగ్ ఉన్

**ప్యాంగ్యాంగ్, మార్చి 29:** అమెరికా లక్ష్యంగా అణ్వాయుధాలు తయారుచేస్తున్న ఉత్తరకొరియా ఇపుడు తాజాగా అత్యధిక శక్తివంతమైన క్షిపణుల ఫ్యుయెల్ ఇంజిన్‌ను ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ పరీక్షించాడు. దేశ సైనిక వ్యూహాత్మక శక్తి, సామర్థ్యాల్ని పెంచే లక్ష్యంతో ఈ క్షిపణుల ఇంజిన్‌ను ఉత్తర కొరియా తయారు చేసింది. ఆయుధ సామర్థ్యాన్ని విస్తరించడం, మిస్సైల్స్ శక్తిని పెంచడంలో భాగంగా ఇప్పుడు కొత్త క్షిపణుల్ని ఉత్తర కొరియా తయారు చేసినట్లు అక్కడి అధికార మీడియా సంస్థ అయిన కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) ప్రకటించింది. దీని ప్రకారం తాజాగా పరీక్షించిన క్షిపణికి అమెరికాను చేరుకోగల సామర్థం ఉంది. ఇది నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయగలదు. తాజాగా ప్రయోగించిన క్షిపణి కార్బన్ ఫైబర్ మెటీరియల్‌తో తయారైంది. దీని ఇంజిన్ 2,500 కిలో టన్స్ పవర్ కలిగి ఉంది. గత సెప్టెంబర్‌లో ప్రయోగించిన క్షిపణి ఒకటి 1,971 కిలో టన్స్ సామర్థం కలిగి ఉంది. ఒకే మిస్సైల్ అనేక వార్ హెడ్లను మోసుకెళ్లగలదు. ముఖ్యంగా ఈ క్షిపణి అమెరికాను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించవచ్చు. ఐదేళ్ల సైనిక అభివృద్ధి లక్ష్యంలో భాగంగా ఈ క్షిపణుల్ని ఉత్తర కొరియా తయారు చేస్తోంది. ఇటీవల అక్కడి పార్లమెంట్‌లో కిమ్ ప్రసంగించాడు. తమ దేశం అణు సామర్థం కలిగి ఉందని తెలిపారు.



## ఖర్గ్ ద్వీపం అమెరికా స్వాధీనం

యుఎస్ నిఘా విమానం ధ్వంసం చేసిన ఇరాన్

వార్ మరింత ఉధృతం

**టెహ్రాన్, వాషింగ్టన్, మార్చి 29:** పశ్చిమాసియాలో ఇరాన్‌పై ఒదేశం ఇప్పటికీ ఉధృత దాడులుచేస్తుంటే మరోవైపు అగ్రరాజ్యం దాడులకు బ్రేక్ ఇచ్చినట్లుప్రకటించే ఇరాన్ కీలక స్థావరాలను ఆక్రమిస్తోంది. నెలరోజులు దాటిన మధ్యప్రాచ్య యుద్ధంలో ఇరాన్‌కు అపారమైన నష్టం వాటిల్లినప్పటికీ అమెరికా సైనికస్థావరాలు, వైమానిక స్థావరాలు లక్ష్యంగా దాడులు చేస్తున్న ఇరాన్ అకస్మాత్తుగా అమెరికా అవాక్స్ విమానాన్ని ధ్వంసంచేయడంతో ఒక్కసారిగా అగ్రరాజ్యం ఖంగుతిన్నది. ఈ-3 సెంట్రీ అవాక్స్ విమానం కదన రంగంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తోంది. 250 మైళ్లపరిధిలో గగనతలంలో ఏంజరిగినా ఈ విమానం గుర్తిస్తుంది. ఇపుడు ఈ విమానాన్ని ధ్వంసంచేయడంతో అమెరికాకు సుమారు ఆరువేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా ఇదిలా ఉంటే ఇరాన్‌పై భూతలదాడుల కోసం 3500 మంది మెరైన్లను సెంట్రల్ కమాండ్‌పరిధిలోకి తెచ్చారు. ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని ఈ మెరైన్‌ల సాయంతోనే స్వాధీనం చేసుకు న్నట్లు అమెరికా చెపుతోంది. >>2

## హౌజ్ కమిటీలు బ్లాక్‌మెయిల్‌కా?

బిఆర్ఎస్ వేసిన కమిటీలు ఏంచేశాయో చూశాం

సభ సాగకుండా బిఆర్ఎస్, బిజెపి కుట్రలు

విపక్ష ఎమ్మెల్యేల రాద్ధాంతం సరికాదు: డి.సిఎం భట్టి



**హైదరాబాద్,మార్చి29,ప్రభాతవార్త:** 'బిఆర్ఎస్ హయాంలో మూడు హౌస్ కమిటీలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఏమి సాధించారు? ఆ హౌస్ కమిటీలలో సభ్యుడిగా ఉన్న నేను సమావేశాలు నిర్వహించాలని కోరినప్పటికీ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు.హౌస్ కమిటీలను అడ్డంగా పెట్టుకుని ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్యేలను బ్లాక్‌మెయిల్ చేసి బిఆర్ఎస్‌లో చేర్చుకోవడం తప్ప ఒక్క కమిటీ నివేదికను కూడా బయట పెట్టలేదు' అంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం శాసనసభలో మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాలు సజావుగా జరగకుండా కుట్రపూరిత కార్యక్రమాలకు తెరలేపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం బిఆర్ఎస్‌కు తగదని హితవు చెప్పారు.బిజెపి శాసనసభ్యులు ఈ విషయంలో సలహాలు, సూచనలు ఇస్తామని అంటున్నారనీ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ జరపాలని కోరుతూ ఎనిమిది నెలలు అవుతున్నప్పటికీ వారు ఏమి చేస్తున్నారు? అని ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ ఎప్పుడో కలిసిపోయాయి.సభ సజావుగా నడవకూడదు, ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన వెల్ఫేర్ పథకాలపై చర్చ జరగకూడదని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు, విద్యార్థులకోసం ప్రవేశపె ట్టిన బ్రేక్‌ఫాస్ట్ పథకంపై చర్చ జరగకూడదు >>2

## లాయర్ల భద్రతకు ప్రత్యేక చట్టం

విద్వేషపూరిత ప్రసంగం, నేరాలను నివారించే బిల్లు ఆమోదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి29:** తెలంగాణలో న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది.దీనికి సంబంధించి తెలంగాణ న్యాయవాద రక్షణ బిల్లు-2026ను ఆదివారం శాసనసభ ఆమోదించింది. శాసనబద్ధమైన,వృత్తిపరమైన విధులు నిర్వహిస్తున్నప్పుడు ప్రత్యర్థి కక్షిదారుల నుంచి బెదిరింపులు,దాడులకు గురవుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. దీన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో పాటు తెలంగాణ విలువ ఆధారిత పన్ను(సవరణ)బిల్లును మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టారు. తెలంగాణ విద్వేషపూరితమైన ప్రసంగం,ద్వేషపూరితమైన నేరాలను నివా రించే బిల్లు,పంచాయతీరాజ్ మూడో సవరణ బిల్లులను మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టారు. తెలంగాణ ఫ్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల రక్షణ చట్టానికి సంబంధించిన బిల్లును మంత్రి వివేక్ సభలో ప్రవేశపెట్టారు. ఐదు బిల్లులను శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించింది.

2026-27 అర్థ సంవత్సరంలో..

# రూ.8.20 లక్షల కోట్ల రుణాలు

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రణాళిక

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** వచ్చే నెల నుండి ప్రారంభం అవుతున్న 2026-27 ఆర్థిక సంవత్సరంలోని మొదటి అర్థభాగం కోసం కేంద్ర ప్రభుత్వం రుణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్ నుండి సెప్టెంబరు నెలాఖరుతో ముగియనున్న అర్థ భాగానికి గాను 8.20 లక్షల కోట్ల రూపాయల మేర రుణాలను సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్‌ను సంప్రదించిన అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ఆర్థిక రుణ ప్రణాళికను ఖరారు చేసింది. వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలో స్థూల మార్కెట్ రుణాలు రూ.17.20 లక్షల కోట్లుగా ఉన్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుండి, ప్రభుత్వ సెక్యూరిటీల మార్పిడితో స్థూల మార్కెట్ రుణాలు రూ.16.09 లక్షల కోట్లకు తగ్గాయి. ఈ రూ.16.09 లక్షల కోట్లలో, బడ్జెట్‌లో పేర్కొన్న రుణ అంచనాల్లో 51.0 శాతం చొప్పున రూ.8.20 లక్షల కోట్లను మొదటి అర్థభాగంలో కాలపరిమితి గల సెక్యూరిటీల జారీ ద్వారా రుణంతీసుకోవాలని ప్రణాళికలో వెల్లడించింది. ఇందులో రూ.15 వేల కోట్ల సావరిన్ గ్రీన్ బాండ్లు (ఎస్‌జిఆర్‌బిఎస్) కూడా ఉన్నాయి. ఈ రూ.8.20 లక్షల కోట్ల స్థూల మార్కెట్ రుణాలు 26 వారాల సమయంలో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా పూర్తి సేకరించనుంది.

ఈ మార్కెట్ రుణాలు 3 సంవత్సరాలు, 5 సంవత్సరాలు, 7 ఏళ్లు, 10 ఏళ్ల, 15, 30, 40, 50 సంవత్సరాల కాలపరిమితి కలిగిన సెక్యూరిటీ బాండ్ల ద్వారా కేంద్రం సమీకరించనుంది. వివిధ కాలపరిమితుల క్రింద రుణాల వాటా 3సంవత్సరాలకు సంబంధించి (8.1శాతం), 5సంవత్సరాలు (15.4 శాతం), 7 సంవత్సరాలు (8.1 శాతం), 10సంవత్సరాలు (29.0శాతం), 15సంవత్సరాలు (14.5 శాతం), 30సంవత్సరాలు (7.3 శాతం), 40 సంవత్సరాలు (8.0 శాతం ), 50సంవత్సరాలు (9.6 శాతం) వడ్డీ రేటుతో సేకరించాలని ప్రతిపాదించింది. 202627 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ఏప్రిల్ నుండి జూన్ నెల వరకూ ట్రెజరీ బిల్లుల (టిబిల్లులు) జారీ ద్వారా 12 వారాలకు వారపు రుణం రూ.24,000 కోట్లుగా ఉంటుందని అంచనా వేసింది. ఇందులో 91రోజుల టిబిల్లుల కింద రూ.12 వేల కోట్లు, 182 రోజుల టిబిల్లుల కింద రూ.6 వేల కోట్లు, 364రోజుల టిబిల్లుల కింద మరో రూ.6 వేల కోట్లు జారీ చేయబడతాయి. కాగా ప్రభుత్వ ఖాతాలలో తాత్కాలిక అసమతు ల్యతలను సరిచేయడానికి, రిజర్వ్ బ్యాంక్ 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగం కోసం వేస్ అండ్ మీన్ అడ్వాన్సెస్ పరిమితిని రూ.2.50 లక్షల కోట్లుగా నిర్ణయించింది.



ఆదివారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమంలో ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్

## కేరళలో కాంగ్రెస్ కూటమి విజయం ఖాయం

### ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి29:** కేరళ రాష్ట్రంలో వచ్చే నెల 9వ తేదీన జరగ నున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వం లోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రానుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేరళలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నాడు పతనంతిట్ట జిల్లాలోని అదూర్ అసెంబ్లీ నియోజకవర్గం యూడీఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి శాంతకుమార్ (కాంగ్రెస్ పార్టీ) మద్దతుగా వివిధ ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూటమి పట్ల ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తున్న దన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి సాధించిన విజయాలు దీనికి నిదర్శనమని చెప్పారు. గత దశాబ్దంగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ ప్రభు త్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిం దని మంత్రి ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రచారం మాత్రమే జరిగిందిగాని, ప్రజలకు అందిన ఫలితాలు తక్కువగానే ఉన్నాయని విమర్శించారు. పదేళ్ల పాలన తర్వాత కూడా నిరుద్యోగం పెరుగుతుంటే, ప్రజలపై ఆర్థిక భారాలు అధికమవుతుంటే అది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా?" అని మంత్రి ప్రశ్నించారు. బీజేపీపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. దేశవ్యాప్తంగా మతపరమైన రాజకీయాలతో ప్రజలను విభజించే ప్రయత్నం జరుగుతోందని, కేరళలో ఆ పార్టీకి స్పష్టమైన అభివృద్ధి దిశ లేదని పేర్కొన్నారు.

## రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగం

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలలో సిఎం రేవంత్ రెడ్డి

### దుర్యోధనుడిగా మంత్రి శ్రీహరి..కట్టప్పగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్

### విజేతలకు బహుమతులను అందజేసిన సిఎం రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి29:** విద్యార్థులు మత్తు వైపు పోతున్నారు, తల్లిదండ్రు లకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారు, యూనివర్సిటీలలో కొందరు విద్యార్థులు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం ఉంటుందన్నారు. బాక్సింగ్‌లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్‌కు డీఎస్పీ జాబ్ ఇచ్చామని, క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామన్నారు. ఆదివారం సాయంత్రం రవీంద్రభారతిలో తెలంగాణ శాసనమండలి, శాసనసభల సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని సిఎం రేవంత్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగ ఇవ్వాలని క్రీడా పాలసీని తీసుకొచ్చామని చెప్పారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను రూ.700 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని, నిత్యం ప్రజా సమస్యలతో తీరిక లేకుండా నాయకులు ఉంటారు..కానీ మనిషి అన్నాక కొంత కళాపోషణ ఉండాలని చెప్పారు. తమలో ఉన్న ప్రతిభను చాలా మంది ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు మరిచిపోయారని, ఇప్పుడు తెరపైకి తెచ్చారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు నిర్వహించేవారు..తెలంగాణ ఏర్పాటు తర్వాత ఈ సంప్రదాయాన్ని కొనసాగించలేదని పేర్కొన్నారు.క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలల్లో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు తమలోని ప్రతిభను తెరపైకి తెచ్చారని, రాష్ట్రంలోని 50 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తి నిస్తాయన్నారు. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల క్రీడలను కూడా కొందరు రాజకీయం చేసి బహిష్కరించారని, వచ్చే ఏడాది అయినా వారు(బిఆర్ఎస్) పాల్గొనాలని సూచించారు. అంతకు ముందు రవీంద్రభారతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. ధుర్యోధనుడి పాత్రపై ఏకపాత్రాభినయం మంత్రి వాకిటి శ్రీహరి చేశారు. గద్దర్ వేషధారణలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఉద్యమ పాటలు పాడారు. కట్టప్ప పాత్రలో నటించి ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మెప్పించారు. కోయదొర పాత్రలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నటించి మెప్పించారు. బంజారా ఆడబిడ్డలతో కలిసి సేవాలాల్ పాటకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నృత్యం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తనదైన శైలిలో గిరిజన సాంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. సీనియర్ నటుడు శోభన్‌బాబు నటించిన సూపర్‌హిట్ పాటకు రామచంద్రనాయక్ చేసిన డాన్స్ హైలెట్‌గా నిలిచింది. విజేతలకు బహుమతులను అందజేసిన సిఎం రేవంత్‌రెడ్డి,మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలంగాణ శాసనసభ,శాసనమండలి సభ్యుల క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహుమతులను ప్రధానం చేశారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌లో రాణిచ్చిన సిఎం రేవంత్‌రెడ్డికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందజేశారు.

## ఖర్గ్ ద్వీపం అమెరికా స్వాధీనం

>> ఇదిలా ఉంటే అమెరికాతో చర్చలకు సిద్ధమేనని అయితే ఐదు షరతులు అంగీకరించాల్సిందేనని ఇరాన్ చెపుతోంది. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, హార్ముజ్‌జలసంధిపై ఎలాంటి జోక్యం ఉండకూడదని, గల్ఫ్‌దేశాల్లోని స్థావరాలన్నింటినీ ఎత్తివేయాలని, అలాగే భవిష్యత్తులో ఎలాంటి దాడులు ఉండవన్న హామీలతోనే తాము అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో చర్చలకు సిద్ధం అవుతామనిఇరాన్‌ప్రకటించినా అమెరికా వైపునుంచి మాత్రం ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఖతార్, ఒమన్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ చర్చల్లో మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో షరతులు లేని చర్చలకు మాత్రమే సిద్ధమని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో తాజా పరిణామాలపై ఆసక్తి నెలకొంది. కాల్పుల విరమణ వంటి కొన్ని అంశాలపై సానుకూలంగా స్పందించినా నష్టపరిహారం వంటి డిమాండ్‌కు అమెరికా అంగీకరించడం కష్టమనే అంచనాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఇపుడు యుద్ధంలోకి ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హౌతీలు యుద్ధంలోకి ప్రవేశించారు. దక్షిణ ఇజ్రాయెల్‌పై తొలిసారిగా బాలిస్టిక్ క్షిపణిదాడిచేసారు. మావేళ్లు ట్రిగ్గర్‌మీదే ఉన్నాయని, రెడ్‌లైన్ దాటితే యుద్ధం తప్పదని సైనిక బ్రిగేడియర్ జనరల్ యాహ్యాసారీ హెచ్చరించారు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని సున్నితమైన సైనిక స్థావరాలే టార్గెట్‌గా వీటిని ప్రయోగించారు. అయితే ఐడిఎఫ్ తన రక్షణ వ్యవస్థతో అడ్డుకుంది. దక్షిణ ఆక్రమిత పాలస్తీనాలోని సున్నితంగా ఉన్న ఇజ్రాయెల్ సైనిక స్థావరాలే లక్ష్యంగా హౌతీలు ముమ్మరదాడులుచేసాయి.

## విమాన సర్వీసుల్లో వచ్చేనెల 20 నుంచి 60శాతం సీట్లపై అదనపు ఛార్జీలు రద్దు: డిజిసిఎ ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ, మార్చి 29:** ఇకనుంచి అన్ని విమానసర్వీసుల్లో 60శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జిలు వసూలు చేయకూడదని పౌరవిమానయాన పర్యవేక్షక సంస్థ డిజిసిఎ అన్ని విమాన సంస్థలకు కీలక ఉత్తర్వులు జారీచేసింది. వచ్చేనెల 20వ తేదీనుంచి ఈ అదనపు ఛార్జిల రద్దు అమలులోకి వస్తుందని కూడా సూచించింది. డిజిసిఎ జారీచేసిన సర్క్యులర్ జారీచేసిన 30 రోజులనుంచి ఈ నిబంధనలు అమలవుతాయి. ఆవిధంగాచూస్తే వచ్చే ఏప్రిల్ 20వ తేదీనుంచి ప్రయాణీకులకు అదనపు ఛార్జీలభారం తప్పుతుంది. విమానాల్లో విండోసీటు, పక్కన ఉండే సీట్లు కాస్త ఎక్కువ సౌకర్యంగా ఉండటంతో ఆసీట్లకు డిమాండ్ ఎక్కువ ఉంటుంది. విమాన సంస్థలు వీటికి ఎక్కువ ఛార్జిలు వసూలుచేస్తారు. మధ్యవరుసలో ఉండేవి, చివరిలో ఉండేవాటికి మాత్రమే ఛార్జీలు వసూలు చేయరు. ఈ సంఖ్య మొత్తం సీట్లలో 20శాతానికి మించి ఉండదు. ఈ అదనపు ఛార్జిల వ్యవహారంపై ప్రయాణీకులనుంచి తీవ్ర విమర్శలు, ఫిర్యాదులు రావడంతో పౌరవిమానయానశాఖ గుర్తించి వెంటనే డిజిసిఎకు లేఖలురాయడంతో ఈ కొత్త సర్క్యులర్ జారీచేసింది.

## శ్రీలంకకు భారత్ 38 వేల మెట్రిక్ టన్నుల పెట్రోలు, డీజిల్ సాయం

**కొలంబో, మార్చి 29:** పశ్చిమాసియాలో యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభ సమయంలో భారత్ శ్రీలంకకు 38 వేల మెట్రిక్ టన్నుల పెట్రోలియం అత్యవసర సాయం కింద శ్రీలంకకు అందచేయడంపై ఆదేశం భారత్‌కు ధన్యవాదాలు తెలిపింది. కొలంబోలోని భారత రాయబార కార్యాలయం ఈ అంశం ప్రస్తావించింది. భారతప్రధానిమోడీ, శ్రీలంక అధ్యక్షుడు అనూర దిస్స నాయకేలు ఇటీవలే ఫోన్‌లో చర్చలు జరిపారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు

>> చేశారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకొచ్చి కాగితాలు చింపి సభలో ఎగురవేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసి సభను దారిన పెట్టడానికి ప్రయత్నించి బడ్జెట్ సమావేశాలను అడ్డుకొంటున్నారని సమావేశం ముగిసేవరకు వారిపై సస్పెన్షన్ కొనసాగిస్తూ కీలకమైన ప్రకటన చేశారు. బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల తారక రామారావు అనిల్ జాదవ్, జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీ, మహిపాల్ రెడ్డి మాణిక్ రావు, పద్మారావు గౌడ్, చింతా ప్రభాకర్, బండారు లక్ష్మారెడ్డి, కె మహి పాల్ రెడ్డి, మాణిక్ రావు, పద్మారావు గౌడ్, చింతా ప్రభాకర్, వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, డాక్టర్ సంజయ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ , వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానందను రెండు రోజులు సస్పెండ్ చేశారు. తెలంగాణ శాసనసభలో కడియం శ్రీహరి మాట్లాడుతూ ధరణితో గత ప్రభుత్వం భూదోపిడి చేసిందని ఆనాటి భూ అక్రమాలపై హౌజ్‌కమిటీ వేయడాన్ని సమర్థిస్తూ మాట్లాడుతుంటే మీదేం పార్టీ అంటూ కౌశిక్‌రెడ్డి చూపుడు వేలుచూపుతూ ప్రశ్నించడం సీనియర్ సభ్యున్ని అవమాన పరచడమనేని ఆయనపై కఠిన చర్యలు తీసుకొనేందుకు ఎథిక్‌కమిటీకి సిఫార్సు చేశారు. అసెంబ్లీలో కౌశిక్‌రెడ్డి తీరుకు నిరసనగా కాంగ్రెస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరిపై కౌశిక్‌రెడ్డి తీరును తప్పుబడుతూ ముఖ్యమంత్రి నుంచి మొదలు కొని మంత్రులు, విప్‌లు,ఎమ్మెల్యేలు సభలో మాట్లాడారు. కడియం శ్రీహరికి కౌశిక్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు సభలో వీరంతా మాట్లాడుతుంటే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలని బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల నినాదాలు చేస్తునే ఉన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలంటూ నినదిస్తూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నిరసన కొనసాగించారు. సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సభను ఆర్డర్‌లో పెట్టడానికి బిఆర్‌ఎస్ సభ్యులను సస్పెండ్ చేయాలని అన్నారు. హౌజ్ కమిటీ వేయాలని నేను గతంలో బయ్యారం విషయంలో డిమాండ్ చేశాను అన్ని సందర్భాలలో అది సాధ్యం కాదని అన్నారు. సిబిసిఐడి విచారణ చేయడానికి సిఎం ఒప్పుకొన్నారని దానిని రాద్ధంతం చేయవద్దని అన్నారు.

శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడు హౌజ్ కమిటీలు వేసిందని కనీసం ఒక్కసారి సమావేశం నిర్వహించలేదని గుర్తుచేశారు. ప్రభుత్వ భూములు దురాక్రమణ,విక్రయాలపై ఒకటి, వక్ఫ్‌భూములు, హౌజింగ్ కోఆపరేటివ్ సంస్థలపై వేసిన హౌజ్‌క మిటీలు ఏమైనయో అదివేసిన ప్రతిపక్షంకు తెలుసని ఎద్దేవా చేశారు. కేవలం పొంగులేటిని బ్లాక్‌మెయిల్ చేయడానికి హౌజ్ కమిటిని వేయాలని డిమాండ్ చేస్తున్నారని దుయ్యబట్టారు.

## తల్లిదండ్రులను కాపాడుదాం

>> పోయినా తన భుజాలపై తల్లిదండ్రులను మోసి పుణ్యక్షేత్రాలు చూపించిన శ్రవణ కుమారుడి గాథ అజరామరమైతే, అనామకుడిగా కన్నుమూసిన విజయ్ పథ్ సింఘానియా ఉదంతం ఆధునిక సమాజపు చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం- పర్యవేక్షణ బిల్లు-2026 బిల్లును ఎంతో బాధ్యతతో, భావోద్వేగంతో ఆలోచన చేసి తీసుకువచ్చామని సిఎం చెప్పారు. కన్నవారిని పట్టించుకోని ఉద్యోగి జీతంలో 15 శాతం కోత విధిస్తామని, అలా కట్ చేసిన మొత్తాన్ని నేరుగా ఉద్యోగి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేసేలా చట్టాన్ని రూపొందించామని తెలిపారు. తల్లిదండ్రుల పట్ల భక్తి లేని వారికి భయం కలిగిం చేందుకే ఈ చట్టం అని, వృద్ధ తల్లిదండ్రులకు రక్షణ కల్పించే దిశగా ఇది ఒక కీలక అడుగు అని పేర్కొన్నారు. మనిషి బంధాలు, అనుబంధాలను మర్చిపోయి చివరికి పేగు బంధాలను కూడా విస్మరించి భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాలు, సంపద కోసం పాకులాటల్లో మునిగిపోయారని సిఎం అన్నారు. అనాథలుగా మారిన తల్లి దండ్రులు కన్నీళ్లు పెట్టుకోవడం ఈ సమాజానికి మంచిది కాదన్నారు. దేశంలో పిల్లల సామాజిక భద్రత, మహిళల భద్రత, హక్కులకు రాజ్యాంగ రక్షణతోపాటు అనేక చట్టాలు ఉన్నాయని, కాని పిల్లలు తమ తల్లి దండ్రులను చూసుకోవడం చట్టబద్ధ బాధ్యతగా చేస్తూ కూడా కొన్ని చట్టాలు ఉన్నాయన్నారు. అయినా సమాజంలో తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో జరుగుతోన్న వివక్ష, నిరక్ష్యం కొనసాగుతుండడం బాధాకరమన్నారు. బతికున్నప్పుడు తల్లిదండ్రులకు గుప్పెడు మెతుకులు పెట్టని బిడ్డలు వారు చనిపోయాక ఆస్తుల కోసం కొట్లాడుకోవడం అత్యంత విషాదమన్నారు. పిల్లలను కనగలం కాని, వాళ్ల బుద్ధులను కనగలమా అని ఒక సినిమాలో డైలాగ్ ఉంటుందని, ఈ రోజు కొందరు తల్లిదండ్రుల పరిస్థితి ఇదేనన్నారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. లేదా ఎక్కువ మంది పిల్లలను కనే వాళ్లని, దాని వల్ల ఒకరు కాకపోయినా ఇంకొకరైనా తల్లి దండ్రుల సంరక్షణ చూసుకునే వాళ్లు అని సిఎం గుర్తు చేశారు.

ఇటీవల తనకు తెలిసిన ఒక మాజీ మంత్రి తండ్రికి క్యాన్సర్ వస్తే ఆయనను ఆ నేత చూసుకోకుండా నిరక్ష్యం చేశారని, ఆ తండ్రి ఇటీవలే మరణించారని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను చూసుకోలేని వారిని సమాజం నుండి బహిష్కరించాలన్నారు. ఒక సామాజిక బాధ్యతగా ఈ బిల్లును తీసుకువస్తున్నామని, ఈ చట్టంతో సమస్యలన్నీ పరిష్కారంకాకపోయినా వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించేందుకే ప్రభుత్వ ప్రయత్నమన్నారు. సిఎం విజ్ఞప్తితో శాసనసభ 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం- పర్యవేక్షణ బిల్లు -2026 బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకుముందు మంత్రి కొండా సురేఖ, ఎంఐఎం సభ్యుడు జాఫర్ హుస్సేన్, బిజెపి శాసనసభాపక్ష ఉపనేత, సిపిఐ శాసనసభపక్షా నేత కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే ఆదినారాయణ తమ పార్టీల తరుపున బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రయివేటు, వ్యాపారాలు చేసే ఉద్యోగస్థులను సైతం ఈ బిల్లు పరిధిలోకి తేవాలని కోరారు. తల్లిదండ్రుల ఆసుపత్రి ఖర్చులను సైతం పిల్లల జీతాల నుండి ఇప్పించేలా చట్టంలో చేర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ సభలో పాడిన పాట అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, ఈ కొత్త చట్టం ప్రకారం, తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని తేలిన ఉద్యోగుల స్థూల జీతం (గ్రాస్ శాలరీ) నుంచి 15 శాతం కోత విధిస్తారు. ఈ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రులకు చెల్లిస్తారు.

## హౌజ్ కమిటీలు బ్లాక్‌మెయిల్‌కా?

>> మా బిఆర్‌ఎస్‌కు తప్ప ఎవరికి మేలు జరగకూడదనే ఆలోచనతోనే బిఆర్‌ఎస్ సభ్యులు సభకు వచ్చినట్టుగా కనిపిస్తోందనీ భాష్యంచెప్పారు.రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, ప్రజల అవసరాలు తీర్చేందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన ఈ సభలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రాద్ధాంతం చేయడం సరైనది కాదనీ ఆవేదన వ్యక్తంచేశారు..2014 నుంచి 2023 వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా మేము ఈ సభలో ఉన్నామనీ ఆ సమయంలో బడ్జెట్ సమావేశాల్లో ఎప్పుడూ బడ్జెట్ కాపీలను చింపి చెవిలో పెట్టుకుని వెళ్లడం కానీ, డిమాండ్లపై చర్చ జరిగినప్పుడు అల్లరి చేయడం కానీ జరగలేదనీ గుర్తుచేశారు.ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రుల కోసం ఈ ప్రభుత్వం మానవీయ కోణంలో ఒక బిల్లు ప్రవేశపెట్టి చర్చకు పెట్టిందనీ అయితే ఆ చర్చ జరగనీయకుండా, సభా సంప్రదాయాలు, పార్లమెంటరీ భాష, సభ నిబంధనలు తెలిసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చప్పట్లు కొట్టడం, నినాదాలు చేయడం సరైనది కాదనీ అన్నారు. ముందస్తు నోటీసు ఇవ్వకుండా సభలో మంత్రి పేరును వెల్లడించకూడదనీ అయినప్పటికీ ఆ పేరును బయటపెట్టడం జరిగిందనీ అన్నారు.బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మంత్రిపై లేవనెత్తిన అంశాలపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2014 నుంచి 2026 మార్చి 28 వరకు మైనింగ్ రంగంలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సిబి సిఐడి తో విచారణ జరిపిస్తానని ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతించాల్సిందిపోయి కావాలనే సభను నడవనీయకుండా రాద్ధాంతం చేయడం తగదని అన్నారు.ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంచిన భూములను గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి పార్ట్‌బీలో పెట్టి తమకు అనుకూలమైన వ్యక్తుల పేరిట పట్టాలు ఇచ్చింది అనే విషయం వాస్తవం కాదా?ధరణి ద్వారా జరిగిన భూ అక్రమాలు, బాలానగర్‌లో అక్రమ పద్ధతిలో జరిగిన భూ బదిలీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హౌస్ కమిటీ వేయాలని చేసిన ప్రకటనను నేను స్వాగతిస్తున్నానీ చెప్పారు.బిఆర్‌ఎస్ శాసనసభ్యులకు హౌస్ కమిటీపై పూర్తి విశ్వాసం ఉంటే సిఎం ప్రకటించిన హౌస్ కమిటీ కి అంగీకరించాలని వారికి సవాల్ చేస్తున్నాననీ అన్నారు.

## మంత్రులకేనా? ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులివ్వరా?

### ఖమ్మం జిల్లాకే ఎక్కువ నిధులు తరలిపోతున్నాయి: రాజగోపాల్ రెడ్డి ఫైర్



**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సొంత ప్రభుత్వం పరోక్ష విమర్శలు చేశారు. ఎమ్మెల్యేల నియోజక వర్గాలకు నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. మంత్రుల నియోజక వర్గాలకు మాత్రమే బిల్లులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని, మెజారిటీ ఎమ్మెల్యేలతోనే ప్రభుత్వం ఏర్పడుతుందని, మంత్రి, ముఖ్యమంత్రి పదవులు వస్తాయని గుర్తు చేశారు. తాము నిధుల కోసం మంత్రుల చుట్టూ తిరగాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కేబినెట్‌లో ఖమ్మం జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ఉన్నారని, ప్రభుత్వం ఏం చేసినా, నిధులు అన్ని ఖమ్మం జిల్లాకే వెళుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి పదే పదే తనను గెలిపించిన కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెబుతున్నారని, మరి ఎమ్మెల్యేలుగా తమ నియోజకవర్గాన్ని తాము అభివృద్ధి చేసుకోవద్దా.? అని నిలదీశారు. బడ్జెట్ పద్దులపై చర్చసందర్భంగా శాసనసభలో ఆదివారం ఆయన మాట్లాడారు. మునుగోడును అభివృద్ధి చేసుకుందాం అనుకుంటే ఎవరూ సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## అసెంబ్లీలో బెదరింపులా?

>> తెలిపారు.ఇక్కడ కుస్తీలు పడటానికి రాలేదని విజ్ఞతతో అవగాహనతో మాట్లాడటానికి వచ్చామని చెప్పారు. ఆకారం ఉందని కడియం లాంటి పెద్దమనిషిని అవమానించేలా వ్యవహరించడం తగదన్నారు. అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తనను సుమోటోగా విచారణకు స్వీకరించి, ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎథిక్స్ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బిఆర్‌ఎస్ సభ్యులు సభకు సహకరిస్తేనే సభలో ఉంచాలని, అడ్డుకునే శైలి ఉంటే తదుపరి సమావేశాల వరకూ సస్పెండ్ చేయాలని రేవంత్ కోరారు. దీంతో కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోనున్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా ఎస్ సి ని చేస్తానని చెప్పి కెసి ఆర్ మాట తప్పారని విమర్శించారు. ఎస్‌సి లకు పరిపాలన చేతకాదు దొర సిఎం కావాలని కెసిఆర్ ఆర్ మాట మార్చారన్నారు. బిఆర్‌ఎస్ జాతి కక్ష, రాజకీయ వివక్ష ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ఎస్ సి ల పట్ల అంత కుల వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కెసిఆర్ హరీష్ రావు, కెటి ఆర్, దయాకర్ రావులను మంత్రుల్ని చేస్తే తాము భట్టి విక్రమార్క, అడ్లూరి, వివేక్, దామోదర రాజనర్సింహ, సీతక్కలకు మంచి పదవులు ఇచ్చామన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో 2018 తర్వాత కొప్పుల ఈశ్వర్ కు మాత్రమే మంత్రి పదవి ఇచ్చారన్నారు. కెసిఆర్ కేబినెట్ కూర్పు చూస్తే ఎస్సీలపై ఎంత వ్యతిరేకత ఉందో కనిపిస్తుందన్నారు. భట్టి విక్రమార్కను ప్రతిపక్ష నేతను చేస్తే ఫిరాయింపులతో ఆ పదవి కూడా లేకుండా చేశారని వాపోయారు. ఎస్సీలపై వివక్ష తప్ప కనీస మానవత్వం చూపలేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎటిఎంగా మార్చుకొని వేల కోట్ల దోపిడీ జరిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ,అమిత్ షా చెప్పారని, ఆ అవినీతిపై విచారణ జరగాలని అన్నారనీ సిబిఐ బదిలీ చేస్తే 48 గంటల్లో నిందితులను అరెస్ట్ చేస్తామని కిషన్ రెడ్డి అన్నారని, వారి మాటలు నమ్మి కేసును సిబిఐకి ఎనిమిది నెలల క్రితం అప్పగించామని, ఇప్పటి వరకు చర్యలు లేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు . బిజెపి నేతలు సూచనలు ఇచ్చి పారిపోవడం అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి ఒకటై ఓట్లు, సీట్లు పంచుకున్నాయని ఆరోపించారు. పార్లమెంటు, పంచాయతీ,మున్సిపల్ ఎన్నికలలో కలిసే పోటీ చేసి సీట్లు ఓట్లు పంచుకున్నాయనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో అవినీతికి పాల్పడిన కెసిఆర్, హరీశ్ రావును జైలు లో పెట్టిన తర్వాతే మాట్లాడాలని బిజెపి నేతలకు సూచించారు. కెసిఆర్, హరీశ్ రావుపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఎం ప్రశ్నించారు,బిజెపి బిఆర్‌ఎస్ కుమ్మక్కై దర్యాప్తును ముందుకు సాగనివ్వడం లేదని అన్నారు.



ఆదివారం అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన మేనకా గాంధీ

## సిఎం రేవంత్‌తో మేనకా గాంధీ భేటీ

### జంతు సంరక్షణలో ప్రభుత్వానికి ప్రశంసలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి 29:** మాజీ కేంద్ర మంత్రి మేనకా గాంధీ హైద రాబాద్‌కు వచ్చారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మేనకా గాంధీ బృందం భేటీ అయ్యారు. శాసనమండలిలోని కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రై మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్స్, ఉన్నతాధి కారులు కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ చర్యలను మేనక గాంధీకి అధికా రులు వివరించారు. మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికా రులు వివ రించారు. రాష్ట్రంలో గోసంరక్షణకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు రూపొందిం చిందని సిఎం తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో విశాల ప్రదేశంలో ఎన్కేపల్లిలో గోశాల నిర్మాణానికి ఇప్ప టికే శంకుస్థాపన చేసినట్లు సిఎం వివరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలు, ఆలయాల సమీపంలో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలి పారు. జంతు సంరక్షణ విషయంలో ప్రభుత్వ చర్యలపై మేనకాగాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కృషిని మేనకా గాంధీ ప్రశంసిం చారు. కాగా, శనివారం నగరపర్యటనలో భాగంగా మేనకాగాంధీ ఒక యానిమల్ అంబులెన్స్‌ను ప్రా రంభించారు.అనంతరం బేగంబజార్‌లో నిర్మా ణంలో ఉన్న మల్టీస్పెషాలిటీ యానిమల్ ఆసు పత్రి పనులను పరిశీలించారు. 27 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణతర్వాత ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తికా నుండటంపై ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

>> కోసం తానెప్పుడూ పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఫోన్ చేయలేదని స్పష్టం చేశారు. పొం గులేటి కంపెనీ అవినీతికి పాల్పడిందని అందరికీ అర్థమైందని చెప్పారు. తప్పు జరిగిందని సీఎం, మైనింగ్ శాఖ మంత్రి అసెంబ్లీలోనే ఒప్పుకు న్నారని తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పగబట్టి సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహ రిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నిస్తున్నందుకే కక్ష గట్టారని, అసలు ఎథిక్స్ కమిటీ రిఫర్ చేయాల్సి వస్తే రేవంత్‌రెడ్డిని రిఫర్ చేయాలని ఘాటుగా విమర్శించారు. సీఎం, పొంగులేటి మధ్య లావాదేవీలు ఉంటాయని, భూముల్లో చెరిసగం పంచుకుంటారని ఆరోప ణలు చేశారు. సభాసంఘం వేస్తే అన్నీ బయ టకు వస్తాయని భయపడుతున్నారని, కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చి బేరం కుదిరితే తొలగిస్తున్నారని మండిపడ్డారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలని మైనింగ్ డిపార్ట్ మెంట్ పీసీబీకి లేఖ రాస్తే ఎనిమిది నెలలుగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని హరీశ్ రావు ప్రశ్నించారు. నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే పొంగులేటిని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి మీద చర్య తీసుకోలేక కాలుష్య నియంత్రణ మండలి మౌనం వహించిందని అన్నారు. ఒక్క తప్పు కప్పిపుచ్చడానికి వంద అబద్ధాలు చెప్పారని విమర్శించారు. నైతిక విలువల కమిటీకి సిఫారసు చేయాలంటే ముందు అనాగరిక భాషలో మాట్లాడిన రేవంత్ రెడ్డి పేరును సిఫారసు చేయాలన్నారు. అనర్హతా వేటు వేయాల్సి వస్తే మొదట రేవంత్ రెడ్డిపై వేటు వేయాలని అన్నారు. దేశంలో ఎవరూ ఆలోచించని దళితబంధు పథకం తెచ్చింది కేసీఆరేనని హరీశ్ రావు గుర్తు చేశారు. దళితులపై రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తూ కపట ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ లో ఒక్కటి కూడా అమలు చేయకుండా మోసం చేశారన్నారు. పరిశ్రమల శాఖలోనే మైనింగ్ కూడా ఉంటుందని మంత్రులకు కూడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. అవినీతి జరిగిందని సీఎం, మంత్రి అంటే డిప్యూటీ సీఎం మాత్రం వాస్తవమో కాదో అంటున్నారని అన్నారు. కేటీఆర్, హరీశ్ రావు లేఖ రాస్తే విచారణ రాసేందుకు సిద్ధమని సీఎం అన్నారని, 19 కుంభకోణాలపై విచారణ చేయాలని సీఎంకు లేఖ రాసినట్లు తెలిపారు.

### వారం - వర్జ్యం

30-03-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
ద్వాదశి ఉ.7.10
మఖ మ.2.50
వర్జ్యం : రా.11.01-రా.12.39
దు.మ.12.36-మ.1.25, 2)మ.3.03-మ.3.52
శుభసమయం:ఉ.7.30-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** మీ ఓర్పు, సహనం మాటల చాతుర్యం వల్ల లాభపడతారు. విలువైన సమాచారం అందుకుంటారు.

**వృషభం:** కొన్ని బాధ్యతల నుండి తప్పుకోవాలని భావిస్తారు. పరిస్థితులు మాత్రం అందుకు అనుకూలించవు.

**మిథునం:** కుటుంబంలో ఐకమత్యత, అప్యాయత, అనురాగాలు లోపిస్తాయి. నరఘోష అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:** కొన్ని బాధ్యతల నుండి తప్పు కోవాలని భావిస్తారు. ఆదాయ, వ్యయాలలో సమతుల్యతను సాధించగలుగుతారు.

**సింహం:** ఓ మంచి కార్యక్రమం కోసం వసూలు చేసిన చందాల విషయంలో వివాదం, నిందలు ఏర్పడతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో ఉద్యోగంలో మీ ప్రత్యేక శైలి నిలబెట్టుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**తుల :** కొన్ని విషయాలలో పట్టుదలతో వ్యవహరిస్తారు. సంతాన విద్యా విషయమై ఆందోళన వద్దు. వాహన సౌఖ్యం కలదు.

**వృశ్చికం:** ఇతరులు చేయవలసిన శ్రమ మీరు చేయవలసి వస్తుంది. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**ధనుస్సు:** సామాజికంగా జరిగే మార్పులు మీపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాన్ని చూపిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మకరం:** జీవితంలో కొన్ని ముఖ్యమైన విషయాలు అనుకూల ఫలితాలను సాధిస్తారు. పరిస్థితి బలపడుతుంది.

**కుంభం:** స్థిరాస్తులు కొనుగోలుచేస్తారు. నమ్మకద్రోహం అడుగడుగునా ఎదురవుతుంది. మీ మంచితనమే మీకు శ్రీరామరక్ష.

**మీనం :** ప్రయోజనాలు పగవాళ్ళకు చేరకుండా జాగ్రత్త వహించండి. సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లో 174 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

## మెరిట్ లిస్టు విడుదల

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 174 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు త్వరలోనే భర్తీ కానున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 174 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం విడుదల చేసింది. గైనకాలజీ, అనస్తీషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాల్లో కలిపి 174 పోస్టుల భర్తీకి ఈ జాబితా వెల్లడించినట్లు బోర్డు పేర్కొంది. గైనకాలజీలో 90 పోస్టులు, అనస్తీషియాలో 44, పీడియాట్రిక్స్‌లో 28, ఆర్థోపెడిక్స్‌లో 12 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నాయి. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం సెలక్షన్ లిస్ట్ విడుదల చేస్తామని బోర్డు ప్రకటించింది. ఏప్రిల్ 1న హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు బోర్డు తెలిపింది. ఏప్రిల్ 9న నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయనున్నారు. 2,312 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్‌ను ఏప్రిల్ 9వ తేదీ నాటికి విడుదల చేయనున్నట్టు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

# పశ్చిమాసియా సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం!

## తప్పుడు ప్రచారాలను నమ్మకండి

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, మార్చి 29:** కొవిడ్-19 మహమ్మారి కారణంగా ప్రపంచం ఇప్పటికే అనేక దీర్ఘకాలిక సమస్యలను ఎదుర్కొందని, మహమ్మారి తర్వాత ప్రపంచ పరిస్థితి మెరుగుపడి, ప్రపంచం వేగవంతమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న తరుణంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు తీవ్ర ప్రభావంచూపిస్తున్నాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. మన్‌కీబాత్ 132వ ఎపిసోడ్‌లో ఆదివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న ఘర్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ సవాళ్లను దేశం కలిసికట్టుగా అధిగమిస్తుందని ప్రధాని మోడీ తెలిపారు. అయితే దీనికి విరుద్ధంగా, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో యుద్ధాలు, ఘర్షణలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. గత నెల రోజులుగా పొరుగు ప్రాంతంలో జరుగుతున్న భీకర పోరాటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రాంతాలలో, ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న లక్షలాది మంది భారతీయులకు కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అక్కడ నివసిస్తున్న కోటి మందికి పైగా భారతీయులకు మద్దతు ఇస్తున్నందుకు గల్ఫ్ దేశాలకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధం జరుగుతున్న ప్రాంతం భారతదేశ ఇంధన అవసరాలకు ప్రధాన కేంద్రమని ప్రధాన మంత్రి మోడీ అన్నారు.

ఇది పెట్రోల్, డీజిల్ విషయంలో ప్రపంచవ్యాప్త సంక్షోభానికి దారితీస్తోందని వెల్లడించారు. భారతదేశం తన ప్రపంచ సంబంధాలు, గత దశాబ్ద కాలంలో పొందిన బలం కారణంగా ఈ పరిస్థితులను బలంగా



ఎదుర్కొంటోందని మోడీ స్పష్టం చేశారు. ఇది సవాళ్లతో కూడిన సమయమని పేర్కొంటూ, ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి పౌరులందరూ ఐక్యమవ్వాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. జాతీయ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరమని నొక్కిచెబుతూ మన్ కీ బాత్ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ విషయం 140 కోట్ల మంది పౌరుల ప్రయోజనాలకు సంబంధించినది కాబట్టి, దీనిని రాజకీయం చేయకూడదని ప్రధానమంత్రి మోడీ పేర్కొన్నారు. పుకార్లను వ్యాప్తి చేసేవారు దేశానికి హాని చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పౌరులు అప్రమత్తంగా ఉండాలని, పుకార్ల ద్వారా తప్పుదోవ పట్టవద్దని విజ్ఞప్తి చేశారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. గతంలో దేశం తన 140 కోట్ల మంది పౌరుల బలంతో ప్రధాన సంక్షోభాలను ఎదుర్కొన్నట్లే, ఈసారి కూడా దేశం ఐక్యంగా నిలిచి ఈ సవాలును అధిగమిస్తుందని పీఎం మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# కామారెడ్డి జిల్లాలో ప్రమాదం

## ముగ్గురు వలస కార్మికుల దుర్మరణం

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రాంపూర్‌గడ్డ వద్ద శనివారం రాత్రి 11 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ముగ్గురు వలస కార్మికులు దుర్మరణం చెందారు. రాంపూర్‌గడ్డ భావన రైస్‌మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్న లాల్తూరు ముఖియా (21), రాహుల్ (21), జావెద్ అన్సారి (22)లు మోటార్‌సైకిల్‌పై బయటకువెళ్లి తిరిగి వస్తుండగా రాంపూర్‌గడ్డ వద్ద వేగంగా వస్తున్న క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన దూసుకుపోయి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ముఖియా, రాహుల్, జావేద్ అన్సారీల ముఖాలు, తలలకు తీవ్రంగా గాయాలు కావడంతో ముక్కులు, చెవుల నుంచి తీవ్రంగా రక్తం కారి అపస్మారక పరిస్థితిలో వెళ్లారు. కాగా దీనిపై స్థానికులు వెంటనే గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, వైద్యసిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురు యువకులను పరిశీలించి వారిని ఆస్పత్రికి తరలించేలోపే మరణించారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పోస్టుమార్టం పూర్తయ్యాక సంబంధీకులకు అప్పగించారు. మృతులు యుపి, బిహార్‌కు చెందిన వారుగా గుర్తించారు. మితిమీరిన వేగంతో బైక్ నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గాంధారి ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# కరీంనగర్ పోలీసు కమిషనర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణలు

## సిఐడి విచారణకు సర్కారు ఆదేశం

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలంతో పాటు ఆయన సతీమణి, వారి సన్నిహితులపై హుజూరాబాద్ ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలపై సిఐడి చేత విచారణ చేయించాలని సర్కారు నిర్ణయించింది. కరీంనగర్ పోలీసు గ్రౌండ్స్‌లో ఇటీవల జరిగిన పోలీసు ఫైరింగ్ సందర్భంగా పోలీసు కమిషనర్ గౌస్ ఆలం సతీమణి, ఆమె స్నేహితులు కొందరు పోలీసులు మాత్రమే వాడాల్సిన బుల్లెట్లను పోలీసులు వాడే తుపాకులతో ఫైరింగ్ కోసం వాడారని కౌశిక్ రెడ్డి పలుమార్లు ఆరోపించడం తెలిసిందే. వీరికి సరిగ్గా ఫైరింగ్ తెలియని కారణంగా ఓ మహిళ గాయపడినట్లు కూడా ఆయన ఆరోపించారు. కౌశిక్ రెడ్డి ఆరోపణలను జిల్లా పోలీసు అధికారుల సంఘం ఖండించినా కమిషనర్ గౌస్ ఆలం ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అంతకు ముందు మేడారం జాతర సందర్భంగా గౌస్ ఆలం ఒక మతానికి అనుకూలంగా వ్యవహరించారని కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలు సంచలనం రేపాయి. దీనిని సర్కారు తోసిపుచ్చింది.

అయితే పోలీసు గ్రౌండ్స్‌లో పోలీసు బుల్లెట్లను కమిషనర్ సతీమణి, ఆమె స్నేహితులు ఫైరింగ్ చేశారనడం, ఈ సందర్భంగా ఒక మహిళ గాయపడినట్లుగా చెప్పడం తీవ్రమైన అభియోగం కావడంతో దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని నిర్ణయించిన సర్కారు ఈ మేరకు సిఐడికి ఆదేశాలు జారీ చేసింది.

సిఐడి అదనపు డిజి చారు సిన్హా నేతృత్వంలో ప్రత్యేక బృందం దీనిపై విచారించి సర్కారుకు నివేదిక ఇవ్వనుంది.

# మూసీ పనులకు ప్రపంచ బ్యాంక్ ఎన్వోసీ

## వివిధ ప్రాజెక్టులకు రూ.100 కోట్లు విడుదల

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ పనులకు ప్రపంచ బ్యాంకు నో అబ్జెక్షన్ తెలిపింది. ఇందుకు సంబంధించి ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) జారీ చేసింది. అలాగే రాష్ట్రంలో చేపడుతున్న వివిధ పనులకు గాను ప్రభుత్వానికి రుణం కింద ప్రపంచ బ్యాంక్ 100 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు తెలిపాయి. ఇందుకు గాను 6.4 శాతం వడ్డీతో ఈ రుణం సమకూర్చింది. దీంతో త్వరలోనే మూసీ ప్రాజెక్టు ఫేజ్ 1 పనులకు టెండర్లను పిలిచి నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సమయంలో డ్యామ్ రీహాబిలిటేషన్ అండ్ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్ కింద వరల్డ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన 100 కోట్ల రూపాయలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు కలిపి 175 కోట్ల రూపాయలు ఉండగా మూసీ, శ్రీరాంసాగర్, గడ్డెన్నవాగు, జూరాల, స్వర్ణ తదితర ప్రాజెక్టుల మరమ్మతులకు 120.90 కోట్ల రూపాయలను ఖర్చు చేయనుంది. మరోపక్క డ్రిప్ ఫేజ్-2లో ప్రపంచ బ్యాంకు నిధులను పొందేందుకు ప్రయత్నిస్తోంది. వాస్తవానికి ప్రాజెక్టుల రిపేర్లకు రూ.545 కోట్ల మేర ఖర్చు కానుంది. ఈ మొత్తంలో రాష్ట్ర వాటా 30 శాతం, ప్రపంచ బ్యాంక్‌వాటా 70 శాతంగా ఉంటుంది. ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.381.5 కోట్లు రావాల్సి ఉన్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

# మినాబ్ స్కూలుపై దాడికి ఆదేశించిన క్రిమినల్ ఆఫీసర్లు వీరే

## రాయబార కార్యాలయాల సోషల్ మీడియాలో ఫొటోలు రిలీజ్ చేసిన ఇరాన్

**టెహ్రాన్, మార్చి 29:** ఇరాన్‌లోని మినాబ్‌లో ఎలిమెంటరీ స్కూలుపై ఇటీవల అమెరికా క్షిపణి దాడి జరిపి 170 మంది ప్రాణాలను బలిగొన్న సంఘటన టెహ్రాన్‌వాషింగ్టన్ మధ్య ఉద్రిక్తతలను పెంచింది. ఈ క్షిపణిని ప్రయోగించిన అమెరికా నౌకాదళ అధికారుల ఫొటోలను ఇరాన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఇద్దరు క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి అంటూ వారి చిత్రాలను సౌత్ ఆఫ్రికా, భారత్, ఇతర దేశాల్లోని ఇరాన్ రాయబార కార్యాలయాలు సామాజిక మాధ్యమం ఎక్స్



లో విడుదల చేశాయి. ఈ ఇద్దరు క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి. వీరు అమెరికా యుద్ధనౌక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెఫ్రీ యూ యార్క్, కమాండింగ్ ఆఫీసర్ లీ ఆర్ టేట్. మూడుసార్లు తోమహాక్ క్షిపణుల దాడికి వీరు ఆదేశాలిచ్చారు. మినాబ్ పాఠశాలలోని 168 మంది అమాయక చిన్నారులను పొట్టన పెట్టుకున్నారు అని ఆ పోస్ట్‌లో పేర్కొంది. ఈ ఘటన పొరపాటున జరిగినట్టు అమెరికా సమర్థించుకుంది. అమెరికా మీడియా కూడా సమర్థిస్తూ కథనాలు ప్రచురించింది. పాఠశాలకు సమీపంలోని ఇరాన్ మిలిటరీ స్థావరం లక్ష్యంగా దాడి జరిగిందని, కాలంచెల్లిన ఇంటెలిజెన్స్ సమాచారం కారణంగా పొరపాటు జరిగిందని పేర్కొన్నాయి. అయితే పక్కా ప్లాన్‌తోనే ఈ దాడులు జరిపినట్టు ఇరాన్ విరుచుకుపడింది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, కచ్చితత్వంతో కూడిన మిలిటరీ, డాటా సిస్టమ్ కలిగి ఉండి కూడా ఉద్దేశపూర్వకంగా దాడి జరపలేదని చెప్పడాన్ని ఎవరూ నమ్మరని పేర్కొంది.

# ఏప్రిల్‌లో 14 రోజులు బ్యాంక్ సెలవులు

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** ఏప్రిల్‌లో బ్యాంకులు మొత్తం 14 రోజులు మూతపడనున్నాయి. ఈ సెలవులలో రెండు శనివారాలు, నాలుగు ఆదివారాలు ఉన్నాయి. ఆర్థిక సంవత్సర ముగింపు, మౌండీ థర్స్ డే, గుడ్ ఫ్రైడే, అంబేద్కర్ జయంతి, తమిళ నూతన సంవత్సరం, బైసాఖీ, బెంగాలీ నూతన సంవత్సరం, బోహాగ్ బిహు, విషు, హిమాచల్ దినం, బసవ జయంతి, అక్షయ తృతీయ, గరియా పూజ వంటి పండుగలు, ప్రభుత్వ సెలవులు కూడా ఈ 14 రోజులలో ఉన్నాయి. అయితే వీటిలో దాదాపు 7 సెలవులు రాష్ట్రానికి వర్తించవని బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి. మరోపక్క బ్యాంకులకు సెలవులు అయినా నెట్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ వంటి ఆన్‌లైన్ సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశాయి.

# పురుగులమందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

## చెన్నూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘటన

## పాఠశాల సిబ్బంది వేధింపులతోనే చనిపోయిందని కుటుంబసభ్యుల ఆరోపణ



**చెన్నూరు, మార్చి 29, ప్రభాతవార్త:** చెన్నూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని మరణ వార్త చెన్నూరు మండలాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రాళ్ళబండి శ్రీహిందు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం పురుగుల మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రోజున తుది శ్వాస విడిచింది. ఈ సంఘటన తెలియగానే గంగారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు మాట్లాడుతూ బుధవారం రోజున శ్రీహిందు వాంతులు చేసుకుందని, పాఠశాల సిబ్బంది చెన్నూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారని, మరుసటి రోజు మాకు సమాచారం అందించి విషయం తెలిపారన్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా వాంతులు చేసుకుందని మాకు తెలిపారని, రోజురోజుకు పాప ఆరోగ్యం క్షీణించడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించామని తెలిపారు. అక్కడి వైద్యులు పాపకు వైద్యపరీక్షలు నిర్వహించగా ఆమె పురుగుల మందు తాగిందని వైద్యులు తెలిపారనీ, ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం తెల్లవారుజామున శ్రీహిందు చనిపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు.

**మా బిడ్డ చావుకు కారణం సిబ్బంది వేధింపులే**

మా బిడ్డ చావుకు కారణం పాఠశాల సిబ్బందేనని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మా పాప చనిపోవడానికి వేరే సమస్యలు ఏమి లేవని అన్నారు. పాప కోసం ఎప్పుడైనా తినుబండారాలు తీసుకువస్తే లోపలికి అనుమతించని సిబ్బంది, పురుగులమందు లోపలికి ఎలా వచ్చిందని, ఎవరు అనుమతి ఇచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. పాప చావుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు అధికారులను కోరారు.

# కెటిఆర్‌తో రేవంత్‌రెడ్డి కుమ్మక్కు.. ఇద్దరి మధ్య కుదిరిన డీల్

## అవినీతి కేసుల జోలికే పోవడం లేదు

## హరీశ్‌నే టార్గెట్ చేస్తున్నారు: కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో సిఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కు అయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు నడిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి, కెటిఆర్ ఇద్దరూ ఒక్కటే. హరీశ్‌రావుతో జాగ్రత్తగా ఉండాలని కెటిఆర్‌కు సిఎం సలహా ఇస్తున్నారు. కాళేశ్వరంపై హరీశ్‌పై ఉన్నంత పగ కెటిఆర్‌పై రేవంత్‌కు లేదు అన్నారు. ఎందుకంటే ఈ ఫార్ములా కేసు, డ్రగ్స్, ఫాంహౌజ్ కేసులపై మాట్లాడటం లేదదని, కెటిఆర్‌పై రేవంత్‌కు చాలా ప్రేమ ఒలకపోస్తున్నాడని అన్నారు. కెటిఆర్, కవిత మధ్య సంధి కుదిర్చేందుకు యత్నిస్తున్నారు. భవిష్యత్తులో బిఆర్‌ఎస్‌తో కలిసి పోటీ చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నాడు. 100 శాతం కెటిఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటే అని, కెసిఆర్‌పై ఉన్న కోపం కూడా రేవంత్‌కు పోయిందన్నారు. ఇద్దరి మధ్య డీల్ కుదిరింది. అందుకే హరీష్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారే తప్ప కెటిఆర్ గురించి మాట్లాడటం లేదని, అందుకే హరీశ్‌రావు ఆలోచించుకోవాలన్నారు. కెటిఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటా? కాదా? తేల్చుకోవాలి. బిఆర్‌ఎస్ పాలనలో కెసిఆర్ నామ్‌కే వాస్తే సిఎం, పాలన అంతా కెటిఆర్‌దే కదా? ఆనాడు రేవంత్ రెడ్డిని జైలుకు పంపించిన సంగతి మర్చిపోయాడన్నారు. ఆ పౌరుషం, రోషం పోయిందని, ఎందుకంటే ఇద్దరి మధ్య డీల్ కుదిరిందన్నారు. ఇకపై కెసిఆర్, కెటిఆర్‌ల అవినీతిపై విచారణ జరిపే అవకాశమే లేదు. మైన్స్ స్కాం జరిగిందని విచారణ అంటున్నారు. ఎందుకంటే మీరు పదేళ్లు దోచుకున్నారు..ఇగ మేం దోచుకుంటాం.. నోరు మెదపవద్దు. అని భయపెట్టడానికే ఈ తూతూ మంత్రపు విచారణ అని చెబుతున్నారే తప్ప సీఎం రేవంత్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి లేనేలేదన్నారు. కాంగ్రెస్ చెప్పినట్లే బిజెపి ఆడుతుందని చెప్పడం సిగ్గు చేటు. కెటిఆర్ అతిపెద్ద అవినీతిపరుడు. బిఆర్‌ఎస్ పాలనలో జరగని అవినీతి ఏమైనా ఉందా? కెటిఆర్ పెద్ద అవినీతి పరుడని తెలిసినా రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు? అంటూ ప్రశ్నించారు.

**డీలిమిటేషన్‌పై..**

డీలిమిటేషన్ చేస్తామనే సరికి, 33 శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పే సరికి రేవంత్ రెడ్డిలో డిప్రెషన్ మొదలైంది. దక్షి ణాది, ఉత్తరాధి అనే తేడా ఉండదు. బిజెపికి అన్ని ప్రాంతాలు సమానమే అన్నారు. ఒక విధానం ప్రకారం ముందుకు వెళతామే తప్ప మరొకటి ఉండదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బులు సమకూరుస్తున్నదే రేవంత్ రెడ్డి. ఈసారి కర్ణాటక నుండి డబ్బులు వెళ్లడం లేదు. ఎక్కడికి పోయినా బిజెపి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని చెబుతున్నారు. సామాన్య ప్రజలను అడిగినా బిజెపియే అధికారంలోకి వస్తుందని చెబుతున్నారని అన్నారు.

# రూ.50 కోట్లతో రైతు వేదికలకు సౌర విద్యుత్

## పునరుత్పాదక ఇంధన సంస్థ నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త :** తెలంగాణలోని రైతు వేదికలకు 50 కోట్ల రూపాయలతో సౌర విద్యుత్‌ను సమకూర్చాలని పునరుత్పాదక ఇంధన సంస్థ (రెడ్కో) నిర్ణయించింది. ఇందుకు గాను ఒక్కో వేదికకు దాదాపు 3.12 లక్షల రూపాయల మేర వ్యయం అవుతుందని అంచనా వేసింది.. రాష్ట్రంలో మొత్తం 2,600 రైతు వేదికలు ఉండగా, ప్రస్తుతం వాటికి విద్యుత్ బిల్లుల నిమిత్తం ప్రతీ నెలా దాదాపు 75 లక్షల రూపాయల వరకూ వ్యయం అవుతోంది. అసలే వాటి ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండటంతో ఈ బిల్లులు తలకు మించిన భారంగా పరిణమించాయి. రాష్ట్రంలోని పలు వేదికలు కరెంటు బిల్లులను సైతం చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నాయి. దీంతో విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో దశలవారీగా ఈ వేదికలకు సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

# మూడు రోజులపాటు పిడుగులతో కూడిన వడగళ్ల వానలు

## రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. రెండు రోజుల క్రితం మేఘాలు చల్లబడి పలు జిల్లాల్లో వర్షం కురిసినా 24 గంటల వ్యవధిలోనే మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు తెలిపింది. రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బలమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర ఒడిశా పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల చక్రవాత ఆవర్తనం దక్షిణ ఛత్తీస్‌గఢ్ ,తెలంగాణ, ఉత్తర అంతర్గత కర్నాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. సముద్ర మట్టం నుండి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ప్రస్తుతానికి కొనసాగుతున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించింది. రాయలసీమ దాని పరిసర ప్రాంతాల్లోనూఏ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుండి 1.5 కి మీ ఎత్తులో ఆదివారం ఏర్పడినట్లు పేర్కొంది. ఈ ప్రభావంతో ఉత్తర, పశ్చిమ, మధ్య దక్షిణ తెలంగాణ జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోనుందని, హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో వడగండ్ల వానలు కురుస్తాయని, బలమైన గాలులు వీచే ప్రమాదముందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అకాల వర్షాలకు పంట నష్టం కలగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. కోత దశలో ఉన్న పంటలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా ఉండేందుకు సరిపడా టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మార్కెట్ యార్డులకు తెచ్చిన ధాన్యాన్ని కూడా కవర్లతో పూర్తిగా కప్పి ఉంచాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో రైతులు చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని, పశువులను కూడా సురక్షితమైన షెడ్లలో ఉంచాలన్నారు. పొలాల్లోని విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకూడదని, వడగండ్ల వాన, పిడుగుల పడే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ పొలాలు వద్దకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

# జాతీయ లోక్‌అదాలత్ ద్వారా సైబర్ బాధితులకు రూ.24.91 కోట్ల అందజేత

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** సైబర్ నేరాల బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరోసారి చేయూతనందించింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్ల పోలీసు విభాగాల్లో జరిగిన లోక్ అదాలత్‌లో భాగంగా 4627 మంది సైబర్ బాధితులకు రూ. 24.91 కోట్లను అందజేసినట్లు టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో పాటు జాతీయ, ప్రైవేటు బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుని సైబర్ బాధితులకు వారు పోగొట్టుకున్న నగదులో చాలా వరకు అందించినట్లు ఆమె తెలిపారు. ఇందులో టిజిసిఎస్‌బి స్వయంగా నమోదు చేసిన కేసుల్లో 87 మంది బాధితులక5.64 కోట్ల రూపాయలు, మల్కాజిగిరి విభాగంలో 832 మంది బాధితులకు 4.79 కోట్ల రూపాయలు, హైదరాబాద్‌లో 553 మంది బాధితులకు 3.99 కోట్ల రూపాయలు, సైబరాబాద్, సంగారెడ్డిలలో ఒక్కో విభాగం కోటీ 52 లక్షల రూపాయలు బాధితులకు అందించాయని ఆమె వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సైబర్ నేరాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరిగిందని, ఇదే సమయంలో పోలీసు వ్యవస్థలు బలోపేతం కావడం వల్ల నేరగాళ్ల ఆటలు సాగడం లేదని, పెద్ద సంఖ్యలో నేరస్తులను పట్టుకున్నామని ఆమె తెలిపారు. రాష్ట్రంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటయ్యాక ఇప్పటి వరకు 53,434 మంది బాధితులకు 399.06 కోట్ల రూపాయలు అందించామని ఆమె తెలిపారు.

# కుర్దిస్థాన్ ప్రాంతీయ అధ్యక్షుడి నివాసంపై డ్రోన్ దాడి!



**బాగ్దాద్, మార్చి 29:** పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు క్రమంగా ఇతర దేశాలకు కూడా విస్తరిస్తున్నాయి. ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ అధ్యక్షుడు నెచిర్వాన్ బార్జానీ నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో ఆయనకు ఎటు వంటి గాయాలూ కాలేదని సమాచారం. ఈ దాడిని కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రధాన మంత్రి మస్రూర్ బర్జానీ ఖండించారు. ఇది ఒక పిరికపంద చర్య అని విమర్శించారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పౌరుల భద్రత, ప్రయోజనాలను కాపాడుకునేందుకు కుర్దిస్థాన్ ప్రాంతానికి అంతర్జాతీయ సమాజం మద్దతు ఇవ్వాలని మస్రూర్ బర్జానీ కోరారు. ఇలాంటి దాడులపై ప్రతిస్పందించే హక్కు తమకు ఉందని, తమ ప్రాంతాన్ని రక్షించుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, ఈ దాడికి మీరంటే మీరే కారణమని అమెరికా, ఇరాన్‌లు ఒకరిపై మరొకరు అరోపణలు చేసుకుంటున్నాయి. ఇరాన్‌కు మద్దతుగా ఉండే మిలీషియాలు ఈ దాడికి పాల్పడ్డారని అమెరికా ఆరోపించిది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఈ హత్యాయత్నం చేశాయని ఇరాన్ పేర్కొంది. కుర్దిస్థాన్ అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని దాడి చేయడాన్ని ఐఆర్‌జీసీ తీవ్రంగా ఖండించింది. ఇది ఉగ్రవాద చర్య అని ఐఆర్‌జీసీ పేర్కొంది. ప్రాంతీయ భాగస్వాములను రక్షించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చింది.

# 'మహాలక్ష్మి'తో రూ.10,000 కోట్లు మహిళలకు ఆదా

## 290 కోట్లకుపైగా ఉచిత ప్రయాణాలు

## ఆడబిడ్డల అకౌంట్లలో పొదుపు సిరి : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు రూ. 10వేల కోట్లను రవాణా ఛార్జీల రూపంలో ఆదా చేసుకున్నారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో ఆడబిడ్డల అకౌంట్లలో పొదుపు సిరి చేరిందని.. తెలంగాణ ప్రగతికి ఇదే అసలైన దారి అని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల రవాణా ఛార్జీల మొత్తం ఆదివారంతో రూ. 10,000 కోట్ల మార్కును చేరుకుందని టిజిఎస్ఆర్‌టీసీ అధికారికంగా ప్రకటించింది. 2023 డిసెంబర్ 9న పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 28 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్లకు పైగా జీరో (ఉచిత ప్రయాణం) టికెట్లను మహిళా ప్రయాణికులు వినియోగించుకున్నట్లు రవాణా శాఖ ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. గతంలో రవాణా ఛార్జీల కోసం నెలకు సగటున రూ. 1,500 నుండి రూ. 2,500 వరకు వెచ్చించే సామాన్య, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినులు, కూలీలు ఇప్పుడు ఆ మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారని, ఈ పొదుపు మొత్తం రాష్ట్రవ్యాప్తంగా రూ. 10,000 కోట్లకు చేరడం మహిళల ఆర్థిక స్వావలంబనకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. పథకం రాకముందు 40 శాతంగా ఉన్న మహిళల వాటా, ప్రస్తుతం 67 శాతానికి పైగా నమోదవుతోందని, ప్రతిరోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నట్లు వెల్లడించారు. మహిళలు ఉచితంగా ప్రయాణించిన టిక్కెట్ల విలువను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ రూపంలో ఆర్టీసీకి చెల్లిస్తోంది. తద్వారా ఆర్టీసీ ఆర్థిక బలోపేతం, సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు ఈ నిధులు కొంత వెసలుబాటును కల్గిస్తున్నాయని స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ప్రారంభమైందని, ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి ద్వారా ఇప్పటి వరకు దాదాపు 290 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకొని మహిళలు 10వేల కోట్లు ఆదా చేసుకున్న సందర్భంగా మహిళలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సరళతరం చేసేందుకు, కచ్చితమైన గణాంకాల కోసం త్వరలో చిప్ ఆధారిత స్మార్ట్ కార్డుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి చెప్పారు.

# కేంద్ర లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

## ఏప్రిల్ 1 న బ్లాక్ డేగా పాటింపు

## ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తెలంగాణ ఆర్‌టీసీ కార్మిక సంఘమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఏప్రిల్ 1 నుంచి 4 లేబర్ కోడ్‌లను అమలు చేయాలని కేంద్రం భ్యావిస్తున్న నేపథ్యంలో ఏప్రిల్ 1ని బ్లాక్‌డేగా పాటించాలని నిర్ణయించినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు తెలిపారు. కార్మిక పోరాటాలతో తెచ్చుకొన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను ఏప్రిల్ 1 నుండి అమలుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, కోడ్‌ల అమలును నిలిపి వేయాలని ఏప్రిల్ 1న దేశ వ్యాప్తంగా 'బ్లాక్ డే'ని పాటించి పని స్థలాలలో నిరసన తెలపాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర అసోసియేషన్‌లు పిలుపునిచ్చాయని తెలిపారు. ఆర్‌టీసీలో కూడా అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా అమలు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ అన్ని యూనియన్స్ నేతలకు లేఖ పంపించినట్టు తెలిపారు.


చదవడం వల్ల ప్రయోజనం ఏమిటంటే నలుమూలల నుంచి వచ్చే విజ్ఞానాన్ని అంగీకరించడం, దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవడం.

న- మహాత్మా గాంధీ

# కాలుష్య కాసారమే!

ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా ఎందుకో ఈ దేశాన్ని కాలుష్యకాసారాలు పట్టిపీడిస్తున్నా యి. పరిశ్రమలు నగరీకరణ, వాహనాలు పెరుగుదల వీటన్నిటినీ చూసి అభివృద్ధి జరుగుతోంది కదా! అని ఎంత సంబరపడినా నానాటికీ తీవ్ర మౌతున్న కాలుష్యస్థాయిలో ప్రపంచాన్ని సైతం భయపెడుతున్నాయి. గాలి,నీరు,నేల వంటి ప్రకృతి వనరులు హానికర పదార్థాల కారణంగా కలుషితమవుతున్నాయి. అవి ప్రతి ఒక్కరి ఆరోగ్యం మీద దాడి చేస్తున్నాయి. పర్యావరణ సమతుల్యాన్ని ప్రభావితం చేస్తున్న విషయం విదితమే. ప్రపంచస్థాయిలో కాలుష్య రీత్యా ర్యాంకులు నిర్ణయిస్తే భారతదేశం టాప్ 25 నగరాల్లో ఉంది. భారతదేశంలో అందులోనూ ఉత్తరప్రదేశ్‌లో కనీసం నాలుగు నగరాలు పారిశ్రామిక కాలుష్యంలో చిక్కుకున్నా యి. ఉత్తరం భారతదేశంలోని నగరాలు గాలి కాలుష్యంతో ముందుంటాయి. ఆ ప్రాంతంలోని చిన్న పట్టణాలు సైతం అతివేగంగా కాలుష్య సమస్యలో చిక్కుకుంటున్నాయి. ప్రధానంగా దేశ రాజధాని ఢిల్లీ ఎప్పుడూ వాతావరణ కాలుష్యంతోనే ఉంటుందని తెలిసిందే. అందువల్లనే అక్కడ విద్యార్థులు స్కూళ్లకు వెళ్లలేకపోతున్నారు. ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లడం మాని 'వర్క్‌ఫ్రమ్ హోం' చేస్తున్నారు. ఈ పరిస్థితులను దాటి రావాలంటే ఢిల్లీ కాలుష్యానికి బ్రేక్ పడాలి. అలాంటి పరిస్థితులు కనుచూపుమేరలో కనపడటం లేదు. కాలుష్య నియంత్రణ మండలికి కానీ పెద్ద పెద్ద శాస్త్రజ్ఞులకు సైతం మింగుడుపడని వ్యవహారంగా కనపడుతోంది. వారి ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. ఢిల్లీలో వాయుకాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) 400 స్థాయికి పైగా నమోదై రెడ్‌జోన్‌లోకి వెళ్లి చాలా రోజులైంది. ఏటా స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థ ఇచ్చే 'ఐక్యూ ఎయిర్' 2025 వార్షిక నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. తాజాగా ప్రపంచంలోనే అత్యంత కాలుష్య పట్టణంగా ఉత్తరప్రదేశ్‌లోని 'లోని' పట్టణం నిలిచింది. అంతకన్నా ఎక్కువ కాలుష్యం మన దాయాది దేశం పాకిస్థాన్ అని ఐక్యూ ఎయిర్ స్విస్ వాయు నాణ్యత సాంకేతిక సంస్థ విడుదల చేసిన 2025 ప్రపంచ వాయు కాలుష్య నాణ్యతా నివేదికలో పేర్కొంది. అలా అని భారత్‌లో కాలుష్యకాసారాలు ఏమీ తక్కువ కాదు. భారతీయ నగరాల్లో వేగంగా పెరుగుతున్న జనాభాయేకాదు కాలుష్య కాసారాలు కూడా గణించదగిన స్థానంలోనే ఉన్నాయి. ఈశాన్య భారతదేశంలో బైర్నిహాట్, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్, ఉలాలు కూడా అంతే సాంద్రతతో కాలుష్యం వ్యాపింప చేసే నగరాలుగా గుర్తించారు. ప్రపంచంలోని 143 దేశాల్లోని 9446 నగరాల్లోని పరిస్థితులను విశ్లేషించిన ఈ సంస్థ పలు అంశాలను చర్చించింది. ఈ నేపథ్యంలో దక్షిణాసియా దేశాల్లో అత్యధిక కాలుష్య నగరాలున్నాయి. 'లోని' పట్టణ సగటు పి.ఎం 2.5 గాఢతను, ఒక క్యూబిక్ మీటర్‌కు 112.5గ్రా నమోదైంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల కన్నా 22 రెట్లు ఎక్కువ. 130 దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన వాయు నాణ్యతా ప్రమాణాల అమలులో విఫలమయ్యాయి. ఈ జాబితాలో భారత్ ఆరో స్థానంలో ఉంది. పాకిస్థాన్ ప్రథమ స్థాయిలో ఉండి గాలినాణ్యత అత్యంత ప్రమాదకరంగా ఉండ డంతో ఆరోగ్య రీత్యా పాకిస్థానీయులు ఉక్కిరిబిక్కిరవుతు న్నారు. ఆ తర్వాత స్థానాల్లో బంగ్లాదేశ్, తజికిస్థాన్ ఉన్నాయి. చైనాలోని హోటాన్ నగరంలో 109.6 మైక్రో గ్రాములు నమోదైంది. భారత్‌లోని కనీసం ఐదు నగరా లు మొదటి పది కాలుష్య నగరాల జాబితాలో ఉండడం ఆందోళనకరం. టాప్ 25 నగరాలన్నీ భారత్, పాక్, చైనా దేశాల్లోనే ఉన్నాయని మరో పరిశీలన కూడా ఈ నివేదికలో స్పష్టమౌతోంది. ప్రపంచ నగరాల్లో 14 శాతం మాత్రమే డబ్ల్యుహెచ్‌ఓ నిర్దేశిత వార్షిక పిఎం ప్రమాణా లను చేరుకోగలిగాయని నివేదిక పేర్కొంది. ఆస్ట్రేలియా, ఐస్‌లాండ్, ఎస్టోనియా, పనామా సహ 13 దేశాలు మాత్రమే సురక్షిత గాలి ప్రమాణాలతో ఉన్నట్లు ఈసంస్థ చెబుతోంది. మరోవైపు లావోస్, కంబోడియా, ఇండోనేషి యా వంటి దేశాల్లో 'లానినా' వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు, గాలులు ఎక్కువగా ఉండడంతో గత ఏడాదితో పోలిస్తే పిఎం 2.5 స్థాయిలు తగ్గాయి. మొత్తం 75 దేశాల్లో కాలుష్య స్థాయిలు తగ్గగా, 54 దేశాల్లో పెరిగాయి. గతంలో నుండే పాకిస్థాన్ కాలుష్యదేశాల జాబితాలో ఉంది కనుక చెప్పేదేం లేదు. పొగమంచు పారిశ్రామిక ఉద్గారాలతో తీవ్ర వాయు కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కొనే నగరాలు ఉత్తరభారతంలో కన్పిస్తాయి. దక్షిణ భారతంలోకి వస్తే హైదరాబాద్‌లో కూడా వాయు కాలుష్య సమస్యతో జనం బిత్తరపోతున్నారు. మొన్నఫిబ్రవరి నుండే వాయుకాలుష్య సంక్షోభంలో పడింది. క్షీణిస్తున్న గాలి నాణ్యత కారణంగా శ్వాసకోశ వ్యాధుల ముప్పు ఉంటుంది. ఆస్తమా, దీర్ఘకాలిక వ్యాధులు కూడా వెంట వస్తాయి. కాలుష్యం ఏ రీతిలో ఉన్నా రోగనిరోధక శక్తి తగ్గి రోగాలు మానవ దేహంపై దాడి చేస్తుంటాయి. కనుక ఆరోగ్యమే మహాభాగ్యం అన్న విషయం తెలిసి మరీ ప్రవర్తించాలి. కాలుష్య సమస్యను తగ్గించడం కోసం ప్రభుత్వం ప్రస్తుతమున్న వాహనాల స్థానే ఎలక్ట్రానిక్ వాహనాలను కొనమని సబ్సిడీలిచ్చి ప్రోత్సహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాలుష్యం వెదజల్లే పాతబడిన వాహనాలను వినియోగం నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తున్నాయి. పునరుత్పాదక శక్తి వినియోగకంపై జనంలో అవగాహన పెంచడం అత్యంతావశ్యకం.

కొంత మందిని అదృష్టం వరిస్తుంది. చిత్రమేమిటంటే వారెప్పుడూ అదృష్టంపై ఆధారపడే వారు కాదు.



ఫ్రాంక్లిన్

చెడును విస్మరించి మంచిని సంస్కరించి సంరక్షించుకోవడం యోగ్యత లక్షణం.



స్వామి వివేకానంద

# సీట్ల పెంపు సమస్యలకు పరిష్కారమా?

*2021లో జరగవలసిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదా పడింది. లోక్‌సభ, రాష్ట్ర శాసన సభల్లో సీట్ల సంఖ్య పెంచడానికి 'డీ లిమిటేషన్' కమీషన్ ఏర్పాటు చేయబడు తుంది. ఏయే నియోజకవర్గాల్లో ఏఏ గ్రామాలుండాలో, నియోజకవర్గాల సరిహద్దులేమిటో డీ లిమిటేషన్ కమీషన్ నిర్ణయిస్తుంది. జనాభా సంఖ్యతో సంబంధం లేకుండానే, గతంలో నిర్ణయించిన సీట్లసంఖ్య ఆధారంగానే చాలాకాలం నుండి, లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల లోక్‌సభ నియోజకవర్గాల్లో అత్యధికశాతం ఓటర్లున్నా, కొన్నిచోట్ల తక్కువ శాతం ఓటర్లున్నా ఎన్నికలు పాతపద్ధతిలోనే జరుగుతున్నాయి. ఇది అసమంజసంగా కనిపిస్తున్నప్పటికీ ఉత్తరాది రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాల మధ్యసమన్వయం కోసం డీలిమిటేషన్ ప్రక్రియను ఇప్పటి వరకు పక్కనబెట్టి, ప్రస్తుతం 50శాతం సీట్లను పెంచి, డీలిమిటేషన్ కమీషన్ ఏర్పాటు చేయబోతున్నారు. నియోజకవర్గాల పునర్వవస్థీకరణ జరిగిన తర్వాత జరిగే ఎన్నికలవలన లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసన సభల్లో పెరుగుతున్న సీట్లవలన చట్టసభలు నిండుగామారే అవకాశముంది. ఇదే సందర్భంలో పెరిగిన ప్రజాప్రతినిధులవలన ఖజానాపై భారంపడే*



సుంకవల్లి సత్తిరాజు

కొత్త పార్లమెంటు నిర్మాణానికి అడుగులు పడిన రోజే పార్లమెంటులో సభ్యుల సంఖ్య పెరుగుతుందని అందరూ ఊహించారు. లోక్‌సభలో 888 మంది సభ్యులు కూర్చోవడానికి, రాజ్యసభలో 384 మంది సభ్యులు ఆసీనులు కావడానికి అనువుగా నూతన పార్లమెంటు భవనం నిర్మింపబడింది. లోక్‌సభ, శాసన సభ సభ్యుల సంఖ్య ఇప్పుడున్న స్థానాలకు అదనంగా 50 శాతం పెరుగుతుందని కేంద్రం సూత్రప్రాయంగా ప్రకటించింది. లోక్‌సభ, శాసన సభల్లో 50శాతం సీట్లు పెంచ డానికిసంబంధించిన బిల్లు ప్రస్తుత సమావేశాల్లోనే ఆమోదం పొందే అవకాశముంది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల సీట్ల సంఖ్య పెంచాలని కేంద్రం తొలుత భావించింది. ఉత్తరాది రాష్ట్రాల జనాభా విపరీతంగా పెరిగిపోవడం, కుటుంబ నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా సంఖ్య గణనీయంగా తగ్గడం వలన జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని కేంద్రం భావించింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచడం వలన పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రాబల్యం పెరిగి, దక్షిణాది రాష్ట్రాల పట్ల మరింతగా వివక్షత పెరిగిపోతుందనే ఆందోళన ఏర్పడింది. ఈ కారణంగానే బిజెపియేతర దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు, నాన్ బిజెపిపార్టీలు ఇందుకు తీవ్ర అభ్యంతరం చెప్పడంతో ఎవరికీ అభ్యంతరం లేనివిధంగా అన్ని రాష్ట్రాల లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను 50 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం వలన డీ లిమిటేషన్ పై తలెత్తిన వివాదం దాదాపుగా సమసి పోయిందనే చెప్పాలి. 10 సంవత్సరాల కొకసారి జరిగే జనగణన ప్రక్రియ కోవిడ్ కారణంగా నిలిచి పోయిన సంగతి విదితమే. తాజాగా చేపట్టిన జనగణన 2027 పూర్తి కాబడుతుంది. ఆ తర్వాత నియోజక వర్గాల పునర్వవస్థీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టబడుతుంది. నియోజకవర్గాల పునర్వవస్థీకరణ కోసం డీ లిమిటేషన్ కమీషన్ ఏర్పాటు చేయాలి. డీ లిమిటేషన్ తర్వాత ప్రస్తుతమున్న 543 లోక్‌సభ సీట్లు సుమారు816కు పెరిగే అవకాశముంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతమున్న రాష్ట్రాల శాసన సభల సీట్లు 4123 నుండి 6185కు పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పెరగవలసిన లోక్‌సభ సీట్లు ఇప్పటి వరకు పెంచలేదు. డీలిమిటేషన్ ప్రక్రియవలన ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతమున్న 175 శాసనసభ సీట్ల సంఖ్య 263కు, లోక్‌సభ స్థానాలు 25నుండి 38కి పెరగవచ్చు. అలాగే తెలంగాణలో శాసన సభ సీట్లు 119 నుండి 179 కి, లోక్‌సభ సీట్లు 17నుండి 26కు పెరగవచ్చు. భారత దేశంలో అధిక జనాభా గల రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభస్థానాల సంఖ్య 80నుండి తాజానిర్ణయం వలన 120కి పెరుగుతాయి. మహారాష్ట్రలో 48 నుండి 72కు, పశ్చిమ బెంగాల్‌లో 42 నుండి 63స్థానాలకు లోక్‌సభ సీట్లు పెరుగుతాయి. బీహార్‌లో 60, తమిళనాడులో 60 వరకు లోక్‌సభ సీట్లు పెరుగుతాయి. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి నియోజకవర్గాల డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్ల బిల్లు అమలు 2029 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో కీలకాంశాలుగా మారబోతున్నాయి. జమిలీ ఎన్నికలు కూడా



2029 నుండే ప్రారంభిస్తారనే సంకేతాలు వెలువడుతున్నా యి. జనగణన పూర్తయి, నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల ప్రక్రియకు విశేషమైన ప్రాధాన్యతఉంది. 1950 జనవరి 25వ తేదీన ఏర్పడిన స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల కమీషన్ ఎన్నికల వ్యవస్థలో అనేక మార్పులను ప్రవేశపెట్టింది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభలకు సీట్ల సంఖ్యను నిర్ణయించడానికి రాష్ట్రపతి ఉత్తర్వులతో కేంద్ర ప్రభుత్వం 'డీలిమిటేషన్ కమీషన్' ను ఏర్పాటు చేస్తుంది. 1971లో జరిగిన జనగణన ఆధారంగా'డీ లిమిటేషన్ కమీషన్' లోక్‌సభ స్థానాలను నిర్ణయించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు అదే ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ఎవరికీ ఉండదు. డీలిమిటేషన్ కమిటీ నిర్ణయాలను లోక్‌సభ, శాసన సభలకు తెలియ చేస్తారు. ఈ నిర్ణయాలపై న్యాయ స్థానాలకు వెళ్ళే అధికారం కూడా ఉండదు. 1952, 1963,1973, 2002 వ సంవత్సరాల్లో నాలుగు పర్యాయాలు జనాభా ప్రాతిపదికన లోక్‌సభ,రాష్ట్ర శాసన సభల సీట్లసంఖ్యను పెంచడానికి డీ లిమిటేషన్ కమిటీలు ఏర్పడ్డాయి. భారత రాజ్యాంగం 1950లో అమల్లోకి వచ్చింది. 1951-52 సంవత్సరాల మధ్య సుమారు నాలుగు నెలల పాటు మొదటి లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటి దేశజనాభా సుమారు 36 కోట్లు. 499 లోక్‌సభ సీట్లకుగాను 489 సీట్లకు అప్పట్లో ఎన్నికలు జరిగాయి. అప్పటి ఓటర్ల సంఖ్య సుమారు 17 కోట్లు. 1952 ఏప్రిల్ 17న మొదటి లోక్‌సభ ఏర్పడింది. ప్రస్తుత పార్లమెంటు దిగువ సభలో గల 543 మంది సభ్యులు 28 రాష్ట్రాలు,8 కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడ్డారు. దేశంలో ప్రతీ పది సంవత్సరాల కొకసారి జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. 2011వ సంవత్సరంలో దేశంలో జనగణన జరిగింది. 2021లో జరగవలసిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదా పడింది. లోక్‌సభ, రాష్ట్ర శాసన సభల్లో సీట్ల సంఖ్య పెంచడానికి 'డీ లిమిటేషన్' కమీషన్ ఏర్పాటు చేయబడుతుంది. ఏయే నియోజకవర్గాల్లో ఏఏ గ్రామాలుండాలో, నియోజకవర్గాల సరిహద్దులేమిటో డీ లిమిటేషన్ కమీషన్ నిర్ణయిస్తుంది. జనాభా సంఖ్యతో సంబంధం లేకుండానే, గతంలో నిర్ణయించిన సీట్ల సంఖ్య ఆధారంగానే చాలా కాలం నుండి,లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల లోక్‌సభ నియోజకవర్గాల్లో అత్యధికశాతం ఓటర్లున్నా, కొన్నిచోట్ల తక్కువ శాతం ఓటర్లున్నా ఎన్నికలు పాత పద్ధతిలోనే జరుగుతున్నాయి. ఇది అసమంజసంగా కనిపిస్తున్నప్పటికీ ఉత్తరాది రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం డీలిమిటేషన్ ప్రక్రియను ఇప్పటివరకు పక్కన బెట్టి, ప్రస్తుతం 50శాతం సీట్లను పెంచి, డీలిమిటేషన్ కమీషన్ ఏర్పాటు చేయబోతున్నారు. నియోజకవర్గాల పునర్వవస్థీకరణ జరిగిన తర్వాత జరిగే ఎన్నికలవలన లోక్‌సభ,వివిధ రాష్ట్రాల శాసన సభల్లో పెరుగుతున్న సీట్లవలన చట్టసభలు నిండుగా మారే అవకాశముంది. ఇదే సందర్భంలో పెరిగిన ప్రజా ప్రతినిధులవలన ఖజానాపై భారంపడే అవకాశాలున్నాయి. వచ్చే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళల ప్రాధాన్యత పెరుగుతుంది. దీనికి సంబంధించిన బిల్లు గతంలోనే ఆమోదం పొందింది. 2014, 2019 ఎన్నికల్లో మహిళల బిల్లు తెస్తామని బి.జె.పి చేసిన వాగ్ధానం నెరవేరడంలో సుదీర్ఘకాలం జాప్యం జరిగినా ఎట్టకేలకుతన వాగ్ధానం నెరవేర్చుకోవడం హర్షదాయకం. 128వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం వలన ప్రస్తుతమున్న నియోజకవర్గాల ప్రాతిపదికన చూస్తే మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. లోక్‌సభ, రాష్ట్ర చట్టసభల్లో 33శాతం మంది మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదం పొందిన ఈబిల్లు వలన 15 సంవత్సరాల పాటు మహిళలు రాజకీయంగా లబ్ది పొందుతారు. రాజ్యసభకు. శాసన మండళ్లకు ఈ రిజర్వేషన్లు వర్తించవు. నియోజకవర్గాల డి లిమిటేషన్ తర్వాత 2029 నుంచి మహిళలకు రిజర్వేషన్లు అమలవుతాయి. చట్టసభల్లో పెరుగుతున్న ప్రాతినిధ్యం వలన దేశ సమస్యలు పరిష్కరింపబడాలి. ప్రజాగళం చట్టసభల్లో మార్మోగాలి.

# కుక్కల బెడద ప్రజా భద్రతకు ముప్పు!

మేకిరి దామోదర్

మన దేశంలో, వివిధ రాష్ట్రాలలో వీధికుక్కలు పల్లె పట్నం, వాడవాడల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నా యి. ఇవి చిన్న,పెద్ద అని తేడాలేకుండా అందరినీ కరుస్తూ భయానక పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలపై మూకుమ్మడిగా క్రూరంగా దాడి చేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. గురువారం రోజు భువనగిరిలో ఇంటి ఆరు బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి, అతని కనుగుడ్లను పీకేసిన హృదయ విదారక ఘటన జరిగింది. ప్రియాంష్ పై రెండు కుక్కలు దాడి చేశాయి. ఒక కుక్క ముఖంపై తీవ్రంగా కరిచి కనుగుడ్లను పీకేసింది. బాలుడు భయానక కేకలు విని పరుగున వచ్చిన వారు నేలపై పడి ఉన్న కనుగుడ్డును చూసి ఆందోళనలో కుక్కను తరిమి కొట్టి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అదేరోజు మరో బాలుడుపై కూడా వీధి కుక్కలు దాడి చేశాయి. ఇలా దేశంలో,మన రెండు తెలుగు రాష్ట్రాల్లో వీధి కుక్కల బెడద పెరిగిపోతోంది. ఆ మధ్య గుంటూరులో వీధికుక్క నాలుగేళ్ల బాలుడి మెడపట్టి ఈడ్చి కెళ్లడంతో పాపం ఆ పిల్లవాడికి అప్పుడే నూరేళ్లు నిండి పోయాయి. గతంలో మెదక్ జిల్లా తూప్రాన్‌లో శునకాలు ఒక్కరోజే పాతికమందిని గాయపరిచాయి. హనుమకొండలో కూడా ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది. ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ సమయంలో ఢిల్లీ స్టేడియం దగ్గరే వీధికుక్కలు జపాన్, కెన్యా కోచ్లను కరిచాయి. ఇలా దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ వీధి కుక్కల విజృంభన తీవ్ర సమస్యగా పరిణమించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. జనం ఎక్కువగా గుమికూడే ప్రాంతాల నుంచి వీధికుక్కలను రక్షణ కేంద్రాలకు తరలించి, సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని ఆదేశించింది. వీధి కుక్కల జనాభాను కట్టడి చేయడంలో యంత్రాంగం చేతకానితనమే ప్రజా భద్రతకు పెనుముప్పుగా సంభవిస్తుంది. వీధి కుక్కల గుంపుల స్త్రైర్యవిహారంతో బయటికి (వీధుల్లో) రావాలంటేనే చాలామంది జంకుతున్నారు. వాటికి భయపడి పెద్దలు వాకింగ్ మానేస్తున్నారు, పిల్లలు పార్కులకు, మైదానాల్లో ఆటలకు దూరమవుతున్నారు. అంతిమంగా ఇది ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వీధి కుక్కలు భీకరంగా అరుస్తూ వాహనదారులను వెంబడిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 2030 కల్లా దేశంలో నుంచి రేబీస్‌ను తరిమికొట్టాలి అన్నది కేంద్రం లక్ష్యం. అది సహకారం కావాలంటే? సునకాల సంతాన నియంత్రణకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తగినంతగా నిధులు కేటాయించాలి. ప్రభుత్వ ఆసుపత్రులు రేబిస్‌టీకాలను విరివిగాఅందుబాటులోకి ఉంచాలి. నానా రకాల చెత్త ఆహార వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వీధి కుక్కల సంతతిని ఇబ్బడి ముబ్బడిగా చేస్తుందని ప్రజలు గుర్తించాలి. పశువర్ధక శాఖ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా కోటిన్నరకు పైగా వీధి కక్కలున్నాయి. అధికారిక గణాంకాల మేరకు నిరుడు దేశీయంగా 37లక్షలకు పైగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. అంత ముందు సంవత్సరంతో పోలిస్తే ఇవి21 శాతం అధికం! ఏటా 60 వేల మందిని కబళించేస్తుంది. వారిలో 36శాతం భారతీయులు కావడందురదృష్టకరం!. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రులు రేబిస్ టీకాల కొరత లేకుండా చూడాలి. ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. ఉన్నత న్యాయస్థాన సూచనలతోపాటు, ప్రభుత్వాలు, అధికారులు, ప్రజలు ఉమ్మడి సంకల్పంతోనే కుక్కకాటు బెడద తీరి ప్రజా భద్రతసాధ్యమవుతోంది.

# ఆహారం ఉంటేనే చదువుకు పరమార్థం



అన్నవరపు బ్రహ్మయ్య

విద్యా విధానం, విద్యార్థులకు ఆహారం అందించడం వేరు వేరు అంశాలు రెండింటిని ముడివేసిమాట్లాడటం సరికాదు. శకునం చెప్పే బల్లి కుడితిలో పడిన చందంగా అవధానిగా, ఎంతోలౌకిత జ్ఞానం కలిగిన పండితునిగా పేరుగాంచడమే కాకుండా పద్మశ్రీ పురస్కారాన్ని పొందిన ప్రవచనకర్త విద్యా విధానాన్ని, పేద పిల్లలకు అందించే ఆహార పదార్థాలకు ముడి పెట్టి వ్యాఖ్యానాలు ఆశ్చర్యం కలిగిస్తోంది. పాఠశాలలో విద్యార్థులకు ఆహారం అందించడం భారతీయ సంస్కృతిలో కొత్తేమి కాదు తన ప్రవచనాలలో ఋషుల పరంపర, ఋషుల గురుకులాల గురించి గొప్పగా చెబుతారు. ఆనాటి గురుకులాలలో చదువుకొనే విద్యార్థులకు ఆ గురుకులాలలోనే ఆహారం అందించే వారు. కానీ పాఠశాలలో పాఠాలు చెప్పడం మినహా భోజనం పెట్టడాన్ని తప్పుపట్టడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నాటి గురువులు భోజనం పెట్టకుండా వస్తులు వుంచేవారా? ఆ ఋషులు రాజుల నుంచి సహకారం పొందకుండానే గురుచకులాలను నిర్వహించేవారా? పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, సబ్సిడీ ధరలకు ఆహార పదార్థాలను పొందడం భిక్ష కాదు, రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన హక్కు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను అనుసరించి భారత ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టం లేదా2013 ఆహార హక్కు చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని 75 శాతం, పట్టణ ప్రాంతాల్లోని 50 శాతం (దాదాపు జనాభాలో మూడింట రెండు వంతుల మందికి) ప్రజలకు అధిక రాయితీతో కూడిన ఆహార ధాన్యాలను పొందేందుకు చట్టబద్ధంగా అర్హత కలిగించింది. అంటే మొత్తం జనాభాలో మూడింట రెండొంతుల మందికి ఈ పథకం వర్తిస్తుంది. అందుబాటులో వున్న సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 80.60 కోట్ల మంది ప్రజలు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. అంతేకాకుండా ఈ చట్టం ద్వారా గర్భిణీ స్త్రీలు, పిల్లల కోసం ప్రత్యేక నిబంధనలతో ప్రతి వ్యక్తికి నెలకు 5కిలోల ఆహార ధాన్యాలను (బియ్యం, గోధుమలు/ముతక ధాన్యాలు) కిలో 1లేదా 2లేదా 3 రూపాయలకు అందించాల్సి వుంటుంది. ఈ చట్టం సక్రమంగా అమలయ్యేవిధంగా పర్యవేక్షించడానికి కేంద్రప్రభుత్వం ఫుడ్ కమీషన్ కూడా ఏర్పాటు చేసింది. ఈ పథకం అమలుకాకపోతే ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాలకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు కూడా చేయవచ్చు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మూడు స్థానానికి ఎగబాకే ప్రయత్నంలో వున్న భారతదేశంలో ప్రొటీన్ లోపం ఒక తీవ్రమైన, విస్తృతమైన సమస్యగా వుంది. 2025 సంవత్సరంలో నిర్వహించిన అధ్యయనం ప్రకారం గ్రామీణ ప్రాంతంలో 70 శాతం మంది, పట్టణ ప్రాంతాలలో 80 శాతం కుటుంబాలు నిర్ణీత స్థాయికంటే ప్రోటీన్ ఆహారం తక్కువగా తీసుకుంటున్నాయి. ప్రజలు



తమ రోజువారి ఆహారంలో కనీసం 15శాతం ప్రోటీన్ లభించే విధంగా చూసుకోవాలి. కానీ భారత దేశంలోని ప్రజలకు సగటున 10శాతం మాత్రమే తీసుకొంటున్నారు. ప్రోటీన్తో కూడిన ఆహార పదార్థాల ధరలు అధికంగా వుండటమే ప్రధాన కారణంగా గుర్తించారు. వ్యక్తి మానసిక, శారీరక సామర్థ్యాలను పెంపొందించడంలో ప్రోటీన్ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ప్రోటీన్ లోపంవల్ల వ్యక్తులలో అలసట, కండరాల క్షీణత వంటి లక్షణాలు బాధిస్తాయి. ప్రోటీన్ లోపం వల్లనే చాలా మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు, తక్కువ ప్రోటీన్ తీసుకోవడం వారి మొత్తం ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. మనిషి మేధస్సు పెంచడంలో ప్రోటీన్ ప్రధాన భూమిక వహిస్తుంది. ఒకవైపు ప్రోటీన్ లోపంతో బాధపడే విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలపై కూడా శ్రద్ధ పెట్టలేరు. వారు చెప్పే అంశాలను పూర్తి అర్థం చేసుకొనే సామర్థ్యం కూడా వుండదు. భారత దేశంలో ఐదేళ్లలోపు పిల్లలలో 35 శాతం మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. 2025వ సంవత్సరంలో వెల్లడించిన గ్లోబల్ హంగర్ ఇండెక్స్ మొత్తం 123 దేశాల జాబితాలో భారతదేశం 102వ స్థానంలో ఉంది. అంగన్వాడీలలో (06 సంవత్సరాల) పిల్లలలో 37.75 శాతం మందిలో ఎదుగుదల లోపం, 17.19 శాతం మంది తక్కువ బరువుతో ఉన్నట్లు పోషణ్ ట్రాకర్ డేటా నివేదించింది. దీనిని బట్టి పేద పిల్లలకే కాదు, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు కూడా పోషకాహార లోపం వున్నట్టు అర్థం అవుతోంది. ఈ స్థితిలో ప్రోటీన్ లోపం నివారించడానికి చౌకగా లభించే గుడ్లను అధికంగా వాడాలని ఆహార నిపుణులు సూచనలు చేస్తున్నారు. పెరుగుదలను పర్యవేక్షించే ఒక ప్రాథమిక సాధనం, దీని ద్వారా 8.5 కోట్లకు పైగా పిల్లలను పర్యవేక్షిస్తున్నారు. ప్రపంచ ఆహార నివేదికలు ఇంత దారుణంగా వుంటే మధ్యాహ్న భోజన పథకం, గుడ్ల పంపిణీపై అవాకులు చవాకులు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిజానికి ఆయన తనకున్న విజ్ఞతతో భారత పౌరులైన పిల్లల పౌష్టికాహార లోపంతో వుండటాన్ని ప్రభుత్వాలను నిలదీయాలి. విద్యావిధానం, విద్యను అభ్యసించే తీరుపై ఆయన వ్యాఖ్యానాలు చేశారే కాని పిల్లలకు అందించే ఆహార పదార్థాల గురించి కాదని కొంతమంది ఆ పెద్దమనిషి అనుయాయులు సోషల్ మీడియాలో సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అదే నిజమైతే ఆయన ప్రవచనాలలో ఏనాడు మారుతున్నవిద్యావిధానంపై ప్రసంగం చేయలేదు. ప్రస్తుతం అమలు అవుతున్నపాఠశాల విద్యావిధానంపై అనేక విమర్శలు వున్నాయి. భారతదేశంలో డబ్బు వున్నవారికి ఒకవిధమైన విద్య పేదవారికి మరో రకమైన విద్య అందుతోంది. ధనవంతుల పిల్లలకు ఎసి గదులలో కార్పొరేట్ విద్యను బోధిస్తుంటే, పేద పిల్లలు వీధులలో వుండే ప్రభుత్వ బడుల విద్యఅందుతోంది. కానీ కార్పొరేట్ సంస్థలలో చదివే విద్యార్థులు, వీధి బడులలో చదివే విద్యార్థులు మాత్రం ఒకే పరీక్షలు రాయడం ఏమిటని ఆయన ఏనాడు ప్రశ్నించ లేదు. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది. అందుకు అవసరమైన విధి విధానాలను తయారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ప్రభుత్వం రూపొందించిన విధానం ఆచరణలో అమలవుతుందా? లేదా?అనే విషయాలను ఏనాడు ప్రస్తావించలేదు. తన పిల్లలకు గురజాడ పేరు పెట్టానని చెప్పుకొంటూ పదే పదే గురజాడ గురించి మాట్లాడే ఆప్రవచన కారుడు 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుష లోయ్,తిండి కలిగితే కండ కలదోయ్..కండకలవాడే మనిషోయ్' అనేగురజాడ మాటలనుఎలామరచిపోయారోఅర్థంకావడంలేదు.



# ప్రజావాక్కు

## గవర్నరును తొలగించాలి

రాజ్యాంగ సూత్రాలకువిరుద్ధంగా హైదరాబాద్లో హనుమాన్ శోభాయత్రలో పాల్గొన్న తెలంగాణ గవర్నరును తక్షణమే తొలగించాలి. మనది లౌకికదేశం. ప్రభుత్వం మతపరమైన కార్యక్రమాలను ప్రోత్సహించరాదు. అందులో అధికారికంగా పాల్గొనరాదు. ప్రజాధనం అందుకోసం ఖర్చుపెట్టరాదు. అయితేఅదేదొపెద్ద ఘనకార్యంలాగా సతీ సమేతంగా పాల్గొన్నాడు. ఒకవేళ మతపరమైన కార్యక్రమంలో పాల్గొనాలనుకుంటే సెలవుపెట్టుకొని, అనధికారికంగా పాల్గొనాలి. గవర్నరు రాష్ట్రప్రజలందరికి నమూనాగా ఉండవలసిన వ్యక్తి. రాష్ట్రంలో ప్రథమపౌరుడు. అందరికి ఆదర్శంగా ఉండవలసిన గవర్నరు, ఇలా మతపరమైన కార్యక్రమంలో పాల్గొనడం రాజ్యంగాన్ని అవమానపరచినట్లే కాగలదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## కల్తీపై చర్యలు చేపట్టాలి

నగర, పట్టణ కూడళ్లలో ఇంకా రోడ్డువెంబడి అమ్మే చిరుతిండ్లు, టిఫిన్లు, మిఠాయిలు, హలీంతదితర ఆహార పదార్థాల నాణ్యతపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆహార పదార్థాల తయారీ కోసం వాడే నూనెలు, రంగు రుచి కోసం కలిపే ప్రమాదకర మిశ్రమాలపై ప్రభుత్వాలు తగు చర్యలుతీసుకోకపోవటం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవు తున్నారు. చట్టప్రకారం ఇటువంటి చిరు వ్యాపారులు సైతం భారత ఆహార భద్రతా అధికార ప్రమాణాల సంస్థ నుంచి తప్పని సరిగా లైసెన్స్‌పొంది ఉండాలి. ఇది మన దేశంలోఆహారభద్రతకోసం ఏర్పాటుచేసిన ప్రధాన సంస్థ. ఇదేకాక భారత ఆహార భద్రతా చట్టం 2013 ఇంకా, చిరువ్యాపారుల జీవన రక్షణ వీధి విక్రయాల నియంత్రణ చట్టం 2014కు లోబడి వీధి విక్రయాలు చేసేవారు ప్రమాణాలు పాటించాలి.

- కె.వెంకట రమణ, సికింద్రాబాద్

## నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాట్సాప్

భారతదేశంలోప్రజా సంభాషణల విధానాన్ని సమూలంగా మార్చిన సందేశ మార్పిడి వేదిక వాట్సాప్. వ్యక్తిగత సంభాషణల నుంచి కార్యాలయ సమన్వయం వరకూ స్మార్ట్‌ఫోన్‌ఉన్న ప్రతివ్యక్తి దైనందిన జీవితంలో ఈ వేదిక ఒక అనివార్య భాగమైంది. న్యాయస్థానం కొత్త నిబంధనలను అంగీకరించకపోతే సేవలను కొనసాగించలేరని వినియోగదారులకుస్పష్టమైనఅల్టిమేటంఇవ్వడంజరిగింది.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

## ఆంధ్రప్రదేశ్ చరిత్రాత్మక అడుగు

భారతదేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా నిలిచి చరిత్ర సృష్టించింది. 2025 ఖరీఫ్ సీజన్ నుండి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచారనిర్వహణ వ్యవస్థ2.0అమలులోకి రావడంతోరాష్ట్రం పూర్తిస్థాయిడిజిటల్ వ్యవసాయ దిశగా అడుగులు వేసింది. ఈ అత్యాధునిక అగ్రిటెక్ సాంకేతికత రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, సాగు ఉత్పాదకతను గణనీయంగా పెంచుతోంది. ఇది కేవలం ఒక సాంకేతిక మార్పు మాత్రమే కాదు, సామాన్య రైతును ఆర్థికంగా బలోపేతం చేసే ఒక సాధికారత మార్గం. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని ఆంధ్రప్రదేశ్ నిరూపిస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మంచి ముందడుగు

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సహాయం చేయడానికి ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతోతెలంగాణ ప్రభుత్వం రాహ్‌వీర్ పథకాన్ని ప్రారంభించింది. ఈపథకం ద్వారా ప్రమాద బాధితులను రక్షించేందుకు ముందుకు వచ్చే వ్యక్తులను రాహ్‌వీర్గా గుర్తించి, వారి మానవతా సేవలకు గౌరవం చెల్లించనుంది. ఈ పథకం కింద బాధితులకు సహాయం చేసిన వారికి రూ.25,000నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసా పత్రం అందజేయబడుతుంది. ప్రాణాలను కాపాడడంలో మంచి సమారిటన్ల పాత్ర ఎంత ముఖ్యమో ఈ పథకం స్పష్టంగా తెలియజేస్తుంది. రోడ్డుప్రమాద బాధితులకు సహాయం చేయడంలో భయం లేదా సంకోచం లేకుండా ఉండేందుకు, సహాయకులకు పూర్తి చట్టపరమైన రక్షణ కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## ప్రభుత్వ ఆసుపత్రులలో లంచాలు

నేటి భారతంలో ప్రభుత్వఆసుపత్రులలో అటెండర్లు, డాక్టర్లు, కింది స్థాయి సిబ్బంది నిరుపేదలను అడుగడుగున వైద్యం పేరుతో ప్రవేశంపేరుతో, సమయపాలన పేరుతో అడుగడుగున అడ్డగోలుగా లంచాలు వసూలుచేస్తున్నారు. అయిన అధికారులు దీనినిపెడచెవిన వెడుతున్నారు. అనారోగ్య సమస్యలతో డబ్బులు లేక దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రుల వైపు మొగ్గుచూపుతుంటే వసూలపేరుతోనిరుపేద కుటుంబాలరక్తం తాగుతున్నారు. అధికారులపర్యవేక్షణనిరంతరం జరు గుతూనే ఉండాలి. ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిష్కరించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)



## డిఎంకె "ఇల్లతరసి"

### మేనిఫెస్టోలో స్టాలిన్ తాయిలాలు

**చెన్నై, మార్చి 29:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మరోమారు విజయం సాధించడమే లక్ష్యంగా అధికార డిఎంకె కూటమి అడుగులే స్తోంది. అందులో భాగంగా ఆదివారం సిఎం స్టాలిన్ ఎన్నికల తాయిలాలు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన డిఎంకె మేనిఫెస్టోను "సూపర్‌స్టార్" మేనిఫెస్టోగా సిఎం స్టాలిన్ అబివర్ణించారు. మేనిఫెస్టోలో భాగంగా "ఇల్లతరసి" పథకాన్ని ప్రకటించారు. పథకం కింద, ఆదాయపు పన్ను చెల్లించని గృహిణులందరికీ గృహోపకరణాలను కొనుగోలు చేయడానికి లేదా మార్చుకోవడానికి రూ.8,000 విలువైన కూపన్ ఇవ్వబడుతుందన్నారు. అంటే, వాషింగ్ మెసీన్, టివి, గ్రైండర్, మైక్రోవేవ్ తదితర గృహోపకరాలు కొనుక్కో వడానికి ఆర్థిక సాయం అందించనున్నారు. అలాగే మహిళలకు నెలకు రూ.2 వేలు, రైతు లకు ఉచితంగా పంపుసెట్లు ఇస్తామని ప్రకటిం చారు. రూ.5 లక్షల వరకు వైద్య బీమాతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి వరకు పిల్లలకు అల్పాహార పథకాలు ప్రకటించారు..

# కేరళంలో ఇక కమలవికాసం

- యువత, మహిళలు మార్పు కోరుతున్నారు
- ఎన్‌డియేకు అనుకూలంగా పరిణామాలు
- పాలక్కాడ్ సభలో ప్రధాని మోడీ ధీమా
- రాష్ట్ర అప్పు రూ.5 లక్షల కోట్లైందని ఆందోళన



**పాలక్కాడ్, మార్చి 29:** కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా యువత, మహిళలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. ఆదివారం పాలక్కాడ్‌లోని కొత్త మైదాన్‌లో నిర్వహించిన బిజెపి ఎన్నికల సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. పవిత్రమైన కల్పతి ఆలయంలో ప్రార్థనలతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ, కేరళం యువత, మహిళల నుండి పెరుగుతున్న మద్దతు బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏకు అనుకూలంగా రాజకీయ సెంటిమెంట్‌లో మార్పును ప్రతిబింబిస్తోందని అన్నారు. రాజకీయ హింసలో ప్రాణాలు కోల్పోయిన బిజెపి కార్యకర్తలకు నివాళి అర్పిస్తూ, "ఈ మార్పు కేరళం ప్రజల ఆశీస్సులతోనే సాధ్యమైంది" అని ఆయన అన్నారు. పాలక్కాడ్‌ను "కేరళ సహజ సౌందర్యానికి ముఖద్వారం"గా ప్రధాని మోడీ ప్రశంసించారు. దానిని ప్రతిభ, సాంస్కృతిక సంపదకు నిలయమైన భూమిగా అభివర్ణించారు. కేరళ సామాజిక నిర్మాణానికి శ్రీ నారాయణ గురు, చట్టంపి స్వామికల్, మన్నత్ పద్మనాభన్, అయ్యన్‌కాలి, కురియాకోస్ ఇలియాస్ చావరా వంటి ప్రముఖ సంఘ సంస్కర్తలు, ఆధ్యాత్మిక నాయకులు చేసిన శాశ్వతమైన సేవలను గుర్తిస్తూ ఆయన వారికి నివాళి అర్పించారు. తన రాజకీయ దాడిని మరింత తీవ్రతరం చేస్తూ, కేరళ నిరుద్యోగం, ఆర్థిక దుర్వినియోగం అనే సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధాని మోడీ ఆరోపించారు. గత దశాబ్దంలో, యువతకు ఉపాధి కల్పించగల పరిశ్రమలను స్థాపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దశాబ్దాలుగా దుష్పరిపాలన, "ఓటు బ్యాంకు రాజకీయాలు" చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) రెండింటినీ విమర్శించారు. "కేరళ నేడు రూ.5 లక్షల కోట్లకు పైగా అప్పుల భారంతో ఉంది. ప్రశ్న ఏమిటంటే ఈ డబ్బు ఎక్కడికి పోయింది?" అని వరుస రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి, ఆర్థిక దుర్వినియోగంపై ఆరోపిస్తూ ప్రధాని ప్రశ్నించారు. పాలక్కాడ్ రాజకీయ చరిత్రను ప్రస్తావిస్తూ, దశాబ్దాలుగా ఈ అసెంబ్లీ నియోజకవర్గానికి వామపక్ష, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించినా, ఇక్కడ పెద్దగా అభివృద్ధి జరగలేదని ప్రధానమంత్రి మోడీ పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ ప్రాంతంలో స్పష్టమైన అభివృద్ధి మొదలైందని ఆయన పేర్కొన్నారు. కేరళలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే రేసులో ఎన్‌డియే బలంగా ఉందని ప్రధానమంత్రి మోడీ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ ప్రకటించారు. "అభివృద్ధి చెందిన కేరళను నిర్మించడానికి తాము (బిజెపి) కట్టుబడి ఉన్నాము. ఇది మోడీ హామీ" అని ఆయన అన్నారు. రాజకీయ వైరుధ్యాలపై పదునైన వ్యాఖ్యలు చేస్తూ, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ రెండూ ఒకరినొకరు బిజెపి "బి టీమ్" అని ఆరోపించుకుంటున్నప్పటికీ, బిజెపిపై దాడి చేయడమే వారి ఉమ్మడి లక్ష్యంగా ఉండటం చూస్తే, వారు నిజంగా ఎవరికి భయపడుతున్నారో స్పష్టమవుతుందని ప్రధానమంత్రి మోడీ అన్నారు. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌లకు సంబంధించిన అవినీతి ఆరోపణలపై ఎన్‌డియే ప్రభుత్వం విచారణ జరుపుతుందని స్పష్టం చేశారు. "ఇప్పటివరకు ఏది మారలేదో, అది ఇప్పుడు మారుతుంది... కేరళ అభివృద్ధి చెందుతుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

## అమెరికా వ్యాప్తంగా నోకింగ్స్ నిరసనలు

- 90 లక్షలమంది పాల్గొన్నట్లు అంచనా
- 50 రాష్ట్రాల్లోను ట్రంప్‌కు పెరిగిన వ్యతిరేకత
- లండన్, ప్యారిస్, రోమ్‌లలోనూ ట్రంప్‌వ్యతిరేక ర్యాలీలు



**మిన్నెసోటా, మార్చి29:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు, ఇరాన్‌తో యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికా, ఐరోపా వ్యాప్తంగా భారీ నిరసనలు వెల్లువెత్తాయి. "నో కింగ్స్" (రాజులు వద్దు) అనే నినాదంతో జరిగిన ఈ ర్యాలీలతో పలు నగరాలు దద్దరిల్లాయి. మిన్నెసోటా ఈ నిరసనలకు ప్రధాన కేంద్రంగా నిలిచింది. సెయింట్ పాల్‌లోని మిన్నెసోటా క్యాపిటల్ లాన్ వద్ద వేలాది మంది ప్రజలు గుమిగూడి తమ నిరసనను శాంతియుతంగా తెలియజేశారు. కొందరు ఆందోళనకారులు అమెరికా జెండాలను తలకిందులుగా పట్టుకుని దేశంలో నెలకొన్న సంక్షోభాన్ని సూచించారు. మిన్నెసోటాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ పాల్గొన్నారు. ట్రంప్ వలస విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా ఆయన తన స్ట్రీట్స్ ఆఫ్ మిన్నియాపాలిస్ పాటను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల పోరాటం దేశానికి ఆశను అందిస్తోందని, ఈ ప్రతిగామి పీడకల ను కొనసాగనివ్వబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గాయని జోన్ బేజ్, నటి జేన్ ఫోండా, సెనేటర్ బెర్నీ సాండర్స్ వంటి ప్రముఖులు కూడా పాల్గొన్నారు. దేశంలోని 50 రాష్ట్రాల్లో 3,100కు పైగా కార్యక్రమాలు జరగ్గా సుమారు 90 లక్షల మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు అంచనా వేశారు. న్యూయార్క్ వంటి డెమోక్రాటిక్ నగరాల నుంచి ట్రంప్‌కు అధిక మద్దతు ఉన్న ఇడాహోలోని చిన్న పట్టణాల వరకు ఈ ర్యాలీలు జరగడం విశేషం. వాషింగ్టన్‌లో వందలాది మంది లింకన్ మెమోరియల్ నుంచి నేషనల్ మాల్ వరకు కవాతు నిర్వహించారు. ఈ నిరసనలను వైట్‌హౌస్ కొట్టిపారేసింది. ఇవి కేవలం "లెఫ్టిస్ట్ ఫండింగ్ నెట్‌వర్క్" సృష్టించినవని, వీటికి ప్రజా మద్దతు లేదని అధికార ప్రతినిధి అబిగైల్ జాక్సన్ విమర్శించారు. నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెస్ కమిటీ కూడా వీటిని "అమెరికా ద్వేషపూరిత ర్యాలీలు"గా అభివర్ణించింది. అమెరికా వెలుపల లండన్, పారిస్, రోమ్ వంటి నగరాల్లోనూ ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. రోమ్‌లో వేలాది మంది యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# తమిళనాట 'విజిల్ విప్లవం'

- డిఎంకె కూటమితోనే పోటీ
- డ్రగ్స్ రహిత రాష్ట్రం లక్ష్యం
- నిరుద్యోగ యువత, మహిళలకు ఆర్థిక సాయం
- టివికె చీఫ్ విజయ్ ఎన్నికల హామీలు
- 2 స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్లు వెల్లడి



**చెన్నై, మార్చి 29:** తమిళనాడులో ఈసారి అసెంబ్లీ ఎన్నికలలో "విజిల్ విప్లవం" సృష్టిస్తుందని టివికె చీఫ్ విజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీ ఎన్నికల చిహ్నమైన "విజిల్"ను ప్రస్తావిస్తూ ఇది కేవలం ఎన్నికలు కావని, ఇదొక "విజిల్ విప్లవం" అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి భారీ బలం, బలగం లేని సాధారణ మధ్యతరగతి నేపథ్యం ఉన్నవారికే తాము టికెట్లు కేటాయించామని తెలిపారు. ఈ పోరు కేవలం తమ "ప్రజల కూటమి (టివికె)", ప్రస్తుత అధికార పక్షమైన "స్టాలిన్ కూటమి (డిఎంకె)" మధ్య మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నికల్లో మొత్తం 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు మరో మారు విజయ్ ప్రకటించారు. పార్టీ అధినేత విజయ్ స్వయంగా రెండు స్థానాల నుంచి బరిలోకి దిగుతున్నారు. విజయ్ తన పూర్తి పేరు "సి. జోసెఫ్ విజయ్" పేరుతో నామినేషన్ వేయనున్నారు. చెన్నైలోని పెరంబూర్ మధ్య తమిళనాడులో పట్టుకోసం తిరుచిరాపల్లి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన పోటీ చేయనున్నారు. తమ అభ్యర్థులను "మక్కల్ కాప్పాలర్గల్"గా అభివర్ణించిన విజయ్ వారు రాజకీయ నాయకులు కాదని, ప్రజల్లో ఒకరని తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ చెన్నైలోని టి.నగర్ నుంచి ప్రచార విభాగం నేత ఆదవ్ అర్జున విల్లివాక్కం నుంచి పోటీ చేయనున్నారు. మాజీ మంత్రి కెఎ సెంగోట్టయన్ గోబిచెట్టిపాళయం నుంచి బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ పలు కీలక హామీలను ప్రకటించారు. తమిళనాడును డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడం, 29 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు నెలవారీ ఆర్థిక సాయం, ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకతకు ప్రత్యేక చట్టం, విద్యార్థులకు రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## బెంగాల్‌లో తుది ఓటరు జాబితా విడుదల

- మాజీ ఎంపి తరుణ్ మోండల్ పేరు గల్లంతు
- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటలయుద్ధం

**కోల్‌కతా, మార్చి 29:** పశ్చిమబెంగాల్‌లో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (సర్) ఆరంభం నుంచి రాజకీయ వివాదంగా మారింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధంతో మొదలై, సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ స్వయంగా న్యాయవాది అవతారమెత్తి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో జుడీషియల్ ఆఫీసర్ల నియమించింది కూడా. ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ శుక్రవారం, శనివారాల్లో 'సర్' తర్వాత రెండు విడతలుగా ఓటర్ల తుది సవరణ జాబితా విడుదలైంది. ఈ లిస్టులో మాజీ ఎంపి పేరు గల్లంతవ్వడం విశేషం. లోక్‌సభ మాజీ ఎంపి తరుణ్ మోండల్ పేరు ఓటరు జాబితా నుంచి గల్లంతైంది. అయితే, ఆయన భార్య పేరు మాత్రం లిస్టులో ఉంది. దక్షిOOణ హౌరా అసెంబ్లీ నియోజకవర్గంలోని 279 నంబర్ బూత్‌లో ఆయన తన ఓటు హక్కును గతంలో కలిగి ఉండేవారు. కానీ, ఇప్పుడు సర్ రివిజన్ తర్వాత ఆయన పేరు జాబితాలోంచి తొలగించింది ఇసి. తరుణ్ మోండల్ 2009లో పశ్చిమ బెంగాల్‌లో ఎస్‌యుసిఐ నుంచి గెలుపొందారు. అప్పుడు ఆయనకు అటు కాంగ్రెస్, ఇటు టిఎంసి మద్దతు ఇచ్చింది. దీంతో ఆయన గెలుపొందారు. కానీ, ఇప్పుడు ఆయన పేరు ఓటరు జాబితాలోనే లేదు. ప్రస్తుతానికి ఆయన పేరును అండర్ కన్సిడరేషన్ కేటగిరిలో ఉంచారు. "సర్" అనంతరం సప్లిమెంటరీ ఓటర్ లిస్టును ఎలక్షన్ కమిషన్ శనివారం సాయంత్రం విడుదల చేసింది. ఇది మూడో జాబితా. అయితే, ఈ జాబితాలో ఎంతమంది పేర్లు తొలగించారు, ఎంతమంది పేర్లు చేర్చారు, మొత్తం ఓటర్ల వివరాలు వంటివి మాత్రం వెల్లడించలేదు. ఈ లిస్టును అడిషనల్ లిస్టుగా ఇసి పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో గత నెలలో 'సర్' పూర్తైంది. మొత్తంగా ఇప్పటివరకు పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షల ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. దీంతో గతంలో 7.66 కోట్లుగా ఉండే ఓటర్ల సంఖ్య తర్వాత 7.08 కోట్లకు చేరింది. తుది సవరణల అనంతరం ఇప్పుడు 7.04 కోట్ల ఓటర్లు కలిగి ఉన్నట్లు ఇసి తెలిపింది. 60 లక్షల ఓటర్లు జ్యుడీషియల్ స్క్రూటినీ కింద ఉన్నాయి.

## మూడోసారి అధికారంలోకి వస్తాం

- మతతత్వానికి వ్యతిరేకులం
- ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధీమా



**మలప్పురం, మార్చి 29:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం సిపిఐ (ఎం), ఎస్‌డిపిఐ ఒప్పందం జరిగిందన్న ఆరోపణలను కేరళ సిఎం పినరయి విజయన్ "అసత్యం" అని కొట్టిపారేశారు. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. తిరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) మతతత్వానికి వ్యతిరేకంగా నిరంతరం బలమైన వైఖరిని కొనసాగిస్తోందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం జిమ్మిక్కుల వల్ల కాదని, దాని పనితీరు ఫలితమేనని ఆయన నొక్కి చెప్పారు. "తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి నుండి, రాష్ట్రం పలు రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించింది" అని సిఎం విజయన్ అన్నారు. "ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన తనకు, ఎల్‌డిఎఫ్‌కు అనుకూలంగా స్పష్టమైన, బలమైన గాలి వీస్తున్నట్లు కనిపించింది. ప్రజలు దశాబ్ద కాలంగా అభివృద్ధిని, సామాజిక భద్రతను చూశారు. మౌలిక సదుపాయాలను ఆధునీకరిస్తూనే, సామాన్యుడి ప్రయోజనాలను కాపాడే "కేరళ నమూనా"పైనే మా దృష్టి కేంద్రీకృతమై ఉంది. ఏప్రిల్ 9న భారీ మెజారిటీతో గెలుస్తామన్న నమ్మకం మాకుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు ఎస్‌డిపిఐ (సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) మద్దతును ప్రస్తావిస్తూ, "మెజారిటీ అయినా, మైనారిటీ అయినా, ఏ రంగు మతతత్వమైనా మన సామాజిక నిర్మాణానికి ముప్పు అని తాము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. గత 10 ఏళ్లుగా కేరళలో ఒక్క మత అల్లర్లు కూడా జరగకుండా ఎల్‌డిఎఫ్ చూసుకుంది. ఎందుకంటే తాము అలాంటి శక్తులతో రాజీపడము" అని అన్నారు. "అనేక నియోజకవర్గాల్లో ఆర్‌ఎస్‌ఎస్, యుడిఎఫ్ మధ్య ఒక స్పష్టమైన అవగాహన ఉంది. ఎల్‌డిఎఫ్‌ను ఓడించడమే వారి ఏకైక లక్ష్యం. బిజెపి బలమైన పోటీదారుగా లేని చోట, యుడిఎఫ్ అభ్యర్థులకే ఓటు వేయాలని ఆర్‌ఎస్‌ఎస్ తన కార్యకర్తలకు ఆదేశాలు కూడా జారీ చేసింది.

## భారతీయులకు అండగా నిలిచిన గల్ఫ్ దేశాలు

### సకాలంలో సాయం అందించినందుకు థాంక్స్: మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 29:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ , సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు వేలాదిమంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ చెప్పారు. కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంద్ధి అని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

## సహజీవనంపై రెండు బెంచ్‌ల విభిన్న తీర్పులు!

### విడాకులు తీసుకోవాలన్న ఒక బెంచ్ సహజీవనం నేరం కాదన్న మరో కోర్టు

**న్యూఢిల్లీ, మార్చి 28:** వివాహితుల సహజీవనంపై కొన్ని రోజుల వ్యవధిలోనే అలహాబాద్ హైకోర్టు రెండు పరస్పర విభిన్నమైన తీర్పులను వెలువరించింది. మార్చి 20న జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పులో ఇప్పటికే వివాహమై జీవిత భాగస్వామి బతికే ఉన్న వ్యక్తి ముందుగా విడాకులు తీసుకోకుండా చట్టబద్ధంగా మరొక భాగస్వామితో సహ జీవనంలోకి ప్రవేశించలేరని స్పష్టం చేశారు. ఈ తీర్పు వెలువడిన కొన్ని రోజులకే డివిజన్ బెంచ్ ఇచ్చిన మరో తీర్పులో పెండ్లయిన పురుషుడు ఒక మహిళతో సహ జీవనంలోకి ప్రవేశించడం చట్ట ప్రకారం నేరం కాదని పేర్కొంది. మార్చి 20 నాటి కేసులో అప్పటికే వేర్వేరు భాగస్వాములతో వివాహం చేసుకున్న ఒక జంట తమ కుటుంబాల నుండి వస్తున్న బెదిరింపుల నుండి రక్షణ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ బెంచ్ విచారించింది. తాము బార్యాభర్తలల్లా కలిసి జీవిస్తున్నామని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని వారు వాదించారు. అయితే వారిద్దరూ విడాకులు తీసుకోనందున వారి సంబంధం చట్ట విరుద్ధమని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అభ్యర్థనను వ్యతిరేకించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన కోర్టు రక్షణ కల్పించడానికి నిరాకరించింది. పరస్పర మమకారంతో ఇద్దరు మేజర్లు కులం, మతం లేదా సామాజిక అడ్డంకులతో సంబంధం లేకుండా ఎటువంటి జోక్యం లేకుండా కలిసి జీవించే హక్కును కలిగి ఉన్నప్పటికీ ఈ హక్కు సంపూర్ణమైనది కాదని పేర్కొంది. ఈ తీర్పు వెలువడిన కొన్ని రోజులకే అందుకు విరుద్ధంగా జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన డివిజన్ బెంచ్ వివాహితుడైన ఒక పురుషుడు, 18 ఏండ్ల యువతికి సంబంధించిన వేరొక కేసును విచారిస్తూ వివాహితుడైన పురుషుడు, మేజర్ అయిన మహిళతో పరస్పర అంగీకారంతో సహ జీవనం చేయడం నేరంగా పరిగణించరాదని స్పష్టం చేసింది. పెళ్లయిన పురుషుడు, మేజర్ అయిన మహిళతో ఆమె సమ్మతితో సహ జీవనం చేస్తున్నంత మాత్రాన అది నేరం కాదని, నైతికతను, చట్టాన్ని వేరుగా ఉండాలని డివిజన్ బెంచ్ తెలిపింది.




## అసోంలో కాంగ్రెస్ 5 గ్యారంటీలు

### ఆదివాసీలకు భూమి పట్టా

### అందరికీ ఆరోగ్య సంరక్షణ: ఖర్గే

**గువహాటి, మార్చి 29:** అసోంలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. మరోవైపు ఓటర్లకు ఎన్నికల వరాలు గుప్పిస్తోంది. తాజాగా ఆదివారం నౌబోయిచాలో నిర్వహించిన ఎన్నికల సభలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐదు గ్యారంటీలను ప్రకటించారు. "కాంగ్రెస్ అధికారంలోని వస్తే మహిళలకు నెలవారీ నగదు బదిలీ చేస్తాం. అంతేకాదు, వ్యాపారం ప్రారంభించడానికి లేదా విస్తరించడానికి సిద్ధంగా ఉన్న మహిళలకు అదనంగా రూ.50వేలు సాయం అందిస్తాం. అన్ని కుటుంబాలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తాం. 10 లక్షల మంది ఆదివాసీలకు శాశ్వత భూమి పట్టాలు ఇస్తాం. రాష్ట్రంలోని సీనియర్ సిటిజన్లకు నెలకు రూ.1250 చొప్పున ఇస్తాం. జుబీన్ గార్గ్ మృతి కేసులో 100 రోజుల్లో న్యాయం చేస్తాం" ప్రకటించారు. అసోంలోని బిజెపి ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ఖర్గే విమర్శించారు. ప్రజలను దోచుకొని, ఢిల్లీలోని తమ నాయకుల, వారి కుటుంబాల ఖజానాను నింపడానికి అసోం బిజెపి తన డబుల్ ఇంజిన్‌ను ఉపయోగిస్తోందని దుయ్యబట్టారు. హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం ప్రజలను భయపెడుతూ, భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది. రాష్ట్ర ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తోందని ఖర్గే ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన అసోం ఓటర్లను కోరారు.

## రష్యాలోని ఉస్త్‌లుగా ఓడరేవుపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి



**మాస్కో, మార్చి 29:** ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయలాంటి ఉస్త్‌లుగా ఓడరేవుపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. బాల్టిక్ సముద్ర తీరంలో ఉన్న ఈ పోర్టులోని గ్యాస్ టెర్మినల్‌పై జరిగిన దాడితో భారీగా మంటలు చెలరేగాయి. ఫలితంగా, అక్కడి కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు సమీపంలో ఉన్న ఉస్త్‌లుగా పోర్టు రష్యా ఇంధన ఎగుమతులకు అత్యంత కీలకమైన కేంద్రం. ఐరోపా, ఆసియా దేశాలకు ఇక్కడి నుంచే అధిక మొత్తంలో చమురు, గ్యాస్ సరఫరా అవుతాయి. ఉక్రెయిన్ ప్రయోగించిన సుదూర శ్రేణి డ్రోన్లు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలను దాటుకుని, నేరుగా గ్యాస్ నిల్వ ట్యాంకర్లను ఢీకొట్టాయి. దీంతో అక్కడ పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం సంభవించి, కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉక్రెయిన్ గత కొంతకాలంగా ఇలాంటి దాడులకు పాల్పడుతోంది. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటోంది. తాజా దాడిలో చమురు శుద్ధి కేంద్రాలు దెబ్బతినడంతో రష్యా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ దాడిని రష్యా రక్షణ శాఖ ధృవీకరించింది. కొన్ని డ్రోన్లను కూల్చివేశామని, మరికొన్ని లక్ష్యాన్ని ఛేదించాయని తెలిపింది. దీనిని ఒక ఉగ్రవాద చర్యగా అభివర్ణించిన రష్యా, తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్‌ను హెచ్చరించింది.

## పరప్పన అగ్రహార జైలులో ఖైదీలకు సెల్‌ఫోన్లు, టీవీలు!



**బెంగళూరు, మార్చి 29:** కర్ణాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు మరోసారి వార్తల్లో నిలిచింది. ఆ జైలులోని ఖైదీలు మొబైల్ ఫోన్లు, టీవీ వాడుతుతీరును చూపిస్తున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముగ్గురు జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు ఖైదీలు విలాసవంతమైన జీవితం గడుతున్నారు. ఖైదీలు మొబైల్ ఫోన్లు వాడటంతో పాటు టీవీ చూస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ వంటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా యాక్సెస్ చేస్తున్నారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై కూడా చర్చించుకున్నారు. ఒక హత్య కేసులో రెండున్నర సంవత్సరాలకుపైగా జైలులో ఉన్న ఖైదీలు గతనెల 27న ఈ వీడియోను రికార్డ్ చేశారు. తమకు తెలిసిన బయట వ్యక్తులకు దీనిని షేర్ చేశారు. దీంతో ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు జైలు అధికారులు అప్రమత్తమయ్యారు. ఖైదీల గదుల్లో తనిఖీలు చేశారు. టాయిలెట్ బ్లాక్ సమీపంలోని భూగర్భ పైప్‌లైన్ ప్రాంతంలో మొబైల్ ఫోన్స్ దాచిపెట్టినట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ముగ్గురు జైలు వార్డెన్లను సస్పెండ్ చేశారు. పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో ఖైదీల అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి గత కొన్ని నెలలుగా కఠిన చర్యలు అమలు చేస్తున్నామని జైలు అధికారులు తెలిపారు. అయితే తమ ప్రయత్నాలను దెబ్బతీయడానికే ఈ వీడియో వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. జైళ్ల డీజీపీ అలోక్ కుమార్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఏదైనా అంతర్గత కుట్ర జరుగుతున్నదా అన్నది కూడా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## పాక్ మాజీ ఆర్మీచీఫ్ ఖ్వామర్ జావేద్ బాజ్వా కన్నుమూత

**రావల్పిండి, మార్చి 29:** పాకిస్తాన్ మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఖ్వామర్ జావేద్ బాజ్వా కన్నుమూశారు. రావల్పిండిలోని మిలిటరీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. బాజ్వా మరణవార్త పాకిస్తాన్ రాజకీయ, సైనిక వర్గాలలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, సైనిక అధికారులు తమ సంతాపం తెలిపారు. 2026 ఫిబ్రవరిలో బాత్రూంలో జారిపడటంతో ఆయనకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. దేశ రాజకీయాలు, అధికారంపై ప్రగాఢ ప్రభావం కలిగిన బాజ్వా, పాకిస్తాన్ సైన్యంలో అత్యంత శక్తివంతమైన జనరల్స్‌లో ఒకరిగా నిలిచారు. 2016 నవంబర్ నుండి 2022 నవంబర్ వరకు, దాదాపు ఆరేళ్లపాటు పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేశారు. 2022లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా, కమర్ జావేద్ బాజ్వా తన సంపద, రాజకీయ ప్రకటనల కారణంగా వార్తల్లోనే నిలిచారు. తన పదవీకాలంలో భారీగా సంపదను కూడబెట్టారని కూడా ఆరోపణలు వచ్చాయి. ఇది పాకిస్తాన్‌లో రాజకీయ దుమారానికి కారణమైంది.

# పశ్చిమాసియాలో మంటలు

## దక్షిణ ఇజ్రాయెల్‌పై హౌతీల క్షిపణి దాడులు

### ఇరాన్‌కు మద్దతుగా యుద్ధరంగంలోకి హౌతీలు

**బీరుట్, మార్చి 29:** మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. హౌతీలు నేరుగా ఈ ఘర్షణలోకి ప్రవేశించి, ఇజ్రాయెల్‌పై క్షిపణులను ప్రయోగించడంతో ఇది ఇప్పుడు ఒక కొత్త, నిర్ణయాత్మక మలుపు తీసుకుంది. ఈ ఘర్షణ ఇప్పుడు ఇరాన్, లెబనాన్‌ఇజ్రాయెల్ సరిహద్దు, ఇప్పుడు యెమెన్‌లో ఒక కొత్త సరిహద్దు తెరుచుకోవడంతో మూడు రంగాలకు విస్తరించింది. యెమెన్ నుండి ఒక క్షిపణిని ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ధృవీకరించింది, అయినప్పటికీ పెద్ద నష్టం ఏదీ జరగలేదని వెల్లడించింది. ఎందుకంటే ఇది యుద్ధ ప్రమాదాన్ని పెంచుతుంది.యుద్ధం ప్రారంభమై నెల రోజుల తర్వాత హౌతీల మొదటి సైనిక చర్యగా చెపుతున్నారు. ఇరాన్, లెబనాన్ (హిజ్బుల్లా), ఇరాక్, పాలస్తీనా (హమాస్)పై దాడులకు వ్యతిరేకంగా ఈదాడి చేశామని వారు ప్రకటించారు.

## యుద్ధ చర్చలకు వేదికగా ఇస్లామాబాద్

**ఇస్లామాబాద్; మార్చి 29:** ఇరాన్ యుద్ధం ఆపడానికి తెర వెనక దౌత్య చర్చలు ప్రారంభమయ్యాయి. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా యూఎస్‌ఇరాన్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఈజిప్ట్, టర్కీ విదేశాంగ మంత్రులు పాకిస్తాన్ చేరారు. సౌదీ అరేబియా ఫారిన్ మినిస్టర్ కూడా ఈ చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ మొత్తం చర్చల్లో కీలక పాత్ర పోషిస్తోంది. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, ఈజిప్ట్ బదర్ అబ్దెలాటీతో సమావేశమయ్యారు. సంయమనం, ఉద్రిక్తతల్ని తగ్గించడం, చర్చలు, దౌత్యం ద్వారా వివాదాన్ని పరిష్కరించాల్సి న అవసరాన్ని ఇరువురూ నొక్కి చెప్పారు. పాక్ మంత్రి టర్కీ విదేశాంగ మంత్రి హకాన్ ఫిడాన్‌తో కూడా భేటీ అయ్యారు. ఇరాన్ పరిణామాల గురించి ఇరువురు చర్చించారు. ఈ విషయంపై భారత విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. భారత్ పాకిస్తాన్ లాగా బ్రోకర్ దేశం కాదని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్ నౌకలకు హార్ముజ్ జలసంధిలో అనుమతి

**టెహ్రాన్; మార్చి 29:** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాకిస్థాన్ కు చెందిన 20 నౌకలు హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఇరాన్ అంగీకరించింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ థర్ స్వయంగా ప్రకటించారు. ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం శాంతికి సంకేతం అని ఆయన అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రతిరోజూ రెండు పాకిస్థాన్ జెండా నౌకలు ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా వెళ్లేందుకు అనుమతి లభించింది. పాకిస్థాన్ జెండాతో ఉన్న మరో 20 నౌకలు హార్మూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నానని, ఇది ఇరు దేశాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే నిర్మాణాత్మక చర్య అని ఇషాక్ దార్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

## మధ్యవర్తిత్వ చర్చలకు సిద్ధమే, షరతులు వర్తిస్తాయి!

**టెహ్రాన్, మార్చి 29:** అమెరికా, ఇరాన్ మధ్య గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ప్రకటించింది. చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలంటే అమెరికా తమ ఐదు షరతులను తప్పనిసరిగా అంగీకరించాలని స్పష్టం చేసింది. ఇరాన్ విధించిన షరతుల్లో ప్రధానంగా తమ భూభాగంపై, ముఖ్యంగా ఇంధన వనరులపై అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని విధించిన వాణిజ్య, చమురు ఆంక్షలన్నింటినీ పూర్తిగా ఎత్తివేయాలని కోరింది. అలాగే, పశ్చిమాసియా ప్రాంతం నుంచి, ముఖ్యంగా తమ సరిహద్దుల నుంచి అమెరికా సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది.



సంజీవరెడ్డినగర్‌లోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద 60వ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిజిపి శివధర్‌రెడ్డి, ఎపి మాజీ డిజిపి ద్వారకాతిరుమలరావు తదితరులు.

## దివంగత ఐపిఎస్ అధికారి ఉమేష్‌చంద్ర 60వ జయంతి వేడుకలు

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** నక్సలైట్ల చేతిలో హత్యకు గురైన ఐపిఎస్ అధికారి ఉమేష్ చంద్ర 60వ జన్మదిన వేడుకలు ఆదివారం నాడు నగరంలో ఘనంగా జరిగాయి. నగరంలోని సంజీవరెడ్డి నగర్ చౌరస్తాలో గల ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి, ఎపి మాజీ డిజిపి ద్వారకా తిరుమలరావు, ఉమేష్‌చంద్ర తండ్రి వేణుగోపాల్‌రావుతోపాటు కుటుంబసభ్యులు, మరికొందరు విశ్రాంత పోలీసు అధికారులు పాల్గొని ఉమేష్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమేష్ చంద్ర పోలీసు అధికారిగా ఎంతో ధైర్యంతో పనిచేసే వారని, తీవ్రవాద కార్యకలాపాలను కఠినంగా అణచివేసేవారని తెలిపారు. యువపోలీసులకు ఆయన ఒక రోల్ మాడల్‌గా ఉండేవారని డిజిపి కొనియాడారు. ఉమేష్‌చంద్రపై ఆయన కుటుం బీకులు రాసిన పుస్తకాన్ని డిజిపి ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ముందుమాటను డిజిపి శివధర్‌రెడ్డి రాశారు.

### దేశవ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్..

## రాష్ట్రంలో లక్షా 44,251 కేసులు పరిష్కారం

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా రాష్ట్రంలో లక్షా 44 వేల 251 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ మేరకు సిఐడి అదనపు డిజి చారుసిన్హా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ లోక్‌అదాలత్ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. గత యేడాది డిసెంబర్‌లో జరిగిన లోక్ అదాలత్ కంటే ఈసారి 37.14 శాతం అధికంగా కేసులు పరిష్కారం అయ్యాయని చారు సిన్హా తెలిపారు. ఈసారి జరిగిన లోక్‌అదాలత్‌లో సాధారణ కేసులతోపాటు సైబర్ నేరాలకు సంబంధించిన బాధితుల కేసులు కూడా కొలిక్కి వచ్చాయని ఆమె తెలిపారు. దీంతో పాటు 21,388 రాజీపడదగ్గ ఎఫ్ ఐఆర్‌లు, 57,343 ఈ పెట్టి కేసులు, 60,094 మోటారు వాహన చట్టం ఉల్లంఘన కేసులు, 791 విపత్తు నిర్వహణ సంబంధిత కేసులు పరిష్కారం అయ్యాయని ఆమె తెలిపారు. ఇందులో హైదరాబాద్‌లో అత్యధికంగా 15,719 కేసులు పరిష్కారం కాగా దీని తరువాత మల్కాజిగిరి ద్వితీయ స్థానంలోనూ, సిద్దిపేట్ తృతీయ స్థానంలో నిలిచాయని ఆమె తెలిపారు. పోలీసు విభాగాలతోపాటు న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంగా వ్యవహారించడంతో భారీగా కేసులు పరిష్కారం అయ్యాయని చారుసిన్హా తెలిపారు.

## ఖజానాకు పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

### ఇప్పటికే రూ.15 వేల కోట్లు రాక

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ఖజానాకు కాసుల పంట పండుతోంది. రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చే ఆదాయంలో 12.30 శాతం మేర పెరిగి వృద్ధి నమోదైంది. ఆర్థిక శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువను భారీగా పెంచడందో పాటు, ప్రభుత్వ స్థలాల అమ్మకం తదితర వాటి ద్వారా రిజిస్ట్రేషన్ల ఆదాయం గణనీయంగా పెరిగింది. మరో రెండు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, ఈ నెల 25వ తేదీ నాటికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.15,013.92 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది గత ఏడాదితో పోల్చితే 8.31 శాతం అధికం. గత 2024-25 ఆర్థిక సంవత్సరం ఇదే సమమానికి రూ.13,861.41 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండు రోజులు మిగిలి ఉండగా, పని వేళలు, స్లాట్లు పెంచడంతో మరింత ఆదాయం సమకూరనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగం ద్వారా ప్రభుత్వ ఖజానకు ఒక్క ఫిబ్రవరి నెలలోనే 1,422.25 కోట్ల రూపాయల మేర చేరింది. గత 10 ఏళ్ల కాలంలో భారీగా ఆదాయం రావడం ఇదే తొలిసారి. గత ఏడాది అంటే 2024-25 ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నెలలో 1,212 కోట్ల రూపాయలు రాగా, ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చిలో 1,440 కోట్ల రూపాయలు సమకూరాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సంలో 11 నెలల కాలానికి గాను మొత్తం 13,863.22 కోట్ల రూపాయల మేర రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చేరింది. ఈ నెలతో కలుపుకొంటే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా మొత్తం 15,500 కోట్ల రూపాయలు దాటుతుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది.


# భూ ఆక్రమణలపై హౌజ్ కమిటీ వేయండి

### దానం నాగేందర్, కడియం శ్రీహరి డిమాండ్

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ బాలానగర్ భూములతో పాటు గత ప్రభుత్వం కేటాయించిన పలు భూములపై హౌజ్ కమిటీ వేయాని ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి ఆరోపించారు. దానం నాగేందర్ మాట్లాడుతూనా సొంత భూమిని కేటీఆర్ ఒక ప్రైవేట్ కంపెనీకి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కట్టబెట్టారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉండటంతో నేను తీవ్రంగా నష్టపోయాను. నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగినప్పటికీ అప్పుడు ఏమీ చేయలేక నోరు మూసుకోవాల్సి వచ్చిందనీ ఆవేదన చెందారు. భూ బదలాయింపుల్లో జరిగిన అక్రమాలను వెలికితీయడానికి ప్రభుత్వం తక్షణమే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నా అని అన్నా రు. ఈ అక్ర మాలకు సంబంధించిన అన్ని ఆధారాలు, పత్రాలు నా వద్ద ఉన్నాయనీ ప్రభుత్వం కోరితే వాటిని సమర్పించడానికి నేను సిద్ధంగా ఉన్నానీ చెప్పారు. నేను వ్యక్తిగతంగా ఎంత నష్టపోయానో నాకు మాత్రమే తెలుసు అని ఆవేదన చెందారు. ఇవన్నీ బయటకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు.



**లక్షల ఎకరాలు దోచుకున్నారు: కడియం శ్రీహరి**



తెలంగాణ అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. గత పదేళ్ల కాలంలో జరిగిన భూ కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయనీ ఆరోపించారు. ధరణి పేరుతో లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను దోచుకున్నారనీ విమర్శించారు. ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందనీ ఆవేదన చెందారు. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కంపెనీల యజమానులను బెదిరించారని విమర్శించారు. వారి వద్ద ఉన్న విలువైన భూములను బలవంతంగా బదలాయించుకున్నారు. ఇదో వ్యవస్థీకృత దోపిడనీ, బాలానగర్ ప్రాంతంలో జరిగిన భూ అక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలనీ అన్నారు.

**రూ. 200 కోట్ల విలువైన భూమి కబ్జా చేశారు : నాయిని రాజేందర్**

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ హన్మకొండలో సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బిఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్ పేరుతో అక్రమంగా దక్కించుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్టఅని విమర్శించారు. నా ఆరోపణలు నిరూపించకుంటే 48 గంటల్లో పదవికి రాజీనామా చేస్తా అని అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్ భూ దోపిడీపై హౌస్ కమిటీ వేయాలనీ కోరారు. అక్రమంగా నిర్మించిన పార్టీ కార్యాలయాల విషయంలో కఠినంగా వ్యవహరించి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలనీ అన్నారు.

## మానేరు రివర్ ఫ్రంట్ పనులను వేగవంతం చేయాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు**
**అసెంబ్లీ కమిటీ హాలులో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం**

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పనుల్లో జాప్యాన్ని నివారించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై అసెంబ్లీ కమిటి హాలులో ఆదివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, పెండింగ్‌లో ఉన్న నిధులు, ప్రాజెక్టు పూర్తికి ఎదురవుతున్న అడ్డంకులపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రాజెక్టు గ్రౌండ్ రిపోర్టులపై ఆరా తీశారు. భూసేకరణ ప్రక్రియ, అంచనా వ్యయం వంటి అంశాలపై స్పష్టమైన నివేదికలు ఇవ్వాలని సూచించారు.
నీటిపారుదల, పర్యాటకశాఖలకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని మంత్రులు ఆదేశించారు. త్వరలోనే మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి మానేరు రివర్ ఫ్రంట్ పనులను స్వయంగా పరిశీలించనున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. కరీంనగర్ నగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు కీలకమని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన, టూరిజంశాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సభ నుంచి కౌశిక్‌రెడ్డిని శాశ్వతంగా సస్పెండ్ చేయాలి

### శాసనసభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరిని తుపాకీతో కాల్చి చంపుతానని పాడి కౌశిక్ రెడ్డి బెదిరించడం కరెక్ట్ కాదంటూ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చేయాలని మండిపడింది. కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కడియం శ్రీహరి తండ్రి లాంటి వారని పాడి కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చెయ్యాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సభలో కొత్త సభ్యులకు ఎలాంటి సంస్కృతి నేర్పుతున్నారని యశస్వినిరెడ్డి ప్రశ్నించారు. సభలో ఇప్పటి వరకు నేర్చుకున్న కొంతో గొప్పో అది కూడా బిఆర్‌ఎస్ సభ్యుల ప్రవర్తనతో మర్చిపోతున్నామని చెప్పారు.
సభా సమయాన్ని ఎందుకు వృధా చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. పార్టీ అంటే సభలో బిఆర్‌ఎస్ ఒక్కటే కాదన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా కడియం శ్రీహరికి సారీ చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు డిమాండ్ చేశారు. కడియంపై కౌశిక్ రెడ్డి తీరుకు కెటిఆర్ హరీశ్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కౌశిక్ రెడ్డి మాట్లాడిన మాటలను పరిశీలించి స్పీకర్ చర్యలు తీసుకోవాలన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు దళితులంటే గౌరవం లేదన్నారు కవ్వంపల్లి సత్యనారాయణ, కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చేయాలన్నారు.
దళిత ఎమ్మెల్యేని బిఆర్‌ఎస్ సభ్యులు అవమానించారని ఎమ్మెల్యే బాలూ నాయక్ అన్నారు. దళితుల పట్ల బిఆర్‌ఎస్ నేతలకు చులకన భావం ఉందన్నారు. కౌశిక్ రెడ్డి అహంకార పూరితంగా ప్రవర్తించారని నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరిని అవమానించేలా ప్రవ ర్తించడం సరికాదన్నారు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్ అన్నారు. కడియం పట్ల అనుచితంగా ప్రవర్తించిన కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్నేళ్ల తన రాజకీయ జీవితంలో ఇలాంటి బిహేవియర్ చూడలేని వినోద్ అన్నారు.



అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యేను చంపేస్తామని బెదిరించడం సరికాదన్నారు ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.
తమ జాతులకు చట్ట సభలో రక్షణ లేకుంటే బయట రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు ఆదిశ్రీనివాస్, మందుల సామెల్. కౌశిక్ రెడ్డిని సభ నుండి శాశ్వతంగా బహిష్కరించాలనీ జయవీర్‌రెడ్డ కోరారు. నిండు శాసనసభలో దళిత సభ్యుడిని చంపుతా అని బెదిరించిన తీరును ఖండిస్తున్నామన్నారు. సభలో అడ్డంకులు సృష్టించడమే బిఆర్‌ఎస్ ఎజెండాగా పెట్టుకుందన్నారనీ ఎమ్మె ల్యే మట్టా రాగమయి ఆరోపించారు. కడియం శ్రీహరి వయసులోనూ, అనుభవంలో పెద్దవారని.. కనీసం ఇంతమంది చెప్పిన కౌశిక్ రెడ్డికి పశ్చాత్తాపం లేదని రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆవేదన చెందారు. మహిళలంటే కౌశిక్ రెడ్డికి గౌరవం లేదు, మహిళా సభ్యులు మాట్లాడుతుంటే డిస్టబ్ చేస్తున్నారని ఎమ్మెల్యేలు రాందాస్, గణేష్ అన్నారు.

## డీలిమిటేషన్, డివల్యూషన్, డిస్క్రిమినేషన్ పేరిట సిఎం అసత్య ప్రచారాలు

### బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీలిమిటేషన్, డివల్యూషన్, డిస్క్రిమినేషన్ పేరుతో అసత్య కథనాలు అల్లుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉత్తరదక్షిణ విభజన అనే కొత్త వాదనను తెరపైకి తీసుకువస్తున్నారంటూ మండిపడ్డారు.
డీలిమిటేషన్ ప్రక్రియలో ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 50శాతం పెంపు చేపడుతూ, దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనను కాంగ్రెస్ ఎందుకు అడ్డుపడుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్, డిఎంకే పార్టీలు జనాభా ప్రాతిపదికపై డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని చెప్పి ప్రక్రియను నిలిపివేశాయన్నారు. ఇప్పుడు అదే అంశాన్ని వక్రీకరించి రాజకీయంగా మహిళల రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళల సాధికారత దిశగా చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం తీసుకురావడం జరిగిందని అన్నారు.
గతంలో యూపిఏ ప్రభు త్వం మహిళలకు సరైన రాజకీయ ప్రాధాన్యత కల్పించడంపై కనీసం ఆలోచించలేదని, డీలిమి టేషన్ ప్రక్రియతో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఈ వర్గాల ఎదుగుదలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందన్నారు.
గత 50 సంవత్సరాలుగా డీలిమిటేషన్ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఇప్పుడు సమన్యాయం, సామాజిక న్యాయం దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను ముందుకు తీసుకువస్తుందన్నారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉండటంతో దానికి తోడు మహిళల రిజర్వేషన్లలో జాప్యం జరిగి 2029 ఎన్నికల్లో అమలుకు నోచుకోదన్నారు. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ సైతం దేశానికి అవసరం. తరచూ ఎన్నికలు జరగడం వల్ల ఆర్థిక భారంతో పాటు పాలనలో అంతరాయం ఏర్పడుతోంది. అయినప్పటికీ ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోంది.

## ఖరీఫ్‌లో యూరియా కష్టాలు రానివ్వొద్దు

### ఇప్పటి నుండే కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలి

### వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు

హుటాహుటిన వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్‌ను ఢిల్లికి పంపిన ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు తగినంత యూరియా సరఫరాకు వీలుగా కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో మొత్తం పంట విస్తీర్ణం దాదాపు 60.60 లక్షల హెక్టార్లకు చేరుకునే అవకాశముందని ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలు సాగవుతాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు యూరియా నిల్వల కోసం వ్యవసాయశాఖ అధికారులు న్యూఢిల్లీలోని కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ కార్యదర్శిని అదేశించారు. రాష్ట్రంలో సాధారణంగా జూన్, జులై నెలల్లో యూరియాకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, అమ్మకాలు కూడా ఎక్కువగా ఉంటాయని మంత్రి తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లోనే ముందస్తుగా యూరియాను కేంద్రం నుండి తెప్పించి నిల్వ ఉంచుకుంటే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంపిణీ చేయొచ్చున్నారు. ప్రభుత్వం ఇప్పటికే యూరియా పక్కదారి పట్టకుండా పంపిణీని పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ విధానం ద్వారా ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడి ఇబ్బంది పడకుండా సమీప యూరియా విక్రయకేంద్రాల ద్వారా ఎరువులు పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన యూరియా కోటాను సమర్థవంతంగా పొందేందుకు, జూన్, జులై నెలల్లో ఏర్పడే అధిక డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఇందుకోసం కేటాయించిన యూరియాలో ఏప్రిల్, మే నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా జరిగేలా న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రిత్వ శాఖలతోపాటు ఎరువులశాఖ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో రాష్ట్రానికి తగిన యూరియా కేటాయింపును సాధించేందుకు ఢిల్లీకి వెళ్లాలని అదనపు వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు.

## రాష్ట్రంలో 187.5 మెగావాట్ల భారీ ఇంధన నిల్వ ప్రాజెక్టు

### అంచనా వ్యయం రూ.1,057 కోట్లు

### కోల్ ఇండియాకు జెన్కో లెటర్ ఆఫ్ అవార్డ్

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** స్వచ్ఛ ఇంధన విస్తరణలో భాగంగా తెలంగాణలో మరో ముందడుగు పడింది. రాష్ట్రంలో భారీ బ్యాటరీ ఇంధన నిల్వ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ఓఏ) అందినట్లు కోల్ ఇండియా లిమిటెడ్ వెల్లడించింది. ఈ మేరకు కోల్ ఇండియా ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్రంలోని చౌటుప్పల్‌లో 750 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బిఇఎస్ఎస్)ను అభివృద్ధి చేసేందుకు తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజి జెన్కో) ఈ ఆర్డర్‌ను ఇచ్చినట్లు తెలిపింది. 187.5 మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టుకు రూ.1,057.09 కోట్ల వ్యయం అవుతుందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కోల్ ఇండియా పేర్కొంది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ పర్చేజ్ అగ్రిమెంట్ (బిఇఎస్‌పిఎ)పై సంతకం చేసిన 18 నెలల్లోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని కంపెనీ తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా, కోల్ ఇండియా నెలకు ప్రతి మెగావాట్‌కు రూ.3.14 లక్షల టారిఫ్‌తో విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. కోల్ ఇండియా 15 రోజులలోపు పనితీరు బ్యాంక్ గ్యారెంటీలు, ఇతర అవసరమైన పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అధికారిక ఒప్పందంపై సంతకం చేయబడుతుందని పేర్కొంది. కాగా ఈ ప్రాజెక్ట్, కోల్ ఇండియా తన ప్రధాన బొగ్గు తవ్వకం వ్యాపారానికి మించి వైవిధ్యీకరణ, పునరుత్పాదక, ఇంధన పరివర్తన రంగంలోకి ప్రవేశించడంపై చూపుతున్న దృష్టిని స్పష్టం చేస్తుంది.

## టిఎన్‌జిఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవ ఎన్నిక

### ప్రధాన కార్యదర్శిగా ముజీబ్

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టిఎన్‌జిఓ) సెంట్రల్ యూనియన్ అధ్యక్షులుగా మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం హుస్సేనీ ముజీబ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండోసారి టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడుగా మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారులు ప్రకటిం చారు. టిఎన్‌జివో రాష్ట్ర సంఘం ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఆదివారం గచ్చిబౌలి బిటిన్‌జివో హౌసింగ్ సొసైటీ ఆవరణలో వారిద్దరు నామి నేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల అధికారిగా సుగుణాకర్‌రెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా సురేష్ వ్యవహరించారు. ఒకేఒక్క నామినేషన్ సెట్ దాఖ లయ్యాయి. మారం జగదీశ్వర్ అధ్యక్షులుగా ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ నాయకత్వంలో 19 మంది సభ్యులు సింగిల్ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో మారం జగదీశ్వర్ అధ్యక్షులుగా ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్ ప్రధాన కార్యదర్శిగా మిగిలిన 17 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక అయి నట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. టిఎన్‌జివో సెంట్రల్ యూనియన్ అధ్యక్షులుగా మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం. హుస్సేనీ ముజీబ్‌లను అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కేంద్ర సంఘం నాయకులు ఘనంగా సన్మానించినట్టు టిఎన్‌జిఓ కేంద్ర సంఘం ప్రకటించింది.

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఇప్పట్లో లేనట్టే!

**రవాణా శాఖకు బడ్జెట్ కేటాయింపులు రూ. 185.97 కోట్లు**
**అందులో నిర్వహణ పద్దు రూ. 130.67 కోట్లు, ప్రగతి పద్దు రూ.55.30 కోట్లు**
**ఆర్టీసీ విలీనం ప్రతిపాదన లేని బడ్జెట్ ప్రసంగం**
**2014 నుండి ఫిబ్రవరి 2026 వరకు ఆర్టీసీ నష్టాలు రూ.12750.48 కోట్లు**

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థగా కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్‌ఆర్‌టీసీ) ఇప్పట్లో ప్రభుత్వంలో విలీనమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. అందుకు తార్కాణం ఈ నెల 20న ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లెక్కలే చెబుతున్నాయి. బడ్జెట్‌లో రవాణా శాఖకు కేవలం రూ. 185.97 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో నిర్వహణ పద్దు కోసం రూ. 130.67 కోట్లు కాగా.. ప్రగతి పద్దు కింద రూ. 55.30 కోట్లను కేటాయించారు. పైగా బడ్జెట్ ప్రసంగంలో ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్టుగా ప్రకటించ లేదు. అంతేకాదు బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో భాగంగా రవాణా శాఖపై జరిగిన చర్చలో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అన్ని విషయాలను ప్రస్తావిస్తూ ఆర్టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనం ప్రక్రియతోపాటు యూనియన్ల పునః నిర్మాణం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని ప్రకటించారు. దీంతో ఇప్పటికిప్పుడు ఆర్టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనమయ్యే అవకాశం కనిపించడం లేదు. రవాణా శాఖకు బడ్జెట్ కేటాయింపుల్లో అదనంగా కేటాయించి ఉంటే వచ్చే ఏడాది లోపుగా ఎప్పుడైనా ఆర్‌టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనమయ్యే అవకాశం ఉంటుందని భావించడానికి అవకాశం ఉండేది.



కానీ బడ్జెట్‌లో అలా ప్రకటించలేదు కాబట్టి.. అదనంగా నిధులను మధ్యలో కేటాయించే అవకాశం ఉండదు. కాబట్టి ఈ ఏడాది కూడా ఆర్‌టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనమయ్యే అవకాశం లేనట్టే కనిపిస్తోంది. రవాణా శాఖ పద్దుపై చర్చలో భాగంగా ఆర్‌టీసీ గురించి ప్రస్తావిస్తూ.. 2014 నుంచి 2026 ఫిబ్రవరి వరకు ఆర్‌టీసీ సంస్థ రూ. 12,750.48 కోట్లు నష్టాల్లో ఉందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వంలో ఆర్‌టీసీని విలీనం చేయాలంటే.. ఈ నిధులను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంటుంది.. అటు వంటిది ఏమీ ప్రభుత్వం ప్రకటించ లేదు కాబట్టి.. ఇప్పట్లో ఆర్‌టీసీ ప్రభుత్వం విలీనమయ్యే అవకాశాలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లేదంటే అప్పుగానైనా ఇతర సంస్థల నుంచి తీసుకొని వాటిని మాఫీ చేస్తున్నట్టుగా ప్రకటించాల్సి ఉంటుంది. రవాణా శాఖలో బడ్జెట్ కాకుండా ఆర్‌టీసీకి2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్లో రూ.4305.49కోట్లు కేటాయిం చినందుకు ఉద్యోగులందరి తరపున, తన తరపున ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి ధన్య వాదాలు తెలియజేస్తున్నట్టు రవాణా శాఖ మంత్రి అసెం బ్లీలో ప్రకటించారు..ఆర్టీసీ రాష్ట్రంలో 11 రీజియన్స్, 97 డిపోల ద్వారా రవాణా సేవల్ని అందిస్తోంది. మొత్తం ఆర్‌టీసీ 10081 బస్సులను కలిగి ఉంది. రోజుకు దాదాపు 35.19 లక్షల కిలోమీటర్లు నడుపుతోంది. 98 శాతం ఆక్యుపెన్సీతో రోజుకు సగటున 62.34 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంది. ఫిబ్రవరి 28 నాటికి, వివిధ కేడర్లలో ఆర్‌టీసీలో 38,292 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత, సంస్థ లాభాలను ఆర్జించింది. 2023-24 సంవత్సరంలో సంస్థ రూ.104.10 కోట్ల లాభాన్ని సాధించగా, 2024-25 సంవత్సరంలో రూ.2848.25 కోట్ల నష్టాన్ని చవిచూసింది. 2025-26 సంవత్సరంలో (ఫిబ్రవరి2026 వరకు) సంస్థ రూ.954.86 కోట్ల ఆపరేటింగ్ లాభాన్ని ఆర్జించింది. 2014 నుండి ఫిబ్రవరి 2026 వరకు సంస్థ మొత్తం నష్టాలు రూ.12750.48 కోట్లుగా ప్రభుత్వం ప్రకటించింది.




నిరసన ర్యాలీలో పాల్గొన్న పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

## ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధాన్ని వెంటనే నిలిపి వేయాలి

### కాంగ్రెస్, సిపిఐ (ఎంఎల్), టిజెస్, ఎంబిటి నిరసన ర్యాలీ

**హైదరాబాద్ (చార్మినార్), మార్చి 29 ప్రభాతవార్త :** పశ్చిమాసియలో జరుగుతున్న యుద్ధం వలన వివిధ దేవాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున ఆమెరికా ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం వెంటను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్,సీపీఐ (ఎంఎల్).తెలంగాణ జన సమితి,ఎంబిటీ, టిఫిటిఎఫ్‌తో పాటు అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం చారిత్రక చార్మినార్ నుంచి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు నిరసన ర్యాలీ జరిగింది.ఈ సందర్భంగా చార్మినార్ వద్ద తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ఆమెరికా ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం వల్ల ఎంతో నష్టం జరుగుతుందని,వస్తువుల ధరలు పెరిగి పోతున్నాయని,వెంటనే యుద్ధం ఆపి వేయాలని తెలిపారు.ప్రముఖ విద్యావేత్త,ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఇరాన్‌పై ఆమెరికా,ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం దురాక్రమణ యుద్ధమని,శాంతి కోసం ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు.ఆమెరికా అధ్యక్షులు ఎప్పుడు ఏమి మాట్లాడుతారో తెలియదని,వెంటనే యుద్ధాన్ని నిలిపి వేయాలని ఆయన కోరారు.కాంగ్రెస్,తెలంగాణ జన సమితి,ఎంబిటి,సీపీఐ (ఎంఎల్)కు చెందిన నాయకులు ఇరాన్‌పై ఆమెరికా,ఇజ్రాయిల్ దాడులను ఖండిద్దాం అంటూ ఆమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ,మాజీ ఎంపి అజీజ్ పాషా,మాజీ ఎంపి అజీజ్ పాషా,తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్,రాష్ట్ర సిపిఐ (ఎంఎల్) అసిస్టెంట్ కార్యదర్శి ఈటి నర్సింహ్మా,సిటీ సిపిఐ (ఎంఎల్) కార్యదర్శి స్టాలిన్,మాజీ కార్పొరేటర్ అంజాదుల్లాఖాన్ ,హైదరాబాద్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్ వెంకటేష్ ముదిరాజ్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,చాంద్రాయణ గుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్,మాజీ ఇంఛార్జి కె.వెంకటేష్,సిపిఐ (ఎంఎల్) నాయకులు చంద్రమోహన్,కాంగ్రెస్ నాయకులు సురేష్ బాబు,సయ్యద్ ఇక్బాల్‌తో పాటు పలు వురు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.




## సాధారణ మహిళ ఖాతాలో రూ.10 కోట్లు!

**మైన్‌పురి(యూపీ), మార్చి 29:** బ్యాంకు ఖాతాలో ఏకంగా రూ. 10 కోట్లు ఉండటంతో ఒక్కసారిగా కళ్లు బైర్లు కమ్మాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మైన్‌పురి జిల్లాలో ఒక సాధారణ రైతు కుటుంబానికి ఊహించని షాక్ తగిలింది. ఏటీఎంకు వెళ్లి బ్యాలెన్స్ చెక్ చేసుకున్న ఆ కుటుంబానికి, తమబ్యాంకు సర్వర్‌లలో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల జరిగిన ఈ వింత ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మైన్‌పురి జిల్లాలోని సుల్తాన్ గంజ్ ప్రాంతానికి చెందిన సీత అనే మహిళకు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉంది. ఆమె కుమారుడు అరుణ్ కుమార్ కొత్త ఏటీఎం పిన్ జనరేట్ చేయడానికి, బ్యాలెన్స్ చెక్ చేయడానికి బ్యాంకు ఏటీఎంకు వెళ్ళాడు. స్క్రీన్‌పై బ్యాలెన్స్ చూడగానే అతను అవాక్కయ్యాడు. అందులో అక్షరాలా రూ. 9,99,49,586 (దాదాపు 10 కోట్లు) ఉన్నట్లు చూపించింది. కళ్లని నమ్మలేక రెండు మూడు సార్లు రశీదులు తీసి చూసినా అదే మొత్తం కనిపించడంతో కంగారుగా ఇంటికి పరిగెత్తాడు. సాధారణంగా ఎవరైనా తమ ఖాతాలో అంత డబ్బు చూస్తే సంబరపడతారు. వ్యవసాయంపై ఆధారపడి బతికే ఆ కుటుంబం మాత్రం భయపడింది. మా కష్టార్జితం కాని రూపాయి కూడా మాకు వద్దు. బ్యాంకు అధికారులు ఆ డబ్బును వెంటనే వెనక్కి తీసుకోవాలి అని సీత, ఆమె భర్త ఫర్జన్ స్పష్టం చేశారు. బ్యాంకు సెలవు ముగియగానే వెళ్లి ఆ మొత్తాన్ని అప్పగిస్తామని వారు ప్రకటించి తమ నిజాయతీని చాటుకున్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా సుల్తాన్‌గంజ్ బ్రాంచ్ అధికారులు స్పందిస్తూ.. ఇది కేవలం టెక్నికల్ ఎర్రర్ మాత్రమేనని తెలిపారు. సదరు మహిళకు బ్యాంకులో లోన్ అకౌంట్ ఉందని, సిస్టమ్ అప్‌డేట్ సమయంలో ఇలాంటి పొరపాట్లు జరుగుతుంటాయని వివరణ ఇచ్చారు.

## పశ్చిమ ఆస్ట్రేలియాలో ఎర్రగా మారిన ఆకాశం!

### సోషల్ మీడియాలో వైరల్ అయిన విడియోలు

**కాన్‌బెర్రా,మార్చి 29:** పశ్చిమ ఆస్ట్రేలియాలో శనివారం ఓ దృశ్యం ప్రజలనువిస్మయపరిచింది. పగటిపూట ఆకాశం అకస్మాత్తుగా గాఢమైన ఎరుపు రంగులోకి మారింది. షార్క్ బే, డెన్హామ్ వంటి ప్రాంతాలలో, ఎర్రటి ధూళి దుప్పటిలా వీధులను, ఇళ్లను, చివరికి సముద్ర తీరాన్ని కూడా కప్పేసింది. ఈ వింత, భయానక దృశ్యానికి నారెల్ అనే ఉష్ణమండల తుఫాను కారణమని తేలింది. బలమైన గాలులు ఎడారి ప్రాంతం నుండి ఇనుము అధికంగా ఉన్న ఎర్రటి మట్టిని గాలిలోకి తీసుకువచ్చాయి. ఈ ధూళి ఆకాశంలోకి వ్యాపించడంతో, సూర్యకాంతి చెల్లాచెదురుగా ప్రసరించి, ఆకాశం రక్తవర్ణంలో కనిపించేలా చేసింది. కాగా ఈనెల 27నరెల్లే తుఫాను పశ్చిమ ఆస్ట్రేలియా వాయువ్య తీరాన్ని తాకింది. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో గాలులు నమోదయ్యాయి. బలమైన గాలుల కారణంగా దృశ్యవీక్షణం పూర్తిగా పడిపోవడంతో, ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అంతా దుమ్ముతో కప్పబడి ఉండటంతో బయట వాతావరణం "అత్యంత భయానకంగా" ఉందని షార్క్ బే కారవాన్ పార్క్ సోషల్ మీడియాలో తెలిపింది. తుఫాను అత్యంత తీవ్రమైన ప్రభావం ఎక్స్‌మోత్ పట్టణంలో కనిపించింది. విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతింది. వేలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది, అనేక ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి, పడవలు మునిగిపోయాయి. చెవ్రాన్, వుడ్‌సైడ్, శాంటోస్‌తో సహా ప్రధాన గ్యాస్ ప్లాంట్లు కూడా ప్రభావితమయి విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడింది. ఆ తర్వాత తుఫాను తీవ్రత తగ్గి ఉష్ణమండల అల్పపీడనంగా మారినప్పటికీ, భారీ వర్షాలు, వరదల ముప్పు ఇంకా కొనసాగుతోంది. వాతావరణ శాస్త్రవేత్తల ప్రకారం, ఈ ప్రాంతంలోని నేలలో ఐరన్ ఆక్సైడ్ అంటే ఇనుపరజను అధిక మొత్తంలో ఉంటుంది. తుఫాను బలమైన గాలులు ఈ ఎర్రటి ధూళిని ఎత్తైన ప్రదేశాలకు తీసుకువెళ్లాయి. సూర్యరశ్మి ఈ ధూళిపై పడినప్పుడు, ఆకాశమంతా ఎర్రగా కనిపించింది. ఇది ఒక అరుదైన సంఘటనగా పరిగణించబడుతుంది. నాసా ఉపగ్రహ చిత్రాలు కూడా నరెల్లే తుఫాను మార్గాన్ని స్పష్టంగా చూపించాయి.

# గడువులోగా కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు పూర్తి

### రెండేళ్లలో దిండి ఎత్తిపోతల పథకం పనులు

### గృహ వినియోగ గ్యాస్‌కు కొరత లేదు

### కమర్షియల్ సిలిండర్ల కొరతను త్వరలో అధిగమిస్తాం

### శాసనసభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త :** రాష్ట్ర పరిధి కృష్ణా బేసిన్‌లోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర టిపారుదల, పౌర సరఫరాలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అప్పులు చేయడంతో నీటిపారుదల రంగానికి తక్కువ ప్రయోజనం కలిగిందని విమర్శించారు. రూ.1.81 లక్షల కోట్ల ఖర్చులో ఎక్కువ భాగం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు మళ్లించడంతో, పాలమూరు-రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల ద్వారా కొత్త ఆయకట్టు సృష్టి జరగలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రెండు ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా రూ.97,000 కోట్లను అధిక వడ్డీకిఅప్పుగా తీసుకుందని, దాంతో ప్రస్తుతం ప్రభుత్వంపై రూ.82,000 కోట్ల అప్పుల భారం పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.41,000 కోట్ల అప్పుతోపాటు రూ.16,000 కోట్లు వడ్డీని చెల్లించిందని చెప్పారు. ఇకపై తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలను తీసుకుని ప్రాజెక్టుల పనులకు నిధులు సమకూరుస్తామని తెలిపారు.ప్రస్తుతం ప్రాజెక్టుల పనుల్లో జాప్యానికి గత ప్రభుత్వం చేసిన అప్పులే కారణమన్నారు. ఆర్థిక అవ్యవస్థ వల్లేనని స్పష్టం చేశారు.ఎస్ఎల్‌బిసి టన్నెల్ (దిండి) తెలంగాణ ప్రజల కలగా పేర్కొన్న మంత్రి ఉత్తమ్.. 2028 జూన్ నాటికి పనులు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. 2025 ఫిబ్రవరిలో ప్రమాదం జరిగిన తర్వాత ఆధునిక సాంకేతికతతో పనులు పునః ప్రారంభమయ్యాయని, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. దిండి ఎత్తిపోతల పథకం విషయంలో గత ప్రభుత్వం నీటి వనరుల మూలాను ఖరారు చేయకుండానే రూ.5,000 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. ప్రస్తుతం ఏదుల- డిండి లింక్‌కు రూ.1,800 కోట్లు మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు 30 టీఎంసీలు నీరు అందించేలా ప్రణాళిక రూపొందించామని రానున్న రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం దేశంలోనే అతిపెద్ద ఆహార భద్రత కార్యక్రమమని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ పథకం ద్వారా సుమారు 3.39 కోట్ల మందికి ప్రతి నెల 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. ఇది ప్రజలకు మెరుగైన పోషణతోపాటు గౌరవాన్ని అందిస్తోందన్నారు. గృహ అవసరాలకు ఉపయోగించే 14 కిలోల గ్యాస్ సిలిండర్ల కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే అంతర్జాతీయ పరిస్థితుల వల్ల 19 కిలోల కమర్షియల్ సిలిండర్లు, ఆటో గ్యాస్ సరఫరాలో కొంత కొరత ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలతో సమన్వయం కొనసాగుతోందని, త్వరలో పూర్తిస్థాయిలో సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు.

# యువత ఆరోగ్యంపైనే దేశ భవిష్యత్తు

### గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** దేశ భవిష్యత్తు యువత ఆరోగ్య కరమైన అలవాట్లపైనే ఆధారపడి ఉందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నా రు. ఆదివారం నెక్లెస్ రోడ్‌లో ఖేల్ ఇండియా, ఫిట్ ఇండియాలో భాగంగా నవ్‌భారత్ పేరుతో నిర్వహించిన 2కే, 5కే రన్‌ను గవర్నర్ జెండా ఊపి ప్రారంభించి యు వతకు దిశానిర్దేశం చేశారు. పెద్దసంఖ్యలో హాజరైన విద్యార్థులను ప్రోత్స హించారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు ప్రతి కుటుంబం క్రియాశీల జీవనశైలిని అలవర్చు కోవాలన్నారు. మాదకద్రవ్యాల మహ మ్మారిని తరిమికొట్టి, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వా ములు కావాలి అని పిలుపునిచ్చారు.




**అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ అనాలోచిత యుద్ధం: వెంకయ్యనాయుడు**

అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ అనాలోచిత యుద్ధ మని, ట్రంప్ ఏమీ మాట్లా డుతున్నాడో ఆయనకే తెలియదని మాజీ ఉపరాష్ట్రపతి వెంక య్య నాయుడు అన్నారు. దేశం శాంతియుతంగా ఉండాలని, ఇరాన్, ఇజ్రా యెల్‌లతో భారతదేశం స్నేహంగా ఉందని తెలిపారు. ఇరాన్ వాళ్ల థ్యాంక్ యూ ఇండియా అని అంటున్నారని గుర్తు చేశారు. ప్రపంచమంతా శాంతిగా ఉండాలని కోరారు. మనం శాంతి కాముకులం..కానీ మన జోలికి ఎవరైనా వస్తే ఆపరేషన్ సిందూర్ వంటి వాటితో మన ప్రతాపం ఏమిటో చూపించామని తెలిపారు.'దేశం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ ఫిట్ నెస్‌తో ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్య మార్పు మాత్రమే శక్తివంతమైన మార్పు. పోషకాలు ఉండే బియ్యాన్ని తినండి.పురుషులతో సమానంగా మహిళలను భావించండి. మంచి భోజనం చేయండి..పీజా, బర్గర్లు తినొద్దు' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయకుడు సూచించారు.

**యువత ఆరోగ్యంతోనే ఫిట్ ఇండియా సాధ్యం :కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి**

యువత ఆరోగ్యంతోనే ఫిట్ ఇండియా సాధ్యమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'ఆరోగ్యం కోసం, ఐక్యత కోసం, వికసిత్ భారత్ కోసం, వికసిత్ తెలంగాణ కోసం ఒక ఉద్యమంలా రన్‌లో పాల్గొన్న యువతకు శుభా కాంక్షలు తెలిపారు. మన దేశానికి ఉన్న పెద్ద ఆస్తి యువత. వచ్చే 25 యేళ్లలో మన దేశాన్ని వికసిత్ భారత్‌గా ఎదగాలని కోరుకుం టున్నామో.. దానికి పెద్ద శక్తి యువత' అని అన్నారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమరయ్య, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, సినీ నటుడు శర్వానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో కేవలం 35 శాతం మంది విద్యార్థులు

### సరైన మౌలిక వసతులు లేక ప్రైవేట్ బాట

### బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

**హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్కూల్ విద్యార్థులు 65 శాతం మంది ప్రైవేట్‌లో చదువుతుంటే కేవలం 35 శాతం విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్నారని బిజెపి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ "ప్రభుత్వ స్కూల్స్ కు ఎందుకు ఈ దుస్థితి వచ్చింది..?ప్రభుత్వ స్కూల్లో పిల్లల శాతం ఎందుకు తగ్గుతుంది.మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎక్కడ తప్పిదాలు జరుగుతున్నాయి..? ఎక్కడ వైఫల్యం చెందుతుంది..?బ్రేక్ ఫస్ట్, మిడ్ మిల్స్, ఈవినింగ్ స్నాక్స్ పెట్టినా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం కనిపించడం లేదు. కూలి పని చేసుకునే తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ స్కూలల్లో చదివించాలని ఎందుకు అనుకుంటున్నారు..?సరైనా ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడమే కారణం. ప్రభుత్వ స్కూల్స్ కుంటు పడుతున్నాయి ప్రవైట్ స్కూల్స్ విచ్చల విడిగా ఫీజులు పెంచుతూ ఇష్టం వచ్చినట్టు వసూళ్లు చేస్తున్నాయి. ఆప్రైవేట్ స్కూళ్లు దోపిడి చేస్తుంటే పట్టించుకునే నాథులే లేరు. మిడ్ డే మిల్స్ లో కారం నీళ్లే తప్ప ఏం లేదు..మధ్యాహ్న భోజన పథకంలో పారదర్శకత లేదు, కోట్లు దగా చేస్తున్నారు"అని వెంకటరమణారెడ్డి విమర్శించారు.

**కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయడం లేదు: బిజెపి నేతలపై పరిగి ఎమ్మెల్యే విమర్శ**

కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసినా ఎందుకు సిబిఐ విచారణ చేయడం లేదని కేంద్రం ప్రభుత్వం, బిజెపి ఎమ్మెల్యేలను ఉద్దేశించి పరిగి ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డి విమర్శించారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ చేసిన తప్పిదాలను ఒకొక్కటిగా సరిదిద్దుకుంటూ వస్తున్నామన్నారు. గత ఎంపి ఎన్నికల్లో సైతం బిఆర్ఎస్ ఓట్లన్నీ బిజెపికి పడేలా చీకటి ఒప్పందాలు చేసుకున్నారని విమర్శించారు. బిజెపి నేతలు దమ్ముంటే కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని విమర్శించారు.

**గత ప్రభుత్వం రోడ్లను విస్మరించింది: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

గత ప్రభుత్వంలో సొంత కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చి బిల్లులు తీసుకుని రోడ్లన్ని విస్మరించారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. ఈమేరకు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగర చుట్టూ ఉన్నటువంటి ట్రిబుల్ ఆర్ విషయంలో లాండ్ కోల్పోయిన వారికి అక్కడున్నటువంటి రేటుకు మూడింతలు ఇస్తామని హామీ ఇచ్చింది. అది ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. ప్రజాపాలనలో భాగంగా గ్రామాల్లోని రోడ్లన్నీ కనెక్టివిటి చేసి రోడ్లు వేయాలని కోరారు. చాలాప్రాంతాల్లో రోడ్లు బాగాలేక చాలా ప్రాంతాల్లో యాక్సిడెంట్‌లు అవుతున్నాయన్నారు.

### గోదావరి పుష్కరాల పనుల సమన్వయం కోసం

# ప్రజాభవన్‌లో వార్ రూమ్

### అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు టెక్నికల్ ఇంజినీర్ల కమిటీ నియామకం


### గోదావరి పుష్కరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి29:** బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రధాన ఆలయాలు, పుష్కర ఘాట్ల అభివృద్ధి ప్రణాళికలపై కేబినెట్ సబ్ కమిటీ, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం శాసనమండలిలోని కమిటీ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2027 జూన్ లో గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసిన సీఎం పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీని నియమించాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటించి 15 లేదా 20 రోజుల్లోగా నివేదికను అధికారుల కమిటీకి అందజేయాలన్న సీఎం ఇంజనీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి, పూర్తి అంచనాలతో నివేదికను కేబినెట్ సబ్ కమిటీకి పంపాలని సూచించారు. కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం తరువాత ప్రణాళికలకు సంబంధించిన నివేదికపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుం టుందన్నారు.

శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని సిఎం సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ప్రజా భవన్ లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో ఘాట్ల విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిఎం పేర్కొన్నారు. రోడ్లు, వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్ పై అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మమ్మల్ని తొక్కుతామన్నాడు..

### ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కూడా ఎథిక్స్ కమిటీకి పంపండి : తలసాని డిమాండ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి29:** అసెంబ్లీని కాంగ్రెస్ ఇష్టానుసారంగా నడిపిస్తుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. అక్రమ మైనింగ్‌పై హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని.. దానిపై హౌస్ కమిటీ వేయాలని కోరామని తెలిపారు. మేం హౌస్ కమిటీకి డిమాండ్ చేస్తే సీబీ సీఐడీ విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారని తెలిపారు. మా డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం యత్నించిందని మండిపడ్డారు.

ఆదివారం తెలంగాణ భవన్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పొంగులేటి అంశంపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. సభాసంఘం అంశాన్ని వదిలేసి సీఎం కులాల ప్రస్తావన తీసుకొచ్చారని పేర్కొన్నారు. కడియం, దానం ఏ పార్టీ సభ్యులని వారికి మాట్లాడే అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. మీరు ఏ పార్టీ వారో చెప్పాలని కౌశిక్ రెడ్డి అడిగారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో అసెంబ్లీలో ఏ కమిటీలు లేవని తలసాని తెలిపారు. స్పీకర్‌ను దళితుడుఅని మేం ఎప్పుడూ భావించలేదని అన్నారు. ఉన్నతమైన వ్యక్తిగానే స్పీకర్‌ను గౌరవించామని పేర్కొన్నారు. మా డిమాండ్‌పై నిరసన తెలియజేస్తుంటే, అటెన్షన్ డైవర్ట్‌లో భాగంగా కులాలకు అంటగట్టే ప్రయత్నం సిఎం రేవంత్ రెడ్డి చేశాడని తెలిపారు. నా వెంట్రుక పీకలేరని కడియం శ్రీహరి వ్యవహారశైలి ఉందన్నారు. సబ్ ఆర్డర్ లేనప్పుడు అనేక అంశాలు జరుగుతుంటాయని చెప్పారు. భట్టి విక్రమార్క అంటే బీఆర్ఎస్‌కు గౌరవమని తెలిపారు. ఆనాడు భట్టి విక్రమార్క పాదయాత్ర చేశాడని ముఖ్యమంత్రి గుర్తుచేశాడని.. భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. సభలో అధికార పార్టీ సభ్యుల చేత బీఆర్ఎస్ ను తిట్టించారని తెలిపారు. వెనుకబడి తరగతుల పద్దుల విషయంలో చర్చపై వాస్తవాలు బయటకొస్తాయనే డైవర్షన్ పాలిటిక్స్ ఏస్తున్నారని మండిపడ్డారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి వేల కోట్లు పెడుతున్నామని చెప్పి, వంద రూపాయల ఖర్చు చేయలేదని తెలిపారు.సిఎం రేవంత్ రెడ్డి మమ్మల్ని పండబెట్టి తొక్కుతామని అన్నాడని.. ఆ వ్యాఖ్యలను కూడా ఎథిక్స్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. ఒక మంత్రి ఏమో హౌస్ కమిటీకి అంగీకారం చెబుతాడు.. ముఖ్యమంత్రి ఏమో సీబీ సీఐడీ విచారణ చేయిస్తానని అంటున్నాడు తెలిపారు. మంత్రులకు, ముఖ్యమంత్రికి మధ్యనే సఖ్యత లేదని అన్నారు. సభలో మాట్లాడటానికి బీఆర్ఎస్ సభ్యులకు మైక్ ఇవ్వడం లేదని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ప్రశ్నిస్తున్నామనే భయంతోనే బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారని తెలిపారు. కాంగ్రెస్ దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుతున్నారని.. మరి ఆయనకు తెలంగాణలో అరాచకాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.యూరియా కోసం రైతులు క్యూలైన్లు కడుతున్నదని కనబడటం లేదా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఇచ్చిన హామీలు కప్పిపుచ్చుకు నేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలే కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెడతారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ సర్కార్‌కు తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. అంబేద్కర్ అభయహస్తం ఏమైందని ప్రశ్నించారు. గిరిజనులకు సబ్‌ప్లాన్ ఏమైందని అడిగారు.

## కుండలో ప్రాచీన నాణేలు

### అశ్వాపురం మండలంలో బయటపడిన వైనం

### 12వ శతాబ్దానికి చెందినవిగా గుర్తింపు

**అశ్వాపురం ప్రభాతవార్త, మార్చి 29;** అశ్వాపురం మండలంలోని కాకతీయులు నిర్మించిన ప్రసిద్ధిగాంచిన తుమ్మలచెరువుకు కూత వేటు దూరంలో ఉంటుంది.ఇటీవల ఈ గ్రామంలో జరిగిన ఒక సంఘటన మండల వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.ప్రభాత వార్త సేకరించిన వివరాల ప్రకారం ఒక రైతు తన పొలాన్ని చదును చేయటానికి పొలంలో వున్న మట్టిని తరలించి తన పొలాన్ని ఎత్తు పల్లాలు లేకుండా చదును చేసి ఇవ్వాలని మండలానికి సంబంధించిన ఒక జెసిబి ఓనర్ కు అప్పజెప్పాడు. జెసిబి డ్రైవర్ ట్రాక్టర్లకు మట్టి లోడింగ్ చేస్తున్న క్రమంలో ఆ జెసిబి బకెట్లో ఒక కుండ ఇరికి అది పగిలిపోయి దానిలో ఉన్న నాణేలు చెల్లాచెదురుగా పడిపోవడంతో ఆ ప్రాంతంలో ఆ జెసిబి డ్రైవర్ తో పాటు ఆ జెసిబి కింద మట్టి తోలుతున్నటువంటి ట్రాక్టర్ల డ్రైవర్లు వాటిని గుట్టు చప్పుడు కాకుండా గుప్తనిధులు దొరికిన చందంగా తీసుకొని వెళ్లి భద్రపరుచుకున్నారు. కొంతమంది ఈ నాణేల ను తమ చరవాణిలో స్టేటస్ లు కూడా పెట్టుకొని కొంతసేపటి తరువాత తొలగించినట్లు సమాచారం. ఇవి రాగి నాణాలు మాత్రమేనా,ఇంకా ఏమైనా దొరికినవి ఉన్నాయా అనేది కూడా అంతుచిక్కని వ్యవహారం.ఈ విషయం తెలిసిన కొంతమంది గ్రామ ప్రజలు వాటి వివరాలు సేకరించి వాటినీ ఏఐ పరిజ్ఞానం ఉపయోగించి వివరాలు చూడగా అవి 12 వ శతాబ్దం 13వ శతాబ్దం నకు సంబంధించిన రాగి నాణేలు గా గుర్తించారు.పిల్లీ వచ్చే ఎలుకా భద్రం అన్నట్లుగా గుట్టు చప్పుడు కాకుండా గత మూడు నాలుగు రోజులుగా దాగిన ఈ విషయం ప్రభాతవార్త చేతికి చిక్కింది. అశ్వాపురం మండల వ్యాప్తంగా దీనిపై చాలా వదంతులు ఏర్పడ్డాయి.ఇవి ఏ మేరకు లభ్యమయ్యాయి అనే సంకోచం కూడా మండల ప్రజల్లో లేకపోలేదు.మొండికుంట గ్రామ పంచాయతీలో హాబిటేషన్ గ్రామమైన బిజీ కొత్తూరు ప్రాంతం గతంలో కాకతీయులు ఏలిన ప్రాంతంగా పేరు ఉంది. ఈ ప్రాంతంలో కాకతీయుల నిర్మించిన ప్రసిద్ధి గాంచిన తుమ్మలచెరువు వారు నిర్మించిన గుడులు ఎందుకు నిదర్శనం. ఏదైనా పురాతన వస్తువులు దొరికినట్లైతే పురావస్తు శాఖ నిబంధనలను ప్రకారం శతాబ్ద కాలం నాటి వస్తువులు ఏవైనా దొరికితే వాటిని వారికి అప్పగించాలి. కానీ ఈ వ్యక్తులు దొరికినంత దోచుకొని దీనిని ఏమి చేయాలో అర్థం కాకుండా వారిలో వారు తగువ పెట్టుకుంటున్నట్టు సమాచారం. అసలు ఇవి ఏమిటి. ఎక్కడ నుండి వచ్చాయి. ఇవి ఏ శతాబ్దం కాలం నాటివి అనేది సంబంధిత శాఖ అధికారులు దృష్టిపెడితే ఈ ప్రాంతంలో మరింత పురాతన,పురావస్తు సంపద బయటపడి రేపటి తరాలకు పురావస్తు శాఖకు ఉపయోగపడే అవకాశం ఉంది.సమాజానికి ఆ దశాబ్దాల నాటి చరిత్ర తెలిసే అవకాశం ఉంది. ఈ విషయం పురావస్తు శాఖ అధికారులకు సంబంధిత శాఖల అధికారులకు తెలిసిందా, తెలిసినాకానీ స్పందించడం లేదా.. పురావస్తు శాఖ అధికారుల, సంబంధిత శాఖల అధికారుల మోనం లో అంతర్యం ఏమిటి. ఏది ఏమైనా చరిత్రకు సంబంధించిన అంశాలు ప్రభుత్వం దృష్టి పెట్టీ, ఏదైతే పురావస్తు సంపద దొరికిందో దానిని ప్రభుత్వం సేకరించి వాటి వివరాలు సమాజానికి తెలపాలని ఈ దిశగా ప్రభుత్వం పురావస్తు శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలని మేధావులు, మండల ప్రజలు కోరుతున్నారు.

# ఛేజింగ్‌లో చెలరేగిన రోహిత్, రికల్టన్

**ఛేజింగ్‌లో రోకో అదరగొడుతోంది. ఐపీఎల్ తొలి రోజు విరాట్ కోహ్లీ చెలరేగి ఆడితే... రెండో రోజు కోల్‌కతా నైట్ రైడర్స్‌పై రోహిత్ శర్మ పూనకం వచ్చినట్లే బ్యాట్‌తో ఊగిపోయాడు. రికల్టన్ కూడా తోడవడంతో 221 పరుగుల లక్ష్యం కూడా వీరి ముందు చిన్నబోయింది. 148 పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్‌తో కేకేఆర్ బౌలర్లను కుమ్మేశారు. దీంతో ముంబై ఇండియన్స్ ఐపీఎల్‌లో గ్రాండ్‌గా బోణీ చేసింది.**

## ముంబై బోణీ





**ముంబై:** వాంఖడే వేదికగా జరిగిన ఐపీఎల్ రెండో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ దుమ్మురేపింది. సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో 221 పరుగుల లక్ష్యాన్ని మరో5బంతులు మిగిలి ఉండగానే 4వికెట్లు కోల్పోయి అందుకుంది. ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ(38 బంతుల్లో 78), రికల్టన్(43 బంతుల్లో 81) చెలరేగి ఆడారు. ఇద్దరూ సిక్స్‌ల వర్షం కురిపించారు. రోహిత్ శర్మ 6 సిక్స్‌లు, రియల్టన్8 సిక్స్‌లు మొత్తం 14 సిక్స్‌లు బాదారు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లో మూడు సిక్స్‌లు, మూడో ఓవర్లో 2 సిక్స్‌లు, వరుణ్ ఓవర్లో 4,6,4, కార్తిక్ ఓవర్లో 2 సిక్స్‌లు... ఇలా పవర్ ప్లేలోనే 80 రన్స్ చేశారు. 12 ఓవర్లోనే 148 రన్స్ అందించారు.

కేకేఆర్‌తో మ్యాచ్ అంటేనే పూనకం వచ్చినట్లు ఊగిపోయే హిట్‌మ్యాన్, మరోసారి అదే తరహా ప్రదర్శనతో రెచ్చిపోయి ఐపీఎల్ చరిత్రలో ఈ ఫ్రాంచైజీపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ మ్యాచ్‌కు ముందు వరకు ఈ రికార్డు డేవిడ్ వార్నర్ (1093 పరుగులు) పేరిట ఉండేది. ఈ మ్యాచ్‌లో రోహిత్ కేవలం 23 బంతుల హాఫ్ సెంచరీ సాధించాడు. ఐపీఎల్‌లో ఇదే రోహిత్‌కు ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ, అంతకుముందు 2015 ఎడిషన్‌లో సీఎస్‌కేపై 25 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. ఈ హాఫ్ సెంచరీతో రోహిత్ ఐపీఎల్‌లో మరో మైలురాయి అందుకున్నాడు. ఈ హాఫ్ సెంచరీ రోహిత్‌కు ఐపీఎల్‌లో 50వది.

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. అజింక్యా రహానే కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కేకేఆర్‌కు మెరుపు ఆరంభాన్ని అందించాడు. కేవలం 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అతను.. మొత్తంగా 40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 67 పరుగులు సాధించాడు. రహానేకు జతగా మరో ఓపెనర్ ఫిన్ అలెన్ కూడా చెలరేగిపోయాడు. కేవలం 17 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులు చేశాడు. తొలి వికెట్‌కు 69 రన్స్ అందించారు. అలెన్ ఔటయ్యాక వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన గ్రీన్.. 10 బంతుల్లో బౌండరీ, సిక్సర్ సాయంతో 18 పరుగులు చేసి ఔటయ్యాడు.

గ్రీన్ ఔటయ్యాక క్రీజ్‌లోకి వచ్చిన రఘువంశీ ఆరంభంలో కాస్త నిదానంగా ఆడినా, ఆ తర్వాత బ్యాట్ ఝులిపించాడు. 29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగులు చేసి ఔటయ్యాడు. రఘువంశీ మెరుపుల కారణంగానే కేకేఆర్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. వైస్ కెప్టెన్ రింకూ కూడా 21 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 33 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ మూడు వికెట్లు, హార్దిక్ పాండ్యా ఓ వికెట్ తీశాడు.








# చెన్నై, రాజస్థాన్‌లో బోణీ ఎవరిదో?

**గౌహతి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు మరో ఆసక్తికర పోరు జరగనుంది. గౌహతి వేదికగా అయిదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ... రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. ఇరు జట్లలోనే హార్డ్ హిట్టర్లు ఉండడంతో ఈ మ్యాచ్ లోనూ పరుగుల వరద ఖాయం.

గత సీజన్‌లో ఈ రెండు జట్లు కూడా పేలవ ప్రదర్శనతో లీగ్ స్టేజ్ లోనే నిష్క్రమించాయి. ఈ సారి భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నాయి. ఎంఎస్ ధోనీ గాయం సీఎస్‌కేకు లోటుగా మారిగా, సంజూ శాంమ్సన్ చెన్నై జట్టులోకి రావడం అనుకూలంగా మారింది. టీ ట్వంటీ ప్రపంచకప్ నాకౌట్ స్టేజ్‌లో దుమ్మురేపి టీమిండియాకు కప్ అందించిన సంజూ శాంమ్సన్... అదే ఊపును ఐపీఎల్‌లోనూ కొనసాగించడంపై దృష్టి సారించాడు. చెన్నై ఈసారి యువ ఆటగాళ్లపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది. ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్ కొత్త ఉత్సాహాన్ని తీసుకురాగా, శివమ్ దూబేతో పాటు ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మలు మ్యాచ్ ఫినిషర్లుగా ఉన్నారు. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంకు తోడు సంజు శాంమ్సన్ బహుముఖ ప్రజ్ఞ జట్టుకు సమతుల్యతను చేకూరుస్తాయి. అయితే, పిక్క కండరాల గాయం కారణంగా జట్టుకు దూరమైన ఎం.ఎస్. ధోనీ లేకుండానే ఈ మ్యాచ్ జరగనుంది ఇది జట్టుకు ఆరంభంలోనే ఎదురైన ఒక ఎదురు దెబ్బ. బౌలింగ్‌లోనూ చెన్నై పటిష్టంగా ఉంది.

రాజస్థాన్ జట్టు ఓపెనింగ్ జోడీ రాణిస్తే దానికి తిరుగుండదు. యశస్వి జైస్వాల్‌తో కలిసి యంగ్ డైనమైట్ వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్ ఓపెన్ చేస్తారు. వీరిద్దరు ఫ్లయింగ్ స్టార్ట్ ఇస్తే భారీ స్కోరు ఖాయం. గత సీజన్‌లో ఇబ్బందిపడిన మిడిల్‌ఆర్డర్‌లో ఇప్పుడు రవీంద్ర జడేజా రాకతో బలోపేతమైంది. దీనికి తోడు షిమ్రాన్ హెట్మైర్, ధ్రువ్ జూరెల్ రాణించాల్సి ఉంటుంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్‌తో పాటు అనుభవజ్ఞుడైన సందీప్ శర్మ రూపంలో పేస్ అటాక్ ఉంది. రవి బిష్ణోయ్ చేరిక స్పిన్ బౌలింగ్ విభాగానికి వైవిధ్యాన్ని చేకూర్చింది. రెండు జట్లు తలపడినపుడు చెన్నై పైచేయిగా ఉంది.

**రెండు జట్ల వివరాలు**

**రాజస్థాన్ రాయల్స్ తుది జట్టు(అంచనా):** యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ప్రిటోరియస్, రియాన్ పరాగ్(కెప్టెన్), షిమ్రాన్ హెట్మైర్, రవీంద్ర జడేజా, ధృవ్ జురెల్, జోఫ్రా అర్చర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్, నండ్రె బర్గర్. **ఇంఫాక్ట్ ప్లేయర్:** శుభమ్ దూబే/ తుషార్ దేష్‌పాండే

**చెన్నై సూపర్ కింగ్స్ తుది జట్టు(అంచనా):** ఆయుష్ మాత్రే, సంజూ శాంమ్సన్, రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), డీవాల్డ్ బ్రెవిస్, శివమ్ దూబే, కార్తిక్‌శర్మ, ప్రశాంత్ వీర్, రాహుల్ చాహర్, నూర్ ఆహ్మద్, ఖలీల్ ఆహ్మద్, మాట్ హెన్రీ **ఇంఫాక్ట్ ప్లేయర్:** జేమీ ఓవర్టన్

## పోలీస్ ఫుట్‌బాల్‌లో తెలంగాణకు రెండో ఓటమి

**హైదరాబాద్, మార్చి 29(వార్త క్రీడా ప్రతినిధి):** హైదరాబాద్ అతిథ్యమిస్తున్న అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ పురుషుల జట్టు వరుసగా రెండో ఓటమి పొందింది. గ్రూప్-ఎఫ్‌లో పోటీపడుతున్న తెలంగాణ... రెండో మ్యాచ్‌లో 0-3 గోల్స్‌తో రాజస్థాన్ చేతిలో ఓడింది. పూర్తి సమయంలో గోల్ చేయడంలో తెలంగాణ విఫలమైంది. మరోవైపు చక్కని పాసింగ్‌లతో రాజస్థాన్... తెలంగాణ డిఫెన్స్‌ను చేధిస్తూ మూడు గోల్స్ సాధించింది. మరో మ్యాచ్‌లో అస్సాం రైఫిల్స్ 5-0 గోల్స్ తేడాతో చండీఘర్‌పై విజయం సాధించి గ్రూప్-ఎఫ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. కాగా మహిళల గ్రూప్‌ఎలో ఎస్ఎస్‌బి గోల్స్ వర్షం కురిపించింది. ఏకంగా 16-0 గోల్స్‌తో జార్ఖండ్‌పై గెలుపొందింది. మరోమ్యాచ్‌లో సిఐఎస్ఎఫ్ ఏకైక గోల్‌తో సీఆర్‌పిఎఫ్‌పై విజయం సాధించింది. ఏప్రిల్ 5 వరకు జరగనున్న అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ మ్యాచ్‌లు.. గచ్చిబౌలీలోని జీఎంసీ స్టేడియంతో పాటు ఆర్టిలరీ గోల్కొండ, శ్రీనిధి, అజీజ్‌నగర్ గ్రౌండ్‌లో జరుగుతున్నాయి.


పోలీస్ ఫుట్‌బాల్ గ్రూప్-ఎఫ్‌లో పోటీపడుతున్న తెలంగాణ, రాజస్థాన్ జట్లు



## కిమి అంటోనెల్లి రికార్డ్ విన్

### వరుసగా రెండో గ్రాండ్ ప్రి ఫార్ములా వన్ కైవసం

**సుజుకా(జపాన్):** 19ఏళ్ల ఇటాలియన్ ఫార్ములా వన్ డ్రైవర్ కిమి అంటోనెల్లి... జపాన్ గ్రాండ్ ప్రి గెలుపొందాడు. రెండు వారాల్లో మెర్సిడెస్‌కు డ్రైవన్‌కు ఇది రెండో గ్రాండ్ ప్రి విజయం. బ్యాక్ టు బ్యాక్ విజయాలతో ప్రపంచ ఛాంపియన్ షిప్ రేసులో టాప్ పొజిషన్‌లోకి దూసుకెళ్లాడు. ఫార్ములా వన్ చరిత్రలో ప్రపంచ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన అతిపిన్న వయస్కుడిగా నిలిచాడు.

కిమి అంటోనెల్లి పోల్ పొజిషన్‌తో జపాన్ గ్రాండ్ ప్రి ఫైనల్ రేసును ప్రారంభించాడు. పేలవమైన ఆరంభంతో వెనకబడ్డాడు, రేసు మధ్యలో వచ్చిన సెఫ్టీ కార్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అంటోనెల్లి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. చివరి ల్యాప్‌లలో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్త్రి, ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్లెర్క్‌లను వెనక్కి నెట్టాడు. 45 సెకన్ల స్వల్ప తేడాతో అగ్రస్థానంతో రేసు పూర్తి చేసి విజేతగా ఆవిర్భవించాడు. రెండు వారాల కిందట చైనా గ్రాండ్ ప్రి నెగ్గి సంచలనం సృష్టించిన కిమి అంటోనెల్లి... వరుసగా రెండో ఫార్ములా వన్ టైటిల్ అందుకున్నాడు. గత నాలుగేళ్లుగా జపాన్ గ్రాండ్ ప్రిలో విజయం సాధిస్తున్న రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్... 11వ స్థానం నుండి రేసు ప్రారంభించి ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఫినిషింగ్ లైన్ దాటగానే కిమి అంటోనెల్లి సంబరాల్లో మునిగిపోయాడు.

ఈ రోజు తన వేగం అద్భుతంగా ఉందని రేసు ముగిసిన తర్వాత కిమి అంటోనెల్లి సంతోషం వ్యక్తం చేశాడు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బహ్రెయిన్, సౌదీ అరేబియా గ్రాండ్ ప్రి రేసులు రద్దు చేశారు. దీంతో మే3న జరిగే మియామి గ్రాండ్ ప్రి వరకు సుదీర్ఘ విరామం లభించనుంది.

## మియామి విజేత సబలెంకా



**మియామి:** టాప్ సీడ్ సబలెంకా వరుసగా రెండో టైటిల్ అందుకుంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో 6-2, 4-6, 6-3తో కోకో గాఫ్‌ను ఓడించి మియామి ఓపెన్ టైటిల్ సొంతం చేసుకుంది. ఇటీవల ఇడియన్ వెల్స్ టైటిల్ నెగ్గిన సబలెంకాకు ఇది వరుసగా రెండో టైటిల్. అలాగే వరుసగా రెండో మయామి ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుంది. బెలారస్‌కు చెందిన ప్రపంచ నంబర్ వన్ సబలెంకా.. తొలి సెట్‌ను అలవోకగా గెలుపొందింది. రెండో సెట్‌లో పుంజుకున్న కోకో గాఫ్ ... సబలెంకా జోరుకు బ్రేక్ వేస్తూ సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే కీలక మూడో సెట్‌లో సబలెంకా ముందు కోకో గాఫ్ నిలవలేకపోయింది. బలమైన ఏస్‌లతో విరుచుకుపడింది. హార్డ్‌కోర్ట్ డబ్ల్యుటిఎ1000లో వరుసగా రెండు టైటిల్స్ నెగ్గిన అయిదో క్రీడాకారిణిగా, రెండో బెలారస్ భామగా నిలిచింది. ఒకే ఏడాదిలో రెండుటైటిళ్లను గెలుచుకున్న స్వియాటెక్, స్టెఫీ గ్రాఫ్, కిమ్ క్లిస్టర్స్, విక్టోరియా అజరెంకాల సరసన సబలెంకా చేరింది.

## ఈవారంలో 4 కంపెనీల లిస్టింగ్

**ముంబయి, మార్చి 29:** కొత్తవారంలో నాలుగు మెయిన్‌బోర్డు ఐపిఒలు మార్కెట్లకు వస్తున్నాయి. కేంద్ర గనుల ప్రణాళిక డిజైన్ సంస్థ సిఎంపిడిఐ ఈనెల 30వ తేదీ లిస్ట్ అవుతుంది. పవరికా లిమిటెడ్, సాయి పేరెంటరల్స్, అమీర్‌చంద్ జగదీష్ ఖుమార్‌లు ఏప్రిల్ 2వ తేదీ లిస్ట్ అవుతాయని తెలుస్తోంది. సోమవారం కోల్ ఇండియా అనుబంధ సంస్థ సిఎంపిడిఐ ఎన్ఎస్, బిఎస్ఇల్లో లిస్ట్ అవుతుంది. ఇష్యూ ధర రూ.172గానిర్ణఇంచారు. ఐపిఒనుంచి 1842 కోట్లు ఆఫర్ ఫర్ సేల్‌గా నిర్వహిస్తారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో బిడ్లు దాఖలయ్యాయి.




సంస్థాగత బయ్యర్లు 3.48 రెట్లు ఎక్కువ బిడ్లు దాఖలుచేస్తే ఇతర ఇన్వెస్టర్లు 35శాతం, రిటైల్ ఇన్వెస్టర్లు 33శాతం కోటాకు బిడ్లు వేసి సాధించారు. అలాగే పవరికా ఐపిఒ కూడా రూ.1100 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. తాజా ఇష్యూలో రూ.700 కోట్లు ఆఫర్ ఫర్‌సేల్ కింద రూ.400 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఇష్యూధర రూ.395గా నిర్ణయిస్తారు. ఈ కొనుగోళ్లు 24నుంచి 27 మధ్యలోనే పూర్తిస్థాయిలో బుక్ అయ్యాయి. సంస్థాగత బయ్యర్లు 4.74 రెట్లు ఎక్కువ బుక్‌చేసారు. ఇతర ఇన్వెస్టర్లు కేగిరీ 47శాతం, రిటైలర్లు 16శాతం చొప్పున బుక్‌చేసుకున్నారు. ఇక సాయి పేరెంటరల్స్ ఐపిఒ రూ.409 కోట్లుగా ఉంది. 285కోట్లు తాజా ఇష్యూలోను, రూ.124 కోట్లు ఆఫర్‌ఫర్‌సేల్‌గాను ఉండుంది. ఇష్యూ రిటైల్‌కేటగిరీలో 12శాతం, అర్హత కలిగిన సంస్థాగత ఇన్వెస్టర్లు 1,73శాతం, ఇతరులు 2.45రెట్లు కొనుగోలుచేసారు. ఇష్యూధర రూ.392గా ఉంది. ఇక అమిర్‌చంద్ జగదీష్‌కుమార్‌కంపెనీ ఐపిఒ రూ.440 తాజా ఇష్యూగా ఉంది. రిటైల్‌కేటగిరతలో 1.44 రెట్లు క్యూఐబిలో 1.18 రెట్లు, ఇతర కేటగిరీలో 13.40 రెట్లు బిడ్లు కొనుగోళ్లు జరిగాయి. ఏరోప్లేన్ బ్రాండ్‌మీద కంపెనీ బాస్మతి బియనయం ఎగుమతులుచేస్తుంది. ఇతరబ్రాండ్లు లా టేస్ట్, ఆలిబాబా, వరల్డ్ కప్‌ఫేర్లమీద కూడాచేస్తుంది. ఇక ఇష్యూధర రూ.212గా నిర్ణయించింది.


## 1.75 లక్షల కోట్లు క్షీణించిన ఎంక్యాప్




**ముంబయి, మార్చి 29:** ఈక్విటీ మార్కెట్లలోని టాప్ పది కంపెనీల్లో ఏడు సంస్థల మార్కెట్ విలువలు రూ.1.75లక్షలకోట్లు క్షీణించాయి. శెలవులు ఎక్కువ ఉన్న చిన్నవారంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా నష్టపోయింది. సంస్థ మార్కెట్ విలువలు రూ.89,720.3కోట్లు క్షీణించి రూ.18,24,515.62 కోట్లుగా ఉంది. హెచ్‌డిఎఫ్‌సి విలువలు రూ.37,248.59 కోట్లు క్షీణించి రూ.11,64,018.69 కోట్లుగా ఉన్నాయి. ఎస్‌బిఐ 35,399.42కోట్లు క్షీణించి 9,41,569.15 కోట్లుగా ఉంది.ఇక ఐసిఐసిఐబ్యాంకు ఎంక్యాప్ రూ.8,121.76 కోట్లు ఆవిరి అయి రూ.8,83,551.30 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ రూ.2480.42 కోట్లు దిగజారి రూ.10,50,413.33 కోట్లుగా ఉంది. హిందూస్థాన్ యూనిలీవర్ ఎంక్యాప్ రూ.2091.13కోట్లు తగ్గి 4,87,540.19 కోట్లుగా ఉంది. టిసిఎస్ కూడా 271.35 కోట్లు పతనం అయి రూ.8,64,668.65 కోట్లుగా ఉంది. ఇక ఎల్అండ్ విలువలు మాత్రం రూ.18,051.68 కోట్లుపెరిగి రూ.4,90,536.19 కోట్లకు చేరింది.బజాజ్‌ఫైనాన్స్ ఎంక్యాప్ కూడా 8680.36 కోట్లుపెరిగి రూ.5,25,395.48 కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ రూ.6245.3 కోట్లు పెరిగి రూ.5,15,034.67 కోట్లకు పెరిగింది. వరుసక్రమంలో రిలయన్స్ నంబర్‌వన్‌గా నిలిస్తే తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్; ఎల్‌అండ్‌టి, హిందూస్థాన్‌యూనిలీవర్‌లు వరుసగా పది ర్యాంకులు సాధించాయి.

# రూపాయి కట్టడికి ఆర్బీఐ ఎన్వోపీ పరిమితి

**మంబయి, మార్చి 29:** భారత కరెన్సీ రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్లో వరుసగా పడిపోతుండటంతో రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగింది. రూపాయి పతనం కట్టడికి, మార్కెట్లో గందరగోళాన్ని తగ్గించేందుకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.ప్రస్తుతం రూపాయి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో దేశంలోని అన్ని బ్యాంకులు తమ వద్ద ఉండే విదేశీ కరెన్సీ నిల్వలపై పరిమితిని పాటించాలి. ప్రతి రోజూ వ్యాపార సమయం ముగిసే సమయానికి భారత రూపాయికి వ్యతిరేకంగా బ్యాంకులు ఉంచుకునే నెట్ ఓపెన్ పొజిషన్ 100 మిలియన్ డాలర్లకు మించకూడదు. ఈ నిబంధనను ఏప్రిల్ 10వ తేదీలోగా అన్ని బ్యాంకులు అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఎన్‌వోపీ పరిధి బిలియన్ డాలర్లుగా ఉంది. గత కొద్ది రోజులుగా రూపాయి విలువ వరుసగా రికార్డు స్థాయి కనిష్టాలకు పడిపోతోంది. ఫిబ్రవరి చివరలో మొదలైన పశ్చిమ ఆసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ (ముడి చమురు) ధరలు భారీగా పెరిగాయి. దీని ప్రభావం నేరుగా రూపాయిపై పడింది.




పెట్టుబడుల ఉపసంహరణ. విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి తమ డబ్బును వేగంగా వెనక్కి తీసుకుంటున్నారు. దీనివల్ల డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి బలహీనపడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూపాయి విలువ దాదాపు 10 శాతం కంటే ఎక్కువ పడిపోయింది. 2011-12 తర్వాత రూపాయికి ఇది అత్యంత దారుణమైన ఏడాదిగా నిలిచింది. శుక్రవారం నాటికి డాలర్ విలువ రూ. 94.84 వద్ద ఆల్‌టైమ్ రికార్డు కనిష్టానికి చేరింది. త్వరలోనే ఇది రూ. 95 మార్కును దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్యాంకులు సాధారణంగా తమ లాభాల కోసం డాలర్లను కొని ఉంచుకుంటాయి. ఇలా బ్యాంకులు పెద్ద ఎత్తున డాలర్లను హోల్డ్ చేయడం వల్ల మార్కెట్లో రూపాయి విలువ ఒక్కసారిగా పడిపోయే ప్రమాదం ఉంది. ఆర్‌బీఐ పెట్టిన 100 మిలియన్ డాలర్ల పరిమితి వల్ల బ్యాంకులు ఇష్టానుసారంగా డాలర్లను నిల్వ ఉంచలేవు. దీనివల్ల మార్కెట్లో డాలర్ల లభ్యత పెరిగి రూపాయి విలువ పడిపోకుండా అడ్డుకట్ట వేయవచ్చు.

రూపాయి విలువలో వచ్చే అనవసరపు హెచ్చుతగ్గులను నియంత్రించడానికి ఇది ఒక బ్రేక్ లాగా పనిచేస్తుంది. గతంలో బ్యాంకులు తమ మూలధనంలో 25 శాతం వరకు ఇలాంటి పొజిషన్లు ఉంచుకునే వీలుండేది కానీ ఇప్పుడు ఆర్‌బీఐ నేరుగా ఒకపరిమితిని విధించడం ద్వారా పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి కేంద్ర బ్యాంకు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతవరకు సఫలమవుతుందో వేచి చూడాలి.

# వచ్చేనెలలో 14రోజులు బ్యాంకులకు సెలవులు

**ముంబయి, మార్చి 29:** ప్రతి నెల మాదిరిగానే ఏప్రిల్ నెలలో కూడా బ్యాంకు సెలవులు ఎక్కువ ఉన్నాయి. ఆర్‌బిఐ కేలండర్ ప్రకారం చూస్తే ఏప్రిల్‌లో బ్యాంకులు మొత్తం 14 రోజుల పాటు మూతపడతాయి. వీటిలో 2 శనివారాలు, 4 ఆదివారాలు సహజంగానే సెలవులు. ఖాతాదారులు తమ బ్యాంకింగ్ సంబంధిత కార్యకలాపాలు, ప్రయాణాలు, వ్యక్తిగత లావాదేవీల పనుల గురించి ముందుగానే ఏప్రిల్ 2026 బ్యాంకు సెలవుల జాబితా తెలుసుకోవడం ముఖ్యం.




ఏప్రిల్ నెలలో ప్రాంతీయ పండుగలు, ప్రభుత్వ సెలవులు, వారాంతాలు వంటి సెలవులున్నాయి. నెట్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ వంటి ఆన్‌లైన్ సేవలు సాధారణంగా పనిచేస్తాయి. ఏప్రిల్ 1 ఆర్థిక సంవత్సర ముగింపు కారణంగా దేశంలోని దాదాపు అన్ని బ్యాంకులకు సెలవు. రెండోతేదీ మోండీథర్స్ డే సందర్భంగా కొచ్చి, తిరువనంతపురంలోని బ్యాంకులకు సెలవు. మూడో తేదీ గుడ్ ఫ్రైడే సందర్భంగా అగర్తలా, చండీగఢ్, గౌహతి, జైపూర్, జమ్మూ, శ్రీనగర్ మినహా అన్ని రాష్ట్రాలలోని బ్యాంకులకు సెలవు. 11, 12 తేదీలో శని ఆదివారాలు సెలవులు. 14వ తేదీ బి.ఆర్. అంబేద్కర్ జయంతి, తమిళ నూతన సంవత్సరం, బైసాఖీ వంటి పండుగల సందర్భంగా ఐజ్వాల్, భోపాల్, చండీగఢ్, ఇటానగర్, కోహిమా, న్యూఢిల్లీ, రాయ్‌పూర్, షిల్లాంగ్, సిమ్లా మినహా అన్ని రాష్ట్రాలలోని బ్యాంకులకు సెలవు. 15వ తేదీ బెంగాలీ నూతన సంవత్సర దినంతోపాటు అగర్తల, గౌహతి, ఇటానగర్, కొచ్చి, కోల్‌కతా, సిమ్లా, తిరువనంతపురంలలో బ్యాంకులకు సెలవు.

16వ తేదీ బోహాగ్ బిహు సందర్భంగా గువాహతిలో బ్యాంకులకు సెలవు. 19వ తేదీ ఆదివారం ఆ తర్వాత 20వ తేదీ బసవ జయంతి, అక్షయ తృతీయ సందర్భంగా బెంగళూరులోని బ్యాంకులకు సెలవు. 21వ తేదీ గరియా పూజ సందర్భంగా అగర్తలా బ్యాంకులకు సెలవు. 25,26 తేదీలు చివరి శని ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సెలవులుంటాయి. బ్యాంక్‌లకు ఏప్రిల్ నెలలో దాదాపు సగం రోజులు సెలవులు ఉండడంతో పెద్ద ఎత్తున వ్యాపారం చేసే వ్యాపారులు, ఇతరులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.


### మార్కెట్ల నుంచి రూ.1.14 లక్షలకోట్లు

## ఎఫ్‌పిఐల విత్‌డ్రా




**ముంబయి, మార్చి 29:** విదేశీ ఇన్వెస్టర్లు ఈనెలలో ఇప్పటివరకూ మార్కెట్లనుంచి రూ.1.14 లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతుండటం, డాలరుతోరూపాయి క్షీణించడం వంటివి పెట్టుబడులు విత్‌డ్రాపై ప్రభావంచూపించాయి. గతంలో రూ.94,017 కోట్లు విత్‌డ్రా అయిన సందర్భాలున్నాయి. 2024 అక్టోబరులో మాత్రమే భారీ ఎత్తున పెట్టుబడులు విత్ డ్రా అయ్యాయి. మళ్లీ 2026 మార్చినెలలోనే భారీస్థాయిలో ఈక్విటీలనుంచి ఎఫ్ఐఐలు విత్‌డ్రా చేసారు. మొత్తం విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఇప్పటివరకూ 1.27 లక్షలకోట్లు విత్‌డ్రా చేసినట్లు తేలింది. మార్చినెల మొత్తంగా కూడా విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. రూ.1,13,380 కోట్లు క్యాష్ మార్కెట్‌నుంచి విత్‌డ్రా అయ్యాయి. ఫిబ్రవరిలో అయితే ఎఫ్‌పిఐలు రూ.22,615కోట్లు పెట్టుబడులుపెట్టారు. గడచిన 17 నెలల్లో ఎన్నడూలేనంతగా గరిష్ట స్థాయిలో ఫిబ్రవరి పెట్టుబడులున్నా మార్చినెలలో మళ్లీ భారీ స్థాయిలో పెట్టుబడులు వెనక్కితీసుకున్నారు. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ మాట్లాడుతూ పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయి క్షీణత, గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు వచ్చే జమలు తగ్గడం వంటి ఆందోళనలే పెట్టుబడులు వెనక్కిపోయాయని చెప్పారు. వీటికితోడు ముడి చమురు దరలుపెరగడంతో భారత్ ఆర్థికవృద్ధి, కార్పొరేట్ రాబడులు వంటివి కూడా ఎఫ్‌పిఐలు విత్‌డ్రాకు దోహదంచేసాయన్నారు. అమెరికా బాండ్ల రాబడులు పెరగడం కూడా ప్రపంచ వ్యాప్తంగా నగదు లభ్యత మరింత క్లిష్టం అయింది. అయితే ఇతర వర్ధమాన దేశాల మార్కెట్లతో పోలిస్తే భారత్‌మార్కెట్ల తీరు మెరుగ్గానే ఉందని ఇన్వెస్ట్‌మెంట్ సలహా సంస్థలు చెపుతున్నాయి. ఇతర మార్కెట్లలోకూడా ఎఫ్‌పిఐలు అమ్మకాలకే మొగ్గుచూపించారు. తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లలో కూడా ఇదే తీరు కనిపించడం వెనుక యుద్ధవాతావరణమేనని తెలుస్తోంది.

## కెపిఎంజిలో వర్క్‌ఫోర్స్ తగ్గింపు




**మంబయి, మార్చి 29:** కన్సల్టెన్సీ సంస్థ కెపిఎంజి బ్రిటన్ విభాగం భారీ స్థాయిలో వర్క్‌ఫోర్స్ తగ్గించుకునేందుకు నిర్ణయించింది. ఆడిట్ డివిజన్‌లోనే ఎక్కువమందిపై వేటువేస్తోంది. సుమారు 600 మంది ఉద్యోగులకు ఇప్పటికే వర్తమానం పంపించిందని అంచనా. మరికొంతమందితో అంతర్గత సంప్రదింపులు కూడా కొనసాగిస్తోంది. తర్జనబర్జనల తర్వాత 440 మంది ఉద్యోగులు సంస్థను వీడే అవకాశం ఉంది. సంస్థల పరిధిలోని నాలుగు కీలక వాణిజ్యయూనిట్లలో బ్రిటన్ ఒకటిగా కొనసాగుతోంది. ఎక్కువగా అసిస్టెంట్‌మేనేజర్లు వృత్తిపరమైన అకౌంటింగ్ అర్హతలున్నవారికి ఎక్కువ ఉద్వాసన చెపుతోంది, మొత్తంగా లే ఆఫ్‌లు ఆరు శాతం వరకూ ఉంటుందని అంచనా.ప్రస్తుతం 7100మంది ఉద్యోగులు పనిచేస్తున్న కెపిఎంజి టెక్నాలజీ అప్‌డేషన్ భాగంగానే లే ఆఫ్‌లు తప్పడంలేదని చెపుతోంది. ప్రస్తుత మార్కెట్‌పరిస్థితుల్లో తరచూ కంపెనీలను వీడి వెళుతున్నవారు, కంపెనీలు మారుతున్నవారు తక్కువగానే ఉన్నారని అయితే ఎఐ, ఇతర టెక్ అప్‌డేట్‌లు కూడా అవసరం అవుతున్నందున యాంత్రీకరణ దిశగా నడుస్తున్నప్పటికీ ఆడిట్ విభాగంలోనే ఈ కోతలు ఎక్కువ ఉంటున్నట్లు తెలుస్తోంది.ఈ లేఆఫ్‌లు ఒక్క కెపిఎంజికే పరిమితం కాలేదు. మెకిన్‌సే కూడా 10శాతం వర్క్‌ఫోర్స్‌ను వచ్చే రెండేళ్లలో తగ్గించాలని నిర్ణయించింది.ఎఐ అమలుతో ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ కూడా వర్క్‌ఫోర్స్ తగ్గింపువైపు చూస్తోంది. కొత్తటూల్స్‌పై అవగాహన పెంచుకోవాలని కంపెనీ హెచ్చరించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.